ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 1
జిల్లా వార్తలు
శుక్రవారం 26, ఏప్రిల్ 2024





చీమకుర్తిలో జనకెరటంలా సాగుతున్న ర్యాలీ (ఇన్‌సెట్‌లో) అభివాదం చేస్తున్న బీఎన్, టీడీపీ నాయకులు

జిల్లాలోని చీమకుర్తి, మార్కాపురం పసుపుమయమయ్యాయి. టీడీపీ అభ్యర్థులు బీఎన్ విజయ్‌కుమార్, కందుల నారాయణరెడ్డి నామినేషన్‌ల సందర్భంగా రెండు పట్టణాలూ గురువారం జన జాతరలా మారాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలు అదుర్స్ అనిపించాయి. తెలుగు తమ్ముళ్లతోపాటు పార్టీ అభిమానులు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. చీమకుర్తిలో బీఎన్‌కు, మార్కాపురంలో కందులకు అడుగడుగునా హారతులు ఇచ్చారు. వారిపై పూలవర్షం కురిపించారు. ఎండ, వేడిగాలుల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ వేలాది మంది ర్యాలీల్లో ఉత్సాహంగా పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు.

చివరి రోజు అదుర్స్

బీఎన్, కందుల నామినేషన్లకు పోటెత్తిన జనం

- చీమకుర్తి, మార్కాపురం పసుపుమయం
- రెండు చోట్లా భారీ ర్యాలీలు
- మండుటెండలోనూ ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు
- ముగిసిన నామినేషన్‌ల దాఖలు
- నేడు పరిశీలన



మార్కాపురం ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారాయణరెడ్డి, రాఘవరెడ్డి

ఒంగోలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు గురువారంతో ముగిసింది. చివరిరోజు కూడా ఒంగోలు పార్లమెంట్‌తోపాటు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు భారీగానే దాఖలయ్యాయి. ఇప్పటికే నామినేషన్లు వేసిన పలువురు మరికొన్ని సెట్లను చివరి రోజున తిరిగి సమర్పించారు. స్వతంత్రులు, చిన్నచిన్న పార్టీల అభ్యర్థులు పెద్దసంఖ్యలో వేశారు. శుక్రవారం అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్‌లను పరిశీలించనున్నారు. ఇదిలా ఉండగా నామినేషన్‌ల దాఖలు కార్యక్రమంలో ప్రత్యర్థి వైసీపీ కంటే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీడీపీ అభ్యర్థులు చివరి రోజైన గురువారం కూడా అదే జోరు కొనసాగించారు. టీడీపీ సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్‌విజయ్‌కుమార్, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డిల నామినేషన్‌ల సందర్భంగా చీమకుర్తి, మార్కాపురంలలో ఆపార్టీ శ్రేణులు భారీ ర్యాలీలు నిర్వహించాయి. రెండు పట్టణాలు పసుపుమయమయ్యాయి. వేలాదిగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లతోపాటు జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ ర్యాలీల్లో పాల్గొని మద్దతు తెలిపారు.

సంతనూతలపాడులో జనకెరటం

సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ ఉదయం పలు దేవాలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఒంగోలు మర్రిచెట్టు కాలనీలోని తన నివాసం నుంచి 10 గంటల సమయంలో చీమకుర్తికి బయల్దేరారు. అప్పటికే పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు అక్కడికి చేరుకొని ఆయన్ను అనుసరించారు. సంతనూతలపాడు నియోజకవర్గం ప్రారంభమయ్యే నగర పరిధిలోని సమతానగర్ వద్ద టీడీపీ, జనసేన యువకులు పెద్దఎత్తున స్వాగతం పలికి అక్కడి నుంచి వారు ముందు భాగాన బైక్ ర్యాలీ నిర్వహించారు. సంతనూతలపాడు సమీపంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీ క్రేన్‌లతో బీఎన్ విజయ్‌కుమార్, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, జనసేన నేత కందుకూరి బాబులకు గజమాలలు వేశారు. సంతనూతలపాడు దాటాక మైనంపాడు కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటల సమయంలో బీఎన్ బృందం చీమకుర్తి హరిహరిక్షేత్రం వద్దకు చేరుకోగా వేలాది మంది పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతించారు. ఉదయం 10 గంటలకే నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు అక్కడికి తరలివచ్చారు. పట్టణంలో దాదాపు రెండు గంటల పాటు ర్యాలీ సాగింది. మేళతాళాలు, కార్యకర్తల కేరింతలు, మహిళల నినాదాలతో చీమకుర్తి హోరెత్తిపోయింది. సుదూర ప్రాంత గ్రామాల నుంచి వచ్చిన వారు సైతం ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చీమకుర్తిలోని పలుచోట్ల గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.

భారీగా నామినేషన్లు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్‌తోపాటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈనెల 18వతేదీ నుంచి 25వతేదీ వరకు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 212 మంది అభ్యర్థులు 354 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 31 మంది అభ్యర్థులు 44 నామినేషన్లు సమర్పించారు. దర్శి నియోజకవర్గానికి 22 మంది అభ్యర్థులు 43, సంతనూతలపాడుకు 17 మంది అభ్యర్థులు 35, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి 27 మంది 39 నామినేషన్లు దాఖలు చేశారు. యర్రగొండపాలెంకు 23 మంది 43 నామినేషన్లు, గిద్దలూరుకు 31 మంది 42, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి 36 మంది అభ్యర్థులు 61 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొండపి నియోజకవర్గానికి 25 మంది అభ్యర్థుల 47 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.



మార్కాపురంలో ర్యాలీకి హాజరైన అశేష జనం

మార్కాపురంలో మిన్నంటిన అభిమానం

మార్కాపురంలోనూ పెద్దఎత్తున టీడీపీ ర్యాలీ కొనసాగింది. అక్కడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డి, ఇతర నేతలు ప్రత్యేక వాహనంపై కందుల ఇంటి నుంచి ర్యాలీగా బయల్దేరారు. సప్తగిరి లాడ్జి, పాత బస్టాండు, చెన్నకేశవస్వామి ఆలయం, కంభం బజారుల మీదుగా కంభం బస్టాండు వరకూ ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతోపాటు మార్కాపురం పట్టణంలోని వివిధ వార్డుల నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. కిలో మీటరు దూరం ర్యాలీ రావడానికి సుమారు రెండు గంటలు పట్టింది. ఆ రెండు పట్టణాల్లోనూ ఊహించిన దాని కన్నా అధికంగా శ్రేణులు తరలిరావడమే కాక, ఎండలో సైతం ఉత్సాహంగా పాల్గొనడంతో అభ్యర్థులు, పార్టీ నేతల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఇప్పటికే జిల్లాలో మిగిలిన ఐదు నియోజకవర్గాల్లోనూ ఇలాగే టీడీపీ అభ్యర్థులు చేపట్టిన ర్యాలీలు విజయవంతమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో జనసేన, బీజేపీ నుంచి సంపూర్ణ మద్దతు లభించడంపై టీడీపీ నేతల్లో మరింత జోష్ కనిపిస్తోంది.

టీడీపీలో నామినేషన్‌ల జోష్

- తొమ్మిది చోట్ల అధికంగా హాజరు
- మూడుచోట్ల పోటాపోటీ
- పోటెత్తిన తూర్పుప్రాంతం
- పశ్చిమంలో ఊరూవాడా కదిలింది
- వైసీపీ కార్యక్రమాలు వెలవెల
- బిత్తరపోయి వైపాలెంలో రెచ్చిపోయిన వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నామినేషన్ల కార్యక్రమం దిగ్విజయం కావడంతో టీడీపీలో జోష్ పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోనూ ఆపార్టీ అభ్యర్థుల అంచనాలకు మించి కార్యక్రమాలకు కూటమి శ్రేణులు, ప్రజానీకం తరలి వచ్చారు. పశ్చిమ ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలు దిగ్విజయం కావడంతో వైసీపీ నేతల్లో అంతర్మథనం ప్రారంభమైంది. జిల్లాలోని తూర్పుప్రాంత నియోజకవర్గాల్లో అయితే టీడీపీ నామినేషన్లకు జనం పోటెత్తారు. అధికార వైసీపీకి బలమైనదిగా భావిస్తున్న పశ్చిమ ప్రాంతంలో అన్నిచోట్లా టీడీపీ కార్యక్రమాలకే ప్రజలు ఎక్కువగా వచ్చారు. గిద్దలూరులో వైసీపీ అభ్యర్థి ముందుగా నామినేషన్ వేయగా, కార్యక్రమానికి ఐదు నుంచి ఆరు వేలమంది మాత్రమే హాజరయ్యారు. టీడీపీ కూటమి అభ్యర్థి బుధవారం నామినేషన్ వేయగా నికరంగా 30 వేల మంది హాజరయ్యారు. మార్కాపురంలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికన్నా టీడీపీ కూటమి అభ్యర్థి నారాయణరెడ్డి నామినేషన్‌కు మూడింతలు జనం అధికంగా హాజరయ్యారు. ర్యాలీ అనంతరం సభ వద్దే 17వేల మందిపైనే నిల్చొని నారాయణరెడ్డి ప్రసంగాన్ని విన్నట్లు అంచనా. వైపాలెంలో కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు నామినేషన్‌కు జనం పోటెత్తారు. దీంతో వైసీపీ నేతలు భారీ ప్రలోభాలతో జన సమీకరణకు ప్రయత్నం చేశారు. మాజీ మంత్రి బాలినేనితో సహా ముఖ్య నేతలను పిలిపించారు. ప్రజలను భారీగా తరలించినప్పటికీ టీడీపీ సభ స్థాయిలో జరగలేదు. దీంతో బిత్తరపోయిన ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి ఎన్నికల అధికారిపై దురుసుగా వ్యవహరించి విమర్శలకు గురయ్యారు. చెవిరెడ్డి దూకుడు వ్యవహారశైలితో యావత్తు అధికారులు బిత్తరపోయారు. ఆయనపై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు కూడా చేశారు.

కనిగిరిలో తేలిపోయిన వైసీపీ ర్యాలీ

కనిగిరిలో టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్ర నామినేషన్‌కు తండోపతండాలుగా వచ్చిన ప్రజలను చూసి వైసీపీ నేతలు జనసమీకరణకు భారీగా డబ్బు, మద్యం ఇచ్చారు. ప్రత్యేకించి గురువారం ఉపాధి కల్పన పనులన్నీ ఆపేసి ఆ కూలీలందర్నీ కార్యక్రమానికి బలవంతంగా రప్పించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు ప్రలోభాలు ఆశచూపి కార్యక్రమానికి తీసుకొచ్చారు. అయినా ర్యాలీ వెలవెలబోయింది. దర్శిలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి నామినేషన్‌కు ఆటంకాలు కల్పించేందుకు వైసీపీ నేతలు విశ్వప్రయత్నాలు చేశారు. టీడీపీ వారికి మద్యం సరఫరా చేస్తున్నారన్న అనుమానంతో దర్శిలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌ను హడావుడిగా సీజ్ చేయించారు. ప్రైవేట్ సంస్థల వాహనాలను కూడా ఇవ్వకుండా అడ్డుకున్నారు. అయినా ప్రజలు టీడీపీ కార్యక్రమానికి భారీగా హాజరయ్యారు.

ఒంగోలులో తండోపతండాలుగా..

ఒంగోలులో వైసీపీ నామినేషన్‌కు వచ్చిన ప్రజలు మధ్యలోనే వెళ్లిపోయి సభా కార్యక్రమ నిర్వహణే విఫలమైంది. టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు ప్రజలు విపరీతంగా వచ్చారు. ఎస్ఎన్‌పాడులో గురువారం విజయ్‌కుమార్ నామినేషన్‌కు జనం పోటెత్తారు. మంత్రి నాగార్జున నామినేషన్ కార్యక్రమం వెలవెలబోయింది. కొండపిలో టీడీపీ కూటమి అభ్యర్థి స్వామి నామినేషన్‌కు జనం భారీగా హాజరయ్యారు. అలాగే నామినేషన్‌కు వచ్చిన జనం మధ్యలోనే వెళ్లిపోవడంతో మంత్రి సురేష్ సభను ముగించారు. అద్దంకి, పర్చూరులో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలు వెలవెలబోయాయి. అదేసమయంలో టీడీపీ అభ్యర్థులు రవికుమార్, సాంబశివరావు నామినేషన్ల కార్యక్రమానికి ఒక్కోచోట 30వేలమంది హాజరయ్యారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. చీరాలలో ముందురోజు నామినేషన్ వేసిన కరణం వెంకటేష్ కార్యక్రమానికి ప్రజలు బాగానే హాజరైనా చివర వరకూ నిలవలేదు. గురువారం టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య నామినేషన్‌లో ఆరంభం నుంచి చివరి వరకూ జనం హోరెత్తింది. అందులో ఎస్సీ, బీసీలు అధికంగా ఉన్నారు. కందుకూరులో మంగళవారం టీడీపీ అభ్యర్థి నాగేశ్వరరావు నామినేషన్ విజయవంతమైంది. బుధవారం వైసీపీ కార్యక్రమానికి డబ్బు, మద్యం వెదజల్లి సమీకరణకు ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో జనం హాజరుకాలేదు.

మాది మూడు దశాబ్దాల అనుబంధం

- నియోజకవర్గానికి నిస్వార్థంగా సేవలందిస్తున్న దామచర్ల కుటుంబం
- ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించిన మాగుంట కుటుంబం
- కుల రాజకీయాలు ఇక్కడ కుదరవు
- నిజాయితీ, నిబద్ధత ఉంటే నియోజకవర్గాల మార్పు ఎందుకు?
- చేసిన అభివృద్ధి, చేస్తున్న సేవలే మా బలం
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ కూటమి కొండపి అభ్యర్థి, ఎమ్మెల్యే స్వామి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'కొండపి నియోజకవర్గ ప్రజలతో ఎంతో అనుబంధం ఉంది. నాది పదిహేనేళ్లు కావచ్చు.. కానీ దామచర్ల, మాగుంట కుటుంబాల అనుబంధం మూడు దశాబ్దాల పైమాటే. నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వు అయి తమకు ప్రత్యక్షంగా పదవి పొందే అవకాశం లేదని తెలిసినా కొండపి ప్రజలను అంటిపెట్టుకొని పనిచేస్తోంది దామచర్ల కుటుంబం. ఇక వివాదాలకతీతంగా మాగుంట కుటుంబం బంధాన్ని కొనసాగిస్తోంది. ఫ్యాక్టరీ నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించటమే కాక సేవా కార్యక్రమాల్లో ముందుంది. కులమతాలకు అతీతంగా బంధుత్వం వరుసలతో పిలుచుకుంటూ ప్రజలతో మమేకమైన చరిత్ర మాది. ఇప్పుడు వైసీపీ నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు కుల రాజకీయాలు చేస్తున్నారు. వారి పప్పులు ఉడకవు' అని కొండపి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి వివరించారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. పూర్తిగా పల్లెసీమతో నిండిన నియోజకవర్గంలో కుల, రాజకీయ చిచ్చుపెట్టాలని ప్రత్యర్థులు చూస్తున్నారని విమర్శించారు. 'వారిని నేను ఒకటే అడుగుతున్నా.. గత ఐదేళ్లలో మీ ప్రభుత్వం చేసిందేమిటి? ముగ్గురు ఇన్‌చార్జిలను మార్చడమేనా' అని ప్రశ్నించారు. నిత్యం అంతర్గత కలహాలతో బజారుకెక్కడం.. కాదు కూడదంటే తనపైన, దామచర్ల కుటుంబంపైన విమర్శలు చేశారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పే దమ్మూధైర్యం వైసీపీ నేతలకు ఉందా అని స్వామి సవాల్ చేశారు. దామచర్ల అంజనేయులు హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధికి బీజం పడిందన్నారు. అప్పట్లో తాగునీటి సమస్య నివారణకు పథకాలు, బ్రిడ్జిలు, రోడ్ల అభివృద్ధి, పేదల గృహాలు, ఇతర అభివృద్ధి పనులు జగమెరిగిన సత్యమని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రామతీర్థం నుంచి సాగర్ జలాలు రప్పించడం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పేదల కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, రాజకీయాలకతీతంగా రేషన్‌కార్డులు, గృహాల మంజూరు, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక చేయూతనివ్వడంలో అగ్రభాగంలో ఉన్నామన్నారు. ఇవన్నీ కళ్లకు కనిపించే నగ్నసత్యాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు, అంతర్గత కలహాలు, అవినీతి వ్యవహారాలు మినహా ఏం జరిగిందో చెప్పే పరిస్థితి ఆ పార్టీ నాయకులకు లేదని స్వామి స్పష్టం చేశారు. ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం ఉండదని, పదవి పొందలేమని తెలిసినా తన తాతను ఆదరించిన ప్రజలకు సేవ చేయాలనే ఆయన మనవడు దామచర్ల సత్య ఇక్కడే పనిచేస్తున్నారని తెలిపారు. తాము నియోజకవర్గానికి అభివృద్ధిని అందించామే కాని కుల, ప్రలోభ రాజకీయాలు చేయలేదన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి మూడు నియోజకవర్గాలు మారిన చరిత్ర వైసీపీ అభ్యర్థి, మంత్రి సురేష్‌ది అని గుర్తు చేశారు. ఆయన గతంలో పనిచేసిన రెండుచోట్ల ఏం చేశారో, కొండపి రావటంలోని ఆంతర్యం ఏమిటో తొలుత చెప్పుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ ఉంటారో మరోచోటుకు వెళ్తారో తేల్చిచెప్పాలని కోరారు. అవేమీ లేకుండా ఆయన కుల రాజకీయాలు చేయటాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. విజ్ఞులైన నియోజకవర్గ ప్రజలు నిజాన్ని గ్రహించారని, అందుకు తన నామినేషన్ కార్యక్రమమే నిదర్శనమన్నారు. జనం భారీగా తరలివచ్చి తనను ఆశీర్వదించారని స్వామి తెలిపారు.



అవినీతి, అక్రమాల్లో దిట్ట చెవిరెడ్డి

- స్థానికేతరుడైన ఆయన్ను ఓడించాలి
- ఒంగోలు ఎంపీ స్థానంలో రెడ్ల ఆధిపత్యం పోతుందనే మార్కాపురం జిల్లా చేయలేదు
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుధాకర్‌రెడ్డి



ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 25 : ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అవినీతి, అక్రమాల్లో దిట్ట అని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఈదా సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆయనపై అనేక భూకబ్జాలు, ఎర్రచందనం కేసులతోపాటు లెక్కకుమిక్కిలి ఆరోపణలున్నాయన్నారు. ఎక్కడో 300 కి.మీ దూరంలో ఉండే వ్యక్తికి వైసీపీ ఒంగోలు లోక్‌సభ స్థానం కేటాయించడం వెనుక అనేక కారణాలున్నాయని విమర్శించారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం సుధాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'చెవిరెడ్డి జిల్లా వాసి కాదు. ఏ నియోజకవర్గం ఎక్కడ ఉందో కూడా ఆయనకు తెలియదు. వందల కి.మీ దూరం నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేసేందుకు ఆయనకు ఏం అర్హత ఉంది? అని ప్రశ్నించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో భూకబ్జాలతోపాటు ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తారన్న ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. అటువంటి వ్యక్తికి ఏవిధంగా ఎంపీ టికెట్ ఇస్తారని ప్రశ్నించారు. చెవిరెడ్డిని ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తే రెడ్ల ఆధిపత్యం పోతుందని కొందరు అడ్డుకుని పశ్చిమ ప్రాంతప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని సుధాకర్‌రెడ్డి విమర్శించారు.

నాగులుప్పలపాడు మండలం చదలవాడలోని శ్రీ రఘునాయక స్వామి కల్యాణం గురువారం నేత్రపర్వంగా జరిగింది. జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారి పరిణయాన్ని తిలకించి పులకించిపోయారు. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కల్యాణం ప్రారంభమైన కొద్దిసేపటికి గరుడ పక్షి వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వెళ్లిపోయింది. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా రామనామస్మరణతో మార్మోగింది. సాయంత్రం స్వామివారి రథోత్సవం రమణీయంగా సాగింది. వేలసంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు.

-నాగులుప్పలపాడు



రమణీయం.. రఘునాయకుడి కళ్యాణం..





ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఎన్.విజయ్‌కుమార్



చీమకుర్తిలో ర్యాలీగా వస్తున్న తెలుగుమహిళలు



సంతనూతలపాడులో అభివాదం చేస్తున్న విజయ్‌కుమార్

బీఎన్‌కు బ్రహ్మరథం

- అట్టహాసంగా టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థిగా నామినేషన్
- హాజరైన బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్
- పసుపుమయమైన గెలాక్సీపురం
- స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చిన శ్రేణులు
- ర్యాలీలో కదంతొక్కిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ క్యాడర్
- ర్యాలీ సూపర్‌సక్సెస్‌పై శ్రేణుల్లో ఆనందహేళ

చీమకుర్తి, ఏప్రిల్25 : తెలుగుదేశం పార్టీ కూటమి సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు, మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులతో గెలాక్సీపురంగా ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి పసుపుమయం అయ్యింది. వీరికి జనసేన పార్టీ, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తోడవ్వటంతో చీమకుర్తి పట్టణం జనసంద్రంగా మారింది. బీఎన్.విజయ్‌కుమార్ ముందుగా ఓబన్నపాలెం దేవాలయంలో పూజలు, పెద్ద కొత్తపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఒంగోలులోని తన గృహంలో ప్రార్థనలు జరిపిన తదుపరి బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, మాజీ మంత్రి యామిని, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరి బాబు, బీఎన్ సోదరుడు బొమ్మాజీ అనిల్ టీడీపీ నాయకులతో కలిసి కాన్వాయ్‌గా నామినేషన్ వేసేందుకు చీమకుర్తికి బయలుదేరారు. ఎండ్లూరు డొంక వద్ద జనసేన, టీడీపీ నాయకులు బీఎన్‌కు ఘనస్వాగతం పలికారు. సంతనూతలపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన బీఎన్ ఘన నివాళులర్పించారు. కాన్వాయ్ చీమకుర్తి పట్టణం హరిహరక్షేత్రం వద్దకు చేరుకోగానే అప్పటికే అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు గజమాలలతో బీఎన్‌కు అఖండస్వాగతం పలికారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో పట్టణంలోని మెయిన్‌రోడ్ గుండా భారీ ర్యాలీగా నామినేషన్‌కు తరలివెళ్లారు. మండుటెండలను లెక్కచేయకుండా నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన కూటమి శ్రేణులు పాల్గొన్న ర్యాలీ అదరహో అన్నట్లు సాగింది. కూటమి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం అంబరాన్నంటే విధంగా ప్రత్యర్థుల గుండెల్లో గుబులు రేపే విధంగా ర్యాలీ జరగటం విశేషం. భారీగా పార్టీ జెండాలు చేతబూని మహిళలు, యువకులు పెద్ద ఎత్తున ర్యాలీలో ఉరిమే ఉత్సాహంతో పాల్గొనటం విశేషంగా నిలిచింది. దాదాపు రెండుగంటలకు పైగా ర్యాలీ జరిగింది. తదుపరి విజయ్‌కుమార్ నామినేషన్ కేంద్రం వద్దకు వెళారు. ఆర్వో గోపాలకృష్ణకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట కందుకూరి బాబు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు ఉన్నారు. టీడీపీ తరపున మరోసెట్‌ను విజయ్‌కుమార్ సోదరుడు అనిల్ దాఖలు చేశారు.

20వేలకుపైగా మెజారిటీతో గెలవబోతున్నా.. : బీఎన్

నామనేషన్ దాఖలు చేసిన తదుపరి కేంద్రం సమీపంలో ఉన్న మీడియాపాయింట్ వద్ద బీఎన్ మాట్లాడారు. ప్రజలు తన పట్ల చూపిస్తున్న అభిమానం, అధికార వైసీపీపై వ్యతిరేకతను బట్టి ఎన్నికల్లో 20వేలకుపైగా మెజారిటీతో గెలవబోతున్నట్లు చెప్పారు. హమీలను ఇచ్చి నెరవేర్చకపోవటంతో ప్రభుత్వంపై ఎప్పుడూ లేని విధంగా అన్ని వర్గాలల్లో వైసీపీపై వ్యతిరేకత కనపడుతోందన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా స్వచ్ఛందంగా, ఉత్సాహంగా ప్రజలు తన నామినేషన్ కార్యక్రమానికి తరలిరావటం ఎన్నడూ తాను చూడలేదని పేర్కొన్నారు. టీడీపీ కూటమి 150సీట్లతో అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ముప్పవరపు వీరయ్యచౌదరి, మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, మండవ జయంత్‌బాబు, కౌన్సిలర్లు గోరంట్ల అంజలి, గొల్లపూడి రమాదేవి, టీడీపీ నాయకులు సూరంపల్లి హనుమంతరావు, కాట్రగడ్డ రమణయ్య, పూనాటి వెంకట్రావు, కందిమళ్ల గంగాధరరావు, ఉన్నం సుబ్బారావు, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, దరిమడుగు నాగరాజు, తాతినేని శ్రీరాం పాల్గొన్నారు.

ఎస్ఎన్‌పాడులో..



చీమకుర్తిలో జరిగిన భారీ ర్యాలీలో ప్రసంగిస్తున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు: టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ నామినేషన్ వేసేందుకు వేసేందుకు ఒంగోలు నుంచి చీమకుర్తికి వెళ్లే మార్గంలోని సంతనూతలపాడులో శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అభ్యర్థి బీఎన్‌కు, బాపట్ల ఎంపీ అభ్యర్థి తేనేటీ కృష్ణప్రసాద్‌కు భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఎండ్లూరు డొంక వద్ద నుంచి టీడీపీ నాయకులు బొమ్మినేని రామాంజనేయులు పెద్దసంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలతో స్వాగతం పలికి చీమకుర్తికి బయలుదేరారు. సంతనూతలపాడులో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి బీఎన్ పూలమాల వేసి నమస్కరించారు. బాపట్ల సోషల్‌మీడియా ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి ఆర్.అంకారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, బీజేపీ నాయకుడు దుంపా కోటిరెడ్డి, టి.శ్రీను, సీహెచ్.శ్రీను, సురేష్, ఎం.వెంకటేశ్వర్లు, శ్రీరామ్మూర్తి, సీహెచ్‌వీ.సుబ్బయ్య, గోపి, రంగనాయకమ్మ, రామదాసు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలం నుంచి..

మద్దిపాడు: టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి మద్దిపాడు మండలం నుంచి అభిమానులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు భారీగా చీమకుర్తి తరలివెళ్లారు. మద్దిపాడులో బైకు ర్యాలీని మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంతిబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ముత్తనపల్లి రామలింగయ్య, కడియాల రఘుబాబు, నవులూరి శివకృష్ణ, శుద్ధపల్లి అనిల్, వేల్పుల నాగరాజు, గోపీచంద్, దేవబత్తిన ప్రసాదరావు, ముచ్చు సుబ్బారావు, అద్దేపల్లి గంగాభవాని పాల్గొన్నారు.

కీర్తిపాడులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బీఎన్.విజయ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేశారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతామని హామీ ఇచ్చారు.



మద్దిపాడులో ర్యాలీగా బయలుదేరుతున్న తెలుగుతమ్ముళ్లు



బీఎన్‌కు జనసైనికుల గజమాల



సంతనూతలపాడులో అంబేడ్కర్‌కు బీఎన్ నివాళి

టీడీపీ హయాంలోనే కార్మికులకు భరోసా!



కార్మికుల సదస్సులో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్



వెంగముక్కలపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న దామచర్ల, రియాజ్

- తెలుగుదేశం కూటమి అభ్యర్థి దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 25 : తెలుగుదేశం పార్టీ హయాంలోనే భవన నిర్మాణ రంగ కార్మికులకు భరోసా లభిస్తుందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్ధన్ తెలిపారు. గురువారం ఒంగోలులోని వేమూరి లక్ష్మణ కళ్యాణ మండపంలో శివశక్తి భవన నిర్మాణ కూలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి దామచర్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాలకు భరోసా కరువైందన్నారు. ఇసుక మాఫియాతో వైసీపీ భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాలతో ఆడుకుటుందని విమర్శించారు. తెలుగుదేశం హయాంలో రూ. 1500 లోపు మాత్రమే లభించిన ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు రూ.6వేలకు పెరిగిందన్నారు. గడిచిన ఐదేళ్ళగా భవన నిర్మాణం కార్మికుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్ళిందని, ఇప్పటికైనా కార్మికులు వాస్తవ పరిస్థితులను గుర్తించాలని దామచర్ల కోరారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం విడిచి పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్ళిల్సిందేనన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు భరోసా లభిస్తుందని తెలిపారు. ఇసుకను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అలాగే కార్మిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, వివాహప్రోత్సాహక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అలాగే ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. వైసీపీ వైఫల్యాలను వివరించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఒంగోలు అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అత్యధిక మెజారిటీ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పాలూరి వెంకటేశ్వరరెడ్డి, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, శివశక్తి భవన నిర్మాణ కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు గుంజి సుబ్బారావు, ప్రధానకార్యదర్శి తమ్మిశెట్టి యానాది, తమ్మిశెట్టి సతీష్, జూటూరి శివకుమార్, తన్నీరు ప్రసాద్, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, పల్లపోతు శ్రీను, తన్నీరు శ్రీను, మిండాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వెంగముక్కలపాలెంలో దామచర్ల ప్రచారం

నగర పరిధిలోని వెంగముక్కలపాలెంలో గురువారం దామచర్ల జనార్దన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు చుండి శ్యామ్, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, బండారు మదన్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీసరస్వతి విజయభేరి



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఛైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ సెషన్-2 ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు సంచలన విజయాలు సాధించారు. విద్యార్థులు టాప్ పర్సంటైల్ సాధించి జిల్లాలో టాపర్స్‌గా నిలవడంతో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. కె.గోపీచంద్ 99.33 పర్సంటైల్‌తో టాపర్‌గా నిలిచారు. కె.సాకేత్‌సాయిరాం 99.27, ఆర్.చంద్రనిహారిక 98.91, కె.సాయికిరణ్ 97.46, ఎస్.ఇంద్రసేనారెడ్డి 96.33, పి.మధుచంద్రిక 95.38 పర్సంటైల్ సాధించారు. జేఈఈ మెయిన్స్ 2024లో విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు పొందారు. జి.వెంకటపవన్‌కుమార్ 335ర్యాంకు, పి.వైష్ణవి 1670, ఆర్.చంద్రికహారిక 2641 ర్యాంకులు సాధించారు. పరీక్షలకు హాజరైన వారిలో 18 మంది 90కిపైగా, 14 మంది 80కిపైగా, 170 మంది 70కిపైగా పర్సంటైల్ పొందారు. 141 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్సుడ్ 2024కు అర్హులయ్యారు. జాతీయ స్థాయిలో ఆరుగురు విద్యార్థులు 3వేల లోపు ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను గురువారం స్థానిక కళాశాలలో విద్యాసంస్థల ఛైర్మన్ ఏవీ.రమణారెడ్డి అభినందించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకర్‌రెడ్డి, సీఈవో సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

3న బ్రాహ్మణుల ఆత్మీయ సదస్సు

- హాజరుకానున్న మాగుంట, దామచర్ల

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా పోటీ చేస్తున్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు బ్రాహ్మణులు మద్దతు తెలపాలని బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టీవీ.శ్రీరామమూర్తి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కోఆర్డినేటర్ కామరాజుగడ్డ కుసుమకుమారి కోరారు. గురువారం ఒంగోలు నగరం లాయర్‌పేటలో ఏర్పా టు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు బ్రాహ్మణులు ఎందుకు మద్దతు ఇవ్వాలో తెలియజేసేందుకు మే 3వ తేదీన స్థానిక గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు టీడీపీ కూటమి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు దామచర్ల జనార్దన్, మాగుంట శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. అదేవిధంగా బ్రాహ్మణ ఐక్య సంఘటన రాష్ట్ర నాయకులు బుచ్చి రామ్‌ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీ.రమణ వంటి పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ ఆత్మీయ సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి బ్రాహ్మణులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో ధేనువకొండ వెంకటసుబ్బారావు, పొన్నలూరి శ్రీనివాసఫణి, ముక్తినూతలపాటి వాసు, ఎస్ఏటీ.రాజేష్, కె.అప్పాజీ, ఎ.గోవిందు, మల్లినాథశర్మ, ఎ.గోవిందు, బాలసుబ్రహ్మణ్యం, పురాణం మురళి, సువర్చల, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వైభవంగా శ్రీరఘునాయకస్వామి కల్యాణోత్సవం





పురవీధుల్లో విహరిస్తున్న రఘునాయకస్వామివారు, ఆకాశంలో గరుడ పక్షి కోసం చూస్తున్న భక్తులు

- గరుడ పక్షి రాకతో భక్తుల తన్మయత్వం
- అంగరంగ వైభవంగా రథోత్సవం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 25 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చదలవాడలోని శ్రీరఘునాయకస్వామి వారి 239వ వార్షిక కల్యాణోత్సవం గురురవారం కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థానం వద్దనున్న కళ్యాణ వేదిక పైకి అలంకరించిన స్వామివార్ల ఉత్సవమూర్తులను తీసుకొచ్చి కల్యాణ ఘట్టాన్ని వేదపండితులు అరుణాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాల నడుమ అశేష భక్త జనం సాక్షిగా ఉదయం 10.30 గంటలకు నిర్వహించారు. స్వామివారికి తలంబ్రాలు పోసే సమయంలో ఆకాశంలో గరుడ పక్షి ఆరుసార్లు కల్యాణవేదిక చుట్టూ ప్రదిక్షణలు చేయడంతో భక్తులు తన్మయత్వం చెందారు. రామనామ స్మరణం జపించారు. ఉభయదాతలు మద్దిరాలపాడుకు చెందిన పెనుబోతు వంశీయులు మల్లికార్జున, నవీన్‌తో కలిసి మంత్రి నాగార్జున స్వామివార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భక్తుల కోసం స్వామివారి కల్యాణ తలంబ్రాలు ఉచితంగా అందజేసేందుకు దేవస్థాన ఈవో అనీల్‌కుమార్ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయడం విశేషం. కాగా ఏఎంసీ ఛైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, వైసీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, సర్పంచ్ దాసరి వరప్రసాదరావు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా రథోత్సవం

శ్రీరఘునాయక స్వామి వారి కల్యాణోత్సవంలో భాగంగా సాయంత్రం స్వామి వార్ల రథోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలు తూమాటి రాంబోట్లు చౌదరి దంపతులు ప్రతేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. భక్తులు, యువకులు రథానిన లాగేందుకు పోటీపడ్డారు. ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త ఉప్పల లక్ష్మీనరసింహాచార్యులు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు చదలవాడ వెంకటకృష్ణయ్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

కలెక్టర్‌ను కలిసిన జనరల్ అబ్జర్వర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సార్వత్రిక ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ అరవింద్ కుమార్‌చౌరాసియా గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలిసి బొకే అందజేశారు. ఒంగోలు, కొండపి, దర్శి, మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయన జనరల్ అబజర్వర్‌గా వ్యవహరిస్తారు. ప్రతిరోజు ఉదయం 10నుంచి 11 గంటల వరకు ఒంగోలులోని ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించవచ్చని, లేదా 9281034505 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. అలాగే జిల్లాలో ఎన్నికలను పర్యవేక్షణకు పోలీస్ అబ్జర్వర్‌గా విచ్చేసిన రహిమాన్ కలెక్టర్‌ను కలిశారు. గిద్దలూరు, వైపాలెం, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా మయూర్ కె.మెహత కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

తాగునీటి కోసం పడిగాపులు..!

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 25 : నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. వేళాపాళ లేని నీటి సరఫరాతో ప్రజలు పనులు మానుకుని మరీ పడిగాపులు కాస్తున్నారు. ఎప్పటికపుడు ఎన్నికల వేళలో పాలకులు తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.. లేదంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయమంటూ మభ్య పెడుతూనే ఉన్నారు. స్థానిక దేవుడుచెరువు రోడ్‌లో గురువారం రాత్రి 10గంటల సమయంలో నీటి సరఫరా జరగ్గా, బిందెడు నీరు కోసం మహిళలు నిద్రమానుకుని వీధి కుళాయిల వద్ద ఎదురు చూశారు. అయితే అరగంటకే నీటి సరఫరా నిలిచిపోవడంతో వారు వాపోయారు. తాగునీటి సమస్యను అడ్డుగా పెట్టుకుని అధికార పార్టీ ఓట్ల కోసం గాలం వేస్తుండగా, ఎన్నికల వచ్చిన ప్రతిసారీ పాలకులు చెప్పే మాటలు ఇవే అని మహిళలు మండపడుతున్నారు.



నీటి కోసం వేచివున్న మహిళలు


టీపీనగర్ మహిళలతో మాట్లాడుతున్న మాగుంట చందన

అభివృద్ధి జరగాలంటే టీడీపీ రావాలి

- మాగుంట, స్వామిలను గెలిపించండి
- రాఘవరెడ్డి సతీమణి చందన

సింగరాయకొండ, ఏప్రిల్ 25 : గ్రామాలలో ఆగిపోయిన అభివృద్ధిని తిరిగి కొనసాగించాలంటే రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందన అన్నారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి టీపీనగర్‌లోని మహిళలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామిక ప్రగతి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. దీంతో యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాగుంట శ్రీనివాసుల రెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానికులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించటానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ వార్డు సభ్యుడు కొమరిగిరి నాంచార్లు, రాధయ్య, పొట్లూరి వెంకటేశ్వర్లు, పలు కుటుంబాలు చందన సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, యన్నాబత్తిన మురళి, పొనుగోటి కొండయ్య, శీలం చంటి, నర్రా రాంబాబు, వేల్పుల వెంకట్రావు, మించల బ్రహ్మయ్య, కొనికి అమర్నాథ్, గుదే వెంకటేశ్వర్లు, మోటుపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో గురువారం బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా స్వామిని, ఎంపీగా మాగుంటను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, కుంచాల ఏడుకొండలు, మోహన్ పాల్గొన్నారు.


నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ కూటమి అభ్యర్థి సుధాకర్, వామపక్ష నాయకులు

ఆఖరిరోజు 22 నామినేషన్లు దాఖలు

కొండపి, ఏప్రిల్25: కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్లు దాఖలు చేయడానికి ఆఖరి రోజైన గురువారం నాడు భారీగా అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. 22 మంది నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ తరుపున పసుమర్తి సుధాకర్ తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె. వీరారెడ్డి, సీపీఎం మండల నాయకుడు కేజీ మస్తాన్, సీపీఎం టంగుటూరు మండల నాయకుడు మోజెస్, సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం సుధాకర్ మాట్లాడుతూ వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు.


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

» కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల, ఏప్రిల్ 25: టీడీపీలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సముచిత స్థానంతో పాటు గౌరవం దక్కుతుందని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు గురువారం మండలంలోని రాళ్ళపల్లి పంచాయతీలో యాదవ సామజికవర్గానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు గవదకట్ల చిన్నఅక్కయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. గురువారం కని గిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యలయంలో ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్ళ గా రాక్షసపాలన సాగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుందన్నారు కార్యక్రమంలో గోంగూడి నాగశ్వరావు, దొడ్డా వెంక టసుబ్బారెడ్డి, గవదకట్ల మాలకొండయ్య, గవదకట్ల హరికృష్ణ, గొనా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో విలేజ్ సర్వేయర్ ఆత్మహత్యాయత్నం!

విజయనగర్‌కాలనీ (చీరాలటౌన్), ఏప్రిల్ 25 : ప్రియుడు నమ్మించి మోసగించాడని విలేజ్ సర్వేయర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చీరాల మండల పరిధిలోని విజయన్‌గర్ కాలనీలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకు చెందిన సోమరౌతు ఝాన్సీ మండల పరిధిలోని తోటవారిపాలెం 1 విలేజ్ సర్వేయర్‌గా పనిచేస్తుంది. ఈక్రమంలో ఈమెకు ఫేస్‌బుక్ ద్వారా పేరాలకు చెందిన పసుపులేటి సాయి పరిచయమయ్యాడు. ఈయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈనేపథ్యంలో వీరి పరిచయం ప్రేమగా మారింది. చాలాకాలంగా రెండు కుటుంబాల మధ్య రాకపోకలు జరుగుతున్నాయి. ఝాన్సీ వద్ద కొంత నగదు కూడా సాయి తీసుకున్నాడు. అయితే ఈ మధ్యకాలంలో ఝాన్సీ కుటుంబ సభ్యులు సాయి, అతని కుటుంబ సభ్యుల వద్ద పెళ్లి ప్రస్తావన తెచ్చారు. ఏమాత్రం ఇష్టంలేని సాయి అతని కుటుంబ సభ్యులు సమయాన్ని దాటేస్తూ వచ్చారు. మోసపోయిన విషయాన్ని గ్రహించిన ఝాన్సీ పెద్దలను ఆశ్రయించింది. అయినా కూడా సాయి ఫోన్ ఆఫ్ చేసుకుని కనిపించకుండా తిరుగుతుండడంతో మనస్తాపం చెందిన ఝాన్సీ ఇంట్లో పెట్రోల్, బాత్రూమ్ క్లీనర్ కలుపుకుని తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే అభివృద్ధి

కొండపి ఎమ్మెల్యే స్వామి ఎండలను లెక్క చేయకుండా ప్రచారం
అడుగడుగునా మహిళల నీరాజనం
భారీగా పార్టీలోకి చేరికలు


చౌటపాలెంలో ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న స్వామి

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్ 25: చంద్రబాబు సీఎం అయితేనే అన్ని ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని కొండపి ఎమ్మెల్యే, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం పొన్నలూరు మండలంలోని పెదవెంకన్న పాలెం, విప్పగుంట, చౌటపాలెం, లింగంగుంట, మాలెపాడు, మూలెవారిపాలెం, తిమ్మపాలెం, శివన్న పాలెం, చెరువుకొమ్ముపాలెం, అగ్రహారం, భోగనంపాడు, రాజోలుపాడు, కొత్తపాలెం గ్రామాల్లో స్వామి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి ప్రచార రథంపై నుంచి మాట్లాడుతూ ప్రధానంగా నియోజకవర్గంలో వెనుకబడిన ప్రాంతమైన పొన్నలూరు మండలాన్ని టీడీపీ పాలనలో అభివృద్ధి చేశామన్నారు. మండలంలోని అన్ని మారుమూల గ్రామాలకు రోడ్లు వేసుకున్నామని, ఇది చంద్రబాబు విజన్‌తోనే సాధ్యమైందన్నారు. పలు గ్రామాలకు తారు రోడ్లు, సీసీ రోడ్లు ఏర్పాటు చేసుకోవడంలో అప్పటి మంత్రి నారా లోకేష్ సహకారం పూర్తిగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముమ్మరంగా కొనసాగుతాయన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వమని అడిగిన జగన్ రాష్ట్రంలో అభివృద్ధిని నాశనం చేసి అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించుకున్నాడన్నారు. మరోసారి ఓటేస్తే పూర్తిగా రాష్ట్రం నాశనం అవుతుందన్నారు. ప్రజలు చంద్రబాబుకు ఓటేసి జగన్ అవినీతి పాలనకు స్వస్తి పలకాలన్నారు. చంద్రబాబు మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు వసతి, ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, నెలకు 15 వందల రూపాయల భృతి, తల్లికి వందనంతో ఇంటిలోని ప్రతి చదువుకునే బిడ్డకు 15వేల రూపాయలు అందిస్తామని మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను స్వామి గుర్తు చేశారు. రైతులకు ఏడాదికి పెట్టుబడి కింద 20 వేల రూపాయలు సాయం, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం ఏర్పాటు, ఎస్సీల సంక్షేమం కోసం పలు పథకాలు, సబ్ ప్లాన్ నిధులు వారికే ఖర్చు చేస్తామన్నారు. ఇంటింటికి తాగునీటి వసతి కల్పించడం జరుగుతుందని స్వామి ఈసందర్భంగా హామీనిచ్చారు.

వైసీపీని వీడి 50 మంది చేరిక...

స్వామి ప్రచారం సందర్భంగా విప్పగుంట గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు గుడిపల్లి కోటయ్య, గుడిపల్లి మాచర్ల, గుడిపల్లి మాల కొండయ్య, దుద్దెల వెంకటయ్య కొమర రాము, కొమర వెంకటరత్నం, కొమర శ్రీను, పంది రమణయ్య, గుడిపల్లి రమణమ్మ, కొండలరావు, పరుచూరి బ్రహ్మయ్య, కొమర బ్రహ్మయ్య టీడీపీలో చేరారు. వారందరికి స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ వారికి అండగా నిలుస్తుందని స్వామి ఈసందర్భంగా హామీనిచ్చారు. అదేవిధంగా ఇదేగ్రామానికి చెందిన చొప్పర కోటయ్య, దార్ల మాధవరావు, చొప్పర మల్లికార్జున పార్టీలో చేరారు.

మహిళల అపూర్వ స్వాగతం...

ఎన్నికల ప్రచారం సందర్భంగా గ్రామాల్లోకి స్వామికి మహిళలు పూలు చల్లుతూ, గుమ్మడికాయలతో దిష్టితీస్తూ, కర్పూర హారతులిచ్చి అఖండ స్వాగతం పలికారు. పగటి వేళ ఎండ తీవ్రత అధికంగా ఉన్నా యువకులు స్వామి ప్రచార రథం వెంట మోటార్ సైకిళ్లపై వెంట నడిచారు. స్వామి కూడా ఎండను లెక్కచేయక ప్రజల్లో మమేక మవుతూ, వారి సమస్యలు వింటూ హామీలనిస్తూ ప్రచారం సాగించారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, టీడీపీ నాయకులు మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి, అనుమోలు సుధాకర్, గుమ్మళ్ల వెంకటరావు, గ్రామాల నాయకులు ఉన్నం కొండలరావు, ఉన్నం వెంకటేశ్వర్లు, షట్టమనేని సుబ్బారావు, మన్నెం వెంకటేశ్వర్లు, బండారు మాల్యాద్రి, జనసేన మండల కన్వీనర్ పిల్లిపోగు పీటర్‌బాబు పాల్గొన్నారు.


పెదవెంకన్నపాలెంలో స్వామిపై పూలవర్షం కురిపిస్తున్న మహిళలు

టీడీపీలో చేరిన పొందూరు యువకులు

పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన స్వామి

పొందూరు(టంగుటూరు) ఏప్రిల్ 25 : మండలంలోని పొందూరు అరుంధతీనగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు పాలపర్తి ఆమోస్‌తోపాటుగా మరో మూడు వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. వీరంతా తూర్పునాయుడుపాలెంలో గల ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గృహం వద్ద ఆయన సమక్షంలోనే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరిలో పాలపర్తి ఆమోస్‌తోపాటుగా పాలపర్తి మహేష్, ఇండ్ల పిచ్చిబాబు, మల్లెల ఆదెయ్య కుటుంబాలున్నాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొందూరు అరుంధతీనగర్‌కు అండగా ఉంటానని, దళితుల సంక్షేమమే టీడీపీ లక్ష్యం అని అన్నారు. టీడీపీలో చేరిన ఆమోస్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే స్థానికుడైన ఎమ్మెల్యే స్వామిని తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు. పొందూరు అరుంధతీనగర్‌లో కోటి రూపాయలతో సిమెంటు రోడ్లు వేసి అందంగా తీర్చిదిద్దాడన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, నా ఎస్సీలు అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ ఎస్సీలకు ఉన్న సంక్షేమ పథకాలు ఊడగొట్టాడు తప్ప చేసింది ఏమీలేదన్నారు. దళితులపై దాడులు, విధ్వంసాలు తప్ప దళితులకు ఒరిగింది ఏమీలేదని, దళితులంతా తీవ్ర భయాందోళనలో బతుకుతున్నారే కాని, వారికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేనే లేవని విమర్శించారు. అందుకే మేమంతా టీడీపీ విజయానికి సైనికునిలా పని చేస్తామని వారంతా వాగ్దానం చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు మేరువ ఆనంద్ పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన పొందూరు వైసీపీ కుటుంబాలతో ఎమ్మెల్యే స్వామి


ఇంటింటికీ తెలుగుదేశం శఖారావం ఎన్నికల ప్రచారంలో పథకాల పత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

భవిష్యత్ గ్యారెంటీకి సూపర్ సిక్స్ పథకాలు

భవిష్యత్ గ్యారెంటీకి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే పలు సంక్షేమ పథకాలు చేస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. టంగుటూరులోని ఒంగోలు, సింగరాయకొండ, కొండపి రోడ్లు, సోమయ్యనగర్‌లో ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావం ప్రచార కార్యక్రమం జరిగింది. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి వారు ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కామని విజయకుమార్, బెల్లం కోటేశ్వరరావు, మిడసల బాలకోటయ్య, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్‌నేత బెజవాడ వెంకటేశ్వర్లు, తోకల భారతి, జక్కుల శ్రీను, భానుచందర్, దయానందం, యజమాని, మొలకలపల్లి శ్రీనివాసరావు, పెద్దోడు, యజమాని పాల్గొన్నారు.

వైభవంగా గుంటిగంగ తిరునాళ్ల

» గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్న భక్తులు

తాళ్లూరు ఏప్రిల్ 25: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటిగంగ తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా జరిగింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. .అమ్మవారికి పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ కావటంతో అధికసంఖ్యలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కు లు తీర్చుకున్నారు. వేలాదిమందిగా వచ్చిన భక్తులు తమ మొక్కుబడులుగా గంగమ్మకు పశుజాతిని బలిఇచ్చి ఈఏడాది కరువు నుంచి ప్రజల్ని కాపాడాలని, సకాలంలో వర్షాలు కురిపించి కాపాడు గంగమ్మతల్లి అంటూ వేడుకున్నారు. భక్తులు పశుసంపదను, వాహనాలను తీసుకువచ్చి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు జరిపారు. గంగమ్మగుడి ప్రక్కనున్న నాగదేవత స్వామికి, కృష్ణమందిరం, శివాలయాలను దర్శించుకుని పూజలు చేశారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాల వద్ద వేలాది మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్ పర్యవేక్షణలో దర్శి సీఐ షమీవుల్లా నేతృత్వంలో ఎస్ఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందో బస్తు ఏర్పాటుచేశారు. పొంగళ్లు పెట్టే మహిళలు కూడా నీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా నీటి వసతి ఏర్పాటుచేశారు. తేజా వృద్ధాశ్రమ ని ర్వాహకులు తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఉచితంగా మజ్జిగ అందజేశారు. సోమా పుల్లయ్య సన్స్ నిర్వహణలో శ్రీరామ్‌సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ

తండ్రికి బాసటగా తనయుడు

జిల్లాలో సుడిగాలి పర్యటన చేస్తున్న రాఘవరెడ్డి
ఇంకోవైపు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న చందన

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: ఒంగోలు ఎంపీ, తెలుగుదేశం పార్టీ ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన తనయుడు రాఘవరెడ్డి జిల్లావ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఒకవైపు అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఇంకొకవైపు మాగుంట కుటుంబానికి రాజకీయంగా ఆసరాగా ఉంటున్న వారిని టీడీపీలోకి తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రోజుకు రెండు మూడు నియోజకవర్గాలు చుట్టేస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాఘవరెడ్డి ఒకవైపు పర్యటిస్తుండగా ఇంకొక వైపు రాఘవరెడ్డి సతీమణి చందనారెడ్డి ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్నారు. రాఘవరెడ్డి ఎక్కువగా పశ్చిమప్రాంతంవైపు దృష్టి పెట్టారు. దర్శి, కనిగిరి, మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి తన తండ్రికి ఉన్న పరిచయాలను ఆసరా చేసుకుని దూసుకపోతున్నారు. ఆయాప్రాంతాల్లో ప్రధానంగా యువతను టీడీపీవైపు వచ్చేలా కార్యాచరణ రూపొందించుకొని ముం దుకు సాగుతున్నారు. దర్శి నియోజకవర్గపరిధిలోని తాళ్ళూరులో ఎంపీపీ శ్రీను ఆధ్వర్యంలో వైసీపీ కుటుంబాలు భారీగా టీడీపీలో చేరాయి. ఆ నియోజకవర్గ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మితో కలిసి రాఘవరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మరోవైపు శ్రీసరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి ఇచ్చిన విందులో రాఘవరెడ్డి పాల్గొన్నారు. దర్శిలో పార్టీలో చేరికలపై చర్చించారు. తదనంతరం మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీర్యాలీలో రాఘవరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇంకొకవైపు రాఘవరెడ్డి సతీమణి చందనరెడ్డి, సహనరెడ్డిలు మామ గెలుపు కోసం సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి, టీపీనగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.


తాళ్ళూరులో రాఘవరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు


సింగరాయకొండలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మాగుంట చందన


మాగుంట సమక్షంలో పార్టీలో చేరిన జాగర్లమూడి రామారావు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు
'జాగర్లమూడి' టీడీపీలో చేరిక

మద్దిపాడు, ఏప్రిల్25: మద్దిపాడు మండలంలోని వేమవరం మాజీ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు, మండల సీనియర్ నాయకుడు జాగర్లమూడి రామారావు గురువారం ఒంగోలులోని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యల సమక్షంలో మాగుంట కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా మాగుంట రామారావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రామారావు లాంటి సీనియర్ నాయకులు పార్టీలోకి రావడం ఆనందదాయకమన్నారు.ఆయనతోపాటు వేమవరం గ్రామానికి చెందిన జాగర్లమూడి సుబ్బారావు కూడా పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి భారీ చేరికలు

పొన్నలూరు (కొండపి) : కొండపి ఎమ్మెల్యే స్వామి ప్రచార కార్యక్రమం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి కార్యకర్తలు, సానుభూతి పరులు గురువారం చేరారు. మండలంలోని తిమ్మపాలెం గ్రామానికి చెందిన బడుగు మహేంద్ర, నరసింహం, చిన్న, కొండలరావు, తాళ్లూరి సుధాకర్, బెజవాడ శ్రీనులతోపాటు మరో 45 కుటుంబాలు కలిపి 50 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. అదేవిధంగా వెంకుపాలెం గ్రామానికి చెందిన యంపరాల బంగారుబాబు, చెరుకూరు చంద్రశేఖర్, ముప్పరాజు వెంకటేశ్వర్లు, నల్లూరి హర్షవర్ధన్, సన్నబోయిన పద్మ, ముసలి వేణు, నూతలపాటి మాలకొండయ్య మార్త్రాటి చందు, శానం రామకృష్ణలతోపాటు మరో ఐదు కుటుంబాలవారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ధర్నాతో దిగివచ్చిన టోల్‌ప్లాజా యాజమాన్యం

- కార్మికులను కొనసాగించేందుకు రాతపూర్వక నిర్ణయం

టంగుటూరు, ఏప్రిల్ 25 : టోల్ ప్లాజాలో విధులు నిర్వహించే హౌస్ కీపింగ్, ఎలక్ట్రీషియన్స్‌ను యాజమాన్యం ఈనెలాఖరుతో నిలిచి పోవాలని నిర్ణయించడంతో కార్మికులంతా సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. దీంతో యాజమాన్యం ఎట్టకేలకు దిగి వచ్చింది. వేరే ఏజెన్సీద్వారా జాబ్ గ్యారెంటీ ఇచ్చేలా హామీ ఇవ్వడంతో సమస్యకు పరిష్కారం లభించింది. టోల్‌ప్లాజాలో 12 ఏళ్లుగా పని చేస్తున్న హౌస్ కీపింగ్, ఎలక్ట్రీషియన్స్‌ను మే 1నుంచి తొలగిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. దీంతో ఆగ్రహం చెందిన వారు సీఐటీయూను ఆశ్రయించారు. స్పందించిన సీఐటీయూ నాయకులు టోల్‌ప్లాజా వద్ద గురువారం అక్కడి కార్మికులకు అండగా ధర్నా నిర్వహించారు. దీంతో టోల్ ప్లాజా యాజమాన్యం సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా వారి మధ్య వాదోపవాదనలు జరిగాయి. తొలగిస్తామన్న కార్మికులను కొనసాగించాల్సిందేనని వారంతా పట్టుబట్టారు. హౌస్ కీపింగ్, ఎలక్ట్రీషియన్స్ కుటుంబ సభ్యులు కూడా ధర్నాకు హాజరై తమ నిరసనను తెలిపారు.చివరకు టోల్‌ప్లాజా యాజమాన్యం వేరే ఏజన్సీ ద్వారా వీరందరినీ కొనసాగిస్తామని చెప్పగా అందుకు సీఐటీయూ నాయకులు అంగీకరించలేదు. వర్కర్ల జాబ్ గ్యారెంటీపై రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని కోరారు. ఇందుకు యాజమాన్యం అంగీకరించడంతో పరిస్థితి కొలిక్కి వచ్చింది. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఉపాధ్యక్షుడు టి.రాము, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి. మోజెస్, టోల్‌ప్లాజా నాయకుడు జి. రాజశేఖర్ నాయకత్వం వహించారు.

జన కేతనం

ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ హామీపై సురే..ష్



ఆదిమూలపు సురేష్.. 2009-2014 మధ్య తొలిసారి ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రజలకు అనేక హామీలిచ్చి ఓట్లు వేయించుకున్నారు. ప్రధానమైన హామీల్లో దోర్నాల మేజర్ పంచాయతీలో రూ.3 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల పదవి కాలం ముగిసింది. ఆ హామీ గురించి అతీగతీ లేదు. ఆ తర్వాత ఆయన సంతనూతలపాడు నియోజకవర్గం వెళ్లి అక్కడ పోటీ చేసి గెలిచారు. మళ్లీ 2019లో ఎర్రగొండపాలెం వచ్చి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత మంత్రిగా కూడా పనిచేశారు. అయినప్పటికీ అప్పట్లో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. సంబంధిత శాఖ మంత్రి అయినప్పటికీ ఆ హామీ గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఇన్ని బాధలు పడుతుంటే పట్టించుకోకుండా మళ్లీ ఇప్పుడు కొండపి నియోజకవర్గానికి మారారని విమర్శిస్తున్నారు.

తొలిసారి ఎమ్మెల్యేగా దోర్నాలలో రూ.3 కోట్లతో నిర్మిస్తానని ప్రకటన

2004-09 ఆయన పదవీ కాలం నుంచి నేటికీ నెరవేర్చని వైనం

గత ఐదేళ్లు సంబంధిత శాఖ మంత్రిగా ఉన్నా పట్టించుకోని ఆదిమూలపు

ఇళ్లముందే మురుగు నిల్వలు

ఎక్కడికక్కడే చెత్త కుప్పలు

ఒకవైపు రోగాలతో.. మరోవైపు సమస్యలతో నరకం అనుభవిస్తున్న ప్రజలు

ముఖ్యంగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 24 :దోర్నాలలో పారిశుధ్యం కరువైంది. టీడీపీ హయాంలో 70శాతం, కాంగ్రెస్, వైసీపీ హయాంలో 10శాతం సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అయినప్పటికీ పాలకులు డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేకపోవడంతో వీధులు మురుగుకూపాలుగా మారాయి. పందులు సంచరిస్తూ ఈగలు, దోమలు వృద్ధి చెందుతూ ప్రజలను ఇబ్బందులు పాల్జేస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో జ్వరం, జలుబు, దగ్గు, వంటి నొప్పులు తదితర సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు అల్లాడుతున్నారు. కొద్దిపాటి వాన కురిసినా నీరు ఊరు బయటకు వెళ్లే దారి లేక ఇళ్ల ముందే నిల్వ చేరుతుంటుంది. ఈ కారణంగా దుర్గంధం వ్యాపిస్తుంటుంది.



ఇళ్ల ముందు చేరిన మురికి నీరు

40 వేల జనాభా ఉన్నా పట్టించుకోని నేత

ప్రస్తుతం దోర్నాలలో సుమారు 40 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇంత జనాభా నివసిస్తున్నప్పటికీ మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేదు. వాడుక నీరు మురుగుకాలువల ద్వారా బయటకు ప్రవహించే వీలులేదు. కొత్త మసీదు వీధి, ఫారం వీధిలో, మండల ప్రాథమిక పాఠశాల(మెయిన్)వద్ద, పశువైద్యశాల వద్ద తదితర ప్రాంతాల్లో ప్రతి నిత్యం రోడ్లమీదనే మురుగు నీరు ప్రవహిస్తోంది. నెలల తరబడి మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోంది.

కొన్ని ప్రాంతాల్లో చెత్త కొండల్లా...

ఆర్టీసీ బస్టాండు, బీఎస్ఎన్ఎల్ టవర్‌వద్ద డంపింగ్ యార్డును తలపించే విధంగా చెత్తా చెదారం పేరుకుపోతోంది. దీని పక్కనే ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాలు ఉన్నాయి. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అటు మురుగునీరు, ఇటు చెత్తకుప్పల మధ్య ప్రజలు నరకం అనుభవిస్తున్నారు.

మురుగును తీగలేరులోకి మళ్లిస్తేనే పరిష్కారం



ప్రధాన రహదారిపై చేరిన వర్షపు నీరు(ఫైల్)

దోర్నాల పంచాయతీలో రోజువారీ విడుదలయ్యే మురుగు నీటిని పక్కనే తీగలేరు కాలువలోకి మళ్లిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ప్రజలు చెబుతున్నారు. దీనికి అనుగుణంగా కాలువలు నిర్మించి వాగుకు అనుసంధానించి, తమను రోగాల బారీ నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్యను తీసుకెళ్లి ప్రత్యక్షంగా చూపించినా...

ఎర్రగొండపాలెం నుంచి తొలిసారి(2004-09) శాసనసభ్యుడిగా ఆదిమూలపు సురేష్ ఎన్నికైన సమయంలో ప్రజలు ఆయన దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. అంతేగాక స్వయంగా ఆయనను దగ్గరుండీ బురద నీరున్న వీధుల్లోకి తీసుకెళ్లి చూపించి పరిస్థితిని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సురేష్ రూ.3 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మిస్తానని, దాంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ ఇచ్చి దాదాపు పదిహేనేళ్లు అయ్యింది. అయినప్పటికీ, ఆ ఊసే లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. 2019 నుంచి విద్యాశాఖ, పట్టణ పురపాలక శాఖమంత్రిగా కూడా పనిచేస్తున్నారు. అయినా ఆ సమయంలో కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపుతో నరకం అనుభవిస్తున్నాం



మురుగు కాలువల్లో నీరు సక్రమంగా పారడం లేదు. దీంతో కంపుతో నరకయాతన పడుతున్నాం. అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. కాలువలు సరిగ్గా నిర్మించాలని సమస్యను పరిష్కరించాలి.

బీ సుబ్బమ్మ

రెండుసార్లు గెలిపించినా ఫలితం లేదు



ఆదిమూలపు సురేష్‌ను రెండుసార్లు ఆదరించాం ఫలితం లేదు. పట్టణంలో ఎక్కడ చూసినా దర్గంధం వస్తోంది.మున్సిపల్‌శాఖకు ఇక్కడి ఎమ్మెల్యే మంత్రిగా పనిచేశారు. అయినా సమస్యను పరిష్కరించలేదు.

షేక్ మౌలాలి

రాజకీయ సిత్ర విసిత్రాలు

వైసీపీ ఎన్నికల ప్రచారంలో రేషన్ డీలర్



హనిమిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో డీలర్ పద్మావతి

అద్దంకి, ఏప్రిల్ 25 : వైసీపీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి పాణెం చిన హనిమిరెడ్డి గురువారం అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రేషన్‌షాపు డీలర్ పద్మావతి పాల్గొన్నారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోనున్నట్లు టీడీపీ నేతలు తెలిపారు.

ఏ హోదాలో తాటిపర్తి పేరు లిఖించారు

ప్రభుత్వ భవనం శిలాఫలకంలో ఆయన పేరు

ఎన్నికల సంఘానికి బీజేపీ నాయకుల ఫిర్యాదు



శిలాఫలకంపై తాటిపర్తి చంద్రశేఖర్ పేరు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 25: దోర్నాలలో నూతనంగా నిర్మించిన మండల ప్రజాపరిషత్ భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఆహ్వానితులుగా తాటిపర్తి చంద్రశేఖర్ పేరు లిఖించడాన్ని తప్పుబడుతూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఆరె రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ హోదాలో శిలాఫలకంపై ఆయన పేరును చేర్చారని ప్రశ్నించారు. శిలాఫలకం ఏర్పాటులో అధికార దుర్వినియోగం జరిగిందని సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పాలుట్ల గ్రామానికి గత టీడీపీ ప్రభుత్వం సోలార్‌తో విద్యుత్తును అందించగా, మరమ్మతుల పేరిట వైసీపీ ప్రభుత్వం ఉన్న సోలార్‌ను తొలగించి చీకట్లు నింపిందన్నారు.

ఒంగోలు పార్లమెంట్‌కు ప్రత్యేక పోలీసు అబ్జర్వర్

సాయంత్రం 4 నుంచి 7 వరకు ఫోన్‌లో అందుబాటు

కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 25 : జిల్లాలోని ఒంగోలు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు పోలీసు అబ్జర్వర్‌గా ఐపీఎస్ అధికారి హసీబ్ ఉర్‌రెహమాన్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పోలీసు అబ్జర్వర్ ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో గురువారం రాత్రి సమావేశమయ్యారు. జిల్లాలోని పరిస్థితులను ఎస్పీ సుమిత్ సునీల్ వివరించారు. అబ్జర్వర్ హసీబ్ ఉర్‌రెహమాన్ మాట్లాడుతూ ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతవరణం కల్పించాలని పోలీసులకు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని అతిథిగృహంలో ఉంటానని, ఎవరైనా కలిసి తమ సమస్యలు చెప్పవచ్చని తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు శాంతి భద్రతల సమస్యలపై 9281034495 నంబర్‌లో చెప్పాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, అదనపు ఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు డీఎస్పీలు అశోక్‌వర్ధన్, బాలసుందరరావు, కిషోర్‌బాబు, రామరాజు, సీహెచ్ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అత్యుత్సాహం

కనిగిరి వైసీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో నేతలు, పోలీసుల తీరుపై విమర్శలు

రోజూకంటే అదనంగా రోడ్లు దిగ్బంధం

రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్‌నూ పట్టించుకోని వైనం

ఇబ్బందులు పడిన ప్రయాణికులు

చంటిబిడ్డ తల్లులు, వృద్ధుల బాధలు వర్ణనాతీతం



చంటిబిడ్డతో ర్యాలీలో చిక్కుకున్న ప్రయాణికురాలు

కనిగిరి, ఏప్రిల్ 25 : వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ గురువారంనాటి నామినేషన్ కార్యక్రమంలో పోలీసులతోపాటు ఆ పార్టీ నేతలు ప్రదర్శించిన అత్యుత్సాహం అంబులెన్స్‌లో ఉన్న రోగికే కాదు ప్రజలకు సైతం ప్రాణసంకటంగా మారింది. దారి ఇవ్వాలని అందరూ వేడుకున్నా వారెవరూ స్పందించలేదు.

కనిగిరి నగర పంచాయతీ పరిధిలో గురువారం పోలీసులు ఒంగోలు బస్టాండు, పామూరు బస్టాండు ప్రధాన సెంటర్లన్నీ బారికేడ్లతో నింపేసి రాకపోకలను బంద్ చేశారు. రోజూ కంటే అదనంగా రోడ్లను దిగ్బంధించి ప్రజలకు చుక్కలు చూపించారు. దీంతో ఒంగోలు నుంచి, కందుకూరు వైపు నుంచి, పామూరు వైపు నుంచి వచ్చే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. పామూరు వైపు నుంచి బస్సులను కొత్తూరు వద్ద ఆపేశారు. దీంతో 3కిలోమీటర్లు ప్రయాణికులు నడిచి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేకాకుండా డిపోకు వెళ్లాలంటే పామూరు బస్టాండు వద్ద కూడా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కందుకూరు వెళ్లాల్సిన ప్రయాణికులు డిపోకు నడచి వెళ్లాల్సి వచ్చింది. మధ్యాహ్న సమయంలో ఒంగోలు నుంచి బస్సుల్లో కనిగిరి వచ్చిన ప్రయాణికులు ఎండలో నడిచి వెళ్లలేక నానాఇబ్బందులు పడ్డారు. చంటిబిడ్డలను తీసుకొచ్చే తల్లులూ అవస్థలు పడ్డారు.



కనిగిరిలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో చిక్కుకున్న అంబులెన్స్

పామూరు బస్టాండు వద్దకు వచ్చే సరికి ర్యాలీ వస్తుందని ప్రయాణికులను ఎటూ పోనివ్వకుండా పోలీసులు నిలిపేశారు. దీంతో ర్యాలీ జనంలో కలిసిపోయి ఎక్కువ మంది చూపించేందుకు ఇలా చేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. అదేవిధంగా కనిగిరి నుంచి పామూరు, ఒంగోలు, కందుకూరు వెళ్లాల్సిన ప్రయాణికులను కూడా పోలీసులు నిలిపివేశారు. ఒకదశలో వారిలో ఆగ్రహం పెల్లుబికి పోలీసులతో వాగ్వివాదం చేశారు. ర్యాలీ ముగిసేంతవరకు ప్రయాణికులు నిలిపివేశారు.



వెళ్లిపోతాం గేట్లు తీయాలని వేడుకుంటున్నాజనాల్ని నిలిపివేసిన పోలీస్

ర్యాలీలో చిక్కుకున్న అంబులెన్స్

హనుమంతునిపాడు నుంచి అనారోగ్యంతో ఉన్న పేషెంట్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొస్తున్న అంబులెన్స్ ర్యాలీ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. ఆ సమయంలో పామూరు బస్టాండు సెంటరులో వాహనంపై ఉన్న వైసీపీ అభ్యర్థి కానీ, నేతలు కానీ ఆ వాహనం వెనకే సైరన్ మోగిస్తున్నా ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో దారిలేక అంబులెన్స్ అలాగే నిలిచిపోయింది. ఈ విషయంలో పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర వహించారు. అరగంటపాటు అంబులెన్స్ నిలిచిపోవడంతో పేషెంట్ తాలూకా బంధువులు ఆందోళన చెందారు.

సైకతంతో స్వీప్



ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: 'నా ఓటును అమ్ముకొను.. నిజాయితీగా ఓటు వేస్తాననే' నినాదంతో ఎన్నికల సంఘం వినూత్నంగా అవగాహనకు శ్రీకారం చుట్టింది. ఒంగోలులోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఇసుకపై ఓటును అమ్ముకోనంటూ ప్రచారం చేపట్టారు. వచ్చేనెల 13వతేదీన జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరు నిజాయితీగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ ప్రాంతంలో తిరిగే ప్రజానీకం సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. ఓటుకు ఎంత విలువ ఉందో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో ఉందని సైకత శిల్పులను ప్రశంసించారు. విజయవాడుకు చెందిన బాలాజీ వరప్రసాద్‌ను ఈ సైకతాన్నితీర్చిదిద్దారు.

రైళ్లలో తనిఖీలు.. సొత్తు స్వాధీనం




వెండిపళ్లేలతో సీఐ


రూ.5 లక్షల విలువైన వెండి ప్లేట్లు, 13 మద్యం బాటిళ్లు సీజ్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 25 : ఎన్నికల సందర్భంగా ఒంగోలు స్టేషన్‌లో పలు రైళ్లల్లో తనిఖీలు చేయగా రూ.5 లక్షల విలువైన వెండి ప్లేట్లు, 13 మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు చెప్పారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు తనీఖీలు నిర్వహించారు. నెల్లూరు వైపు వెళుతున్న ప్యాసింజర్ రైలులో తెనాలికి చెందిన సీహెచ్ రామకృష్ణ, విజయలక్ష్మీల వద్ద 9.530 కిలోల కలిగిన 27 వెండి ప్లేట్లు ఉన్నాయి. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా చెన్నై నుంచి రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ 13 ఫుల్ బాటిళ్ల మద్యం తీసుకొస్తుండగా గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి సీఆర్‌పీఎఫ్ అధికారులకు నివేదించామన్నారు.

రాష్ట్రపతి, ప్రధానులను అక్కున చేర్చుకున్న గిద్దలూరు ప్రజలు



నీలం సంజీవరెడ్డి



పీవీ నరసింహారావు

గిద్దలూరు, ఏప్రిల్ 25 : ఒకే నియోజకవర్గం నుంచి దేశంలో అత్యున్నత పదవులైన రాష్ట్రపతి, ప్రధానమంత్రిలను అందించిన ఏకైక నియోజకవర్గంగా నంద్యాల గుర్తింపు పొందింది. 1952 నుంచి 2008 సంవత్సరం వరకు గిద్దలూరు నియోజకవర్గం నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో భాగంగా ఉండది. 1977లో జరిగిన ఎన్నికలో జనతాపార్టీ తరపున నీలం సంజీవరెడ్డి పోటీ చేసి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏడాది వ్యవధిలోనే ఆయన రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో నంద్యాల ఎంపీ పదవికి రాజీనామా చేశారు. రాజీవ్‌గాంధీ మరణంతో కాంగ్రెస్ పార్టీ పి.వి.నరసింహారావు ప్రధాన మంత్రిగా ఎంపికయ్యారు. 1991లో జరిగిన ఉప ఎన్నికలో ప్రధానమంత్రి హోదాలో నంద్యాల పార్లమెంటు నుంచి పి.వి.నరసింహారావు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలిచారు. ఆ తరువాత 1996లో జరిగిన ఎన్నికలో సైతం ప్రధాన మంత్రి హోదాలోనే పీవీ నరసింహారావు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. నంద్యాల పార్లమెంటులో భాగమైన గిద్దలూరులో ప్రధానమంత్రి హోదాలోనే పీవీ నరసింహారావు అటు ఎన్నికల ప్రచారానికి, ఇటు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు మూడు పర్యాయాలు గిద్దలూరు విచ్చేశారు. ఇలా నంద్యాల పార్లమెంట్ పరిధిలో అంతర్భాగమైన గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు రాష్ట్రపతి, ప్రధానమంత్రి పదవులు ఏలిన నీలం సంజీవరెడ్డిని, పి.వి.నరసింహారావు అక్కున చేర్చుకున్నారు.

మూడు పర్యాయాలు ఉపఎన్నిక

దేశంలో ఏ పార్లమెంటు నియోజకవర్గంలో కూడా ఇప్పటివరకు మూడు పర్యాయాలు ఉపఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. 1977లో నీలం సంజీవరెడ్డి జనతాపార్టీ తరపున విజయం సాధించి 1978లో రాష్ట్రపతి కాగానే పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాంతో 1978లో ఉపఎన్నిక జరగగా అప్పటికే 4 పర్యాయాలు ఎంపీగా విజయం సాధించిన పండేకంటి వెంకటసుబ్బయ్య ఉపఎన్నికలో పోటీ చేసి మరోసారి విజయం సాధించారు. రాజీవ్‌గాంధీ మరణం తరువాత రాష్ట్రానికి చెందిన పి.వి.నరసింహారావును ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారు. ఆయన అటు రాజ్యసభకు గాని, ఇటు పార్లమెంటుకు గాని ఎన్నిక కాలేదు. దీంతో ఆయన పార్లమెంటు సభ్యునిగా పోటీ చేసేందుకు వీలుగా 1991లో అప్పటి ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో 1991లోనే ఉపఎన్నిక జరిగింది. ప్రధానమంత్రి హోదాలో పీవీ నరసింహారావు ఉపఎన్నికలో పోటీ చేసి విజయం సాధించారు. 1996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పీవీ నరసింహారావు గిద్దలూరు భాగమై ఉన్న నంద్యాలతోపాటు ఒరిస్సాలోని బరంపురంలో సైతం పోటీ చేసి రెండు చోట్ల గెలుపొందారు. నంద్యాల నియోజకవర్గానికి ఆయన రాజీనామా చేసి బరంపురం నుంచి పార్లమెంట్ సభ్యునిగా కొనసాగారు. దీంతో 1996లో మరోసారి ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఉపఎన్నికలో టీడీపీ తరపున భూమా నాగిరెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. ఇలా ఒక్క పార్లమెంటు పరిధిలో మూడు పర్యాయాలు ఉపఎన్నికలు జరగడం, రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి అత్యున్నత పదవులతోపాటు ఇక్కడి నుంచి 6 పర్యాయాలు విజయం సాధించిన పెండేకంటి వెంకటసుబ్బయ్యకు కేంద్ర మంత్రివర్గంలో హోంశాఖ సహాయ మంత్రిగా మంత్రి పదవి లభించడం విశేషం. హేమాహేమీలను అందించి వారిని అక్కున చేర్చుకున్న విషయాన్ని ప్రతి ఎన్నిక సందర్భంగా గిద్దలూరు ప్రజలు, పరిశీలకులు మననం చేసుకుంటూ ఉంటారు.






నామినేషన్ దాఖలు చేస్తున్న కందుల నారాయణరెడ్డి, ర్యాలీలో అభివాదం చేస్తున్న నారాయణరెడ్డి, రాఘవరెడ్డి ర్యాలీకి తరలివచ్చిన కేడర్, పొదిలి నుంచి బయలుదేరుతున్న నాయకులు

సమరోత్సాహంతో నామినేషన్

- ఉత్సాహంగా ర్యాలీకి కదిలిన కేడర్
- మండలాల నుంచి భారీగా కేడర్ హాజరు
- పసుపు మయమైన మార్కాపురం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 25: మార్కాపురంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్ గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి సభ్యులు సమరోత్సాహంతో ర్యాలీకి హాజరయ్యారు. కూటమి తరఫున టీడీపీ నుంచి కందుల నారాయణరెడ్డి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు నామినేషన్ పత్రం అందించారు.

పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని కందుల నివాసం నుంచి ఉదయం 11.05 గంటలకు ప్రారంభమైన ర్యాలీ మధ్యాహ్నం 2గంటల వరకు జరిగింది. సప్తగిరి లాడ్జి, శాంతి క్లినిక్ ఏరియా, దోర్నాలకూడలి, సరోజిని నాయుడు వీధి, రథం వీధి, రాజాజి వీధి, రీడింగ్ రూమ్ కూడలి నుంచి కంభం కూడలి వరకు జరిగిన ర్యాలీలో ప్రజలు మండుటెండను సైతం లెక్కచేయకుండా పాల్గొన్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన పూల వాహనంలో మాగుంట రాఘవరెడ్డి, జనసేన నాయకులు ఇమ్మడి కాశీనాథ్, సాదిక్, బీజేపీ నాయకులు కృష్ణారావు, నాయకులు కందుల రామిరెడ్డి, విఘ్నేష్‌రెడ్డి, టి.సత్యనారాయణ, వక్కలగడ్డ మల్లికార్జున్ తదితర ముఖ్య నాయకులు మహార్యాలీగా తరలారు. ఈ సందర్భంగా పార్టీల శ్రేణులు తీన్‌మార్ తప్పెట్లు, వివిధ నృత్యాలతో, డీజే సౌండ్‌లతో హోరెత్తించారు. దారి పొడవునా కందులకు ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా రీడింగ్ రూమ్ కూడలి వద్ద కందుల మాట్లాడుతూ.. ధనం-జనం మధ్య జరుగుతున్న పోరులో జనబలం గెలవాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్ కోసం తాను పోరాటాలు చేసి సాధించానన్నారు. మార్కాపురం జిల్లా కోసం 62 రోజులు ఉద్యమం చేస్తుంటే వైసీపీ నాయకులు పోలీసులతో దానిని భగ్నం చేశారన్నారు. చంద్రబాబుతోనే మార్కాపురం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అవుతాయన్నారు. టీడీపీ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఓటు నారాయణరెడ్డికి రెండో ఓటు తన తండ్రి మాగుంట శ్రీనివాసురెడ్డికి సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలన్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు తరలివచ్చారు. తొలుత నారాయణరెడ్డి వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, నాలి కొండయ్య, జనసేన, బీజేపీ నాయకులు, భారీగా హాజరయ్యారు. పలు ప్రాంతాలలో కందుల, మాగుంటలను గజమాలలతో సత్కరించారు.

ర్యాలీకి భారీగా తరలిన శ్రేణులు

మార్కాపురం రూరల్ : ఎన్డీఏ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్ ర్యాలీ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చారు. దరిమడుగు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు జవాజి రామానుజన్‌రెడ్డి ఆధ్వర్యంలో 300కు పైగా వాహనాల్లో ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీలో మార్కాపురం మండలం నుంచి సుమారు 8000 మంది పార్టీ శ్రేణులు పాల్గొన్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. కందుల నామినేషన్ ర్యాలీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావడంతో గెలుపు ఇక లాంఛనమే అనే ధీమాలో ఆ పార్టీ కేడర్ ఉంది.

తర్లుపాడు : మండలంలోని 16 పంచాయతీల నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా ర్యాలీకి తరలివెళ్లారు. లారీలు, జీపులు, ఆటోలు, బైకులలో మార్కాపురం తరలివెళ్లారు. మీర్జపేటలో లారీపై సైకిల్‌ను కట్టుకుని డప్పు వాయిద్యాలతో తరలి వెళ్లారు. తర్లుపాడు, సీతానాగులవరం, చెన్నారెడ్డిపల్లి, మీర్జపేటలలో యూత్ నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కాపురం నామినేషన్ కార్యక్రమానికి వెళ్లారు. మండలం నుంచి ఐదు వేల మంది తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు కంచెర్ల కాశయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు పి.గోపినాథ్ చౌదరి, మందా వెంకటరెడ్డి, మాజీ సర్పంచులు యక్కంటి వెంకట సుబ్బారెడ్డి, నంబుల లక్ష్మయ్య, నంబుల తిరుపతయ్య, నాయకులు రోశప్పనాయుడు, ఎ.వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాసపతిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు మేకల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున మార్కాపురం ఉమ్మడి టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పొదిలి పట్టణం నుంచి కార్యకర్తలు భారీగా మార్కాపురం తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్, మాజీ ఎంపీటీసీ ఇమాంమ్‌సా, మాజీ జడ్పీటీసీ కాటూరి పెదబాబు, మండలాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్ ఆధ్వర్యంలో టీడీపీ కేడర్ నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లింది.





దరిమడుగు గ్రామం నుంచి నామినేషన్ ర్యాలీకి బయలుదేరిన ప్రజలు, నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన మహిళలు, తర్లుబాడులో బైకు ర్యాలీ

వైసీపీకి వరుసగా ఎదురుదెబ్బలు

- టీడీపీలో చేరిన బసినేపల్లి సర్పంచ్
- బీసీ నాయకుడు బాలయ్య చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ముత్తుముల

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 25 : గిద్దలూరు నియోజకవర్గంలో వైసీపీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆ పార్టీ నుంచి రోజురోజుకు టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ఊహించని విధంగా, ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. దీంతో నియోజకవర్గంలో రాజకీయ పరిశీలకులు సైతం ఆశ్చర్యానికి గురయ్యారు. సుమారు 40వేల మంది వరకు కార్యక్రమానికి హాజరైనట్లు అంచనా. దీంతో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. తాజాగా గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బేస్తవారపేట మండలం బసినేపల్లి గ్రామసర్పంచ్ వినుకొండ బుచ్చిబాబు, ఆయన అనుచరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి స్థానిక సంస్థలను నిధులు లేకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో తెల్లగొల్ల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, జొన్న జేమ్స్, పగ్గాల రాము ఉన్నారు. పూనూరు భూపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



బుచ్చిబాబును ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి



బీసీ నాయకుడు బాలయ్య చేరిక

బేస్తవారపేట మండలం పిటకాయగుళ్ల గ్రామానికి చెందిన బీసీ నాయకుడు పేరూరి బాలయ్య వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే పార్టీ అని బాలయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు.

14 మంది నామినేషన్లు దాఖలు

గిద్దలూరు, ఏప్రిల్ 25 : నామినేషన్ల చివరి రోజు గిద్దలూరు నియోజకవర్గం నుంచి 14 నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామి, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి రెండో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా షేక్ మహబూబ్ భాషా, స్వతంత్ర అభ్యర్థిగా గిద్దలూరు మండలం నరవకు చెందిన ముడియం వెంకటరామిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి ద్వారా మరోసెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి సైతం చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ద్వారా మరోసెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. తెలుగు రాజ్యాధికార సమితి అభ్యర్థిగా బేస్తవారపేట మండలం సలకలవీడుకు చెందిన చింతా శ్యాంసన్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా అంబవరం గ్రామానికి చెందిన సీ.హెచ్. ఉమామహేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. సమాజ్‌వాద్ పార్టీ అభ్యర్థిగా గిద్దలూరుకు చెందిన అడపాల నాగమణి నామినేషన్ వేశారు. మరో స్వతంత్ర అభ్యర్థిగా మార్కాపురానికి చెందిన శింగరి సత్యనారాయణ నామినేషన్ అందజేశారు. బహుజన సమాజ్‌వాజ్ పార్టీ అభ్యర్థిగా నెల్లూరుకు చెందిన ఇసుకల జయరాజ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కంభంకు చెందిన జవ్వాజి పవన్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులు గిద్దలూరుకు చెందిన బొర్రా రాఘవేంద్రరావు, పొదల కొండపల్లెకు చెందిన పలసాని మాల్యాద్రిరెడ్డి, గంగంపల్లెకు చెందిన మీనిగ మురళిమోహన్‌రెడ్డిలు రిటర్నింగ్ అధికారి నాగజ్యోతికి నామినేషన్ పత్రాలను అందచేశారు.

23 మంది అభ్యర్థులు.. 43 నామినేషన్లు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 25 : నియోజకవర్గంలో ఈనెల 18 నుంచి 25వ తేది వరకు 23 మంది అభ్యర్థులు, 43 నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీలేఖ గురువారం సాయంత్రం ప్రకటించారు. టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు 4 సెట్లు, వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ 4 సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

గిద్దలూరును అభివృద్ధి చేసే బాధ్యత నాదే

- టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి
- పట్టణంలో ఇంటింటి ప్రచారం
- అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 25 : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేసే బాధ్యత తనదే అని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ఓటర్లతో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన గిద్దలూరు పట్టణంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రాచర్లగేటు కూడలిలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూరగాయల మార్కెట్, మాయాబజార్, పెద్దబజార్, పొట్టి శ్రీరాముల విగ్రహం, అమ్మవారిశాల వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గుండ్లమోటు వద్ద బోర్లు వేయించి అక్కడి నుండి పట్టణానికి పైపులైన్ ద్వారా నీటిని అందించినట్లు గుర్తుచేశారు. తాను స్థానికుడి నని, నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమానికి పాటుపడతానని స్పష్టం చేశారు. మే 13న జరిగే ఎన్నికలలో ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసుల రెడ్డి పోటీ చేస్తున్నామన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, కౌన్సిలర్ చంద్రశేఖర్ యాదవ్, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, పెద్దభాషా, పాముల వెంకటరమణ యాదవ్, టింబర్ డిపో శ్రీను, ఓబయ్య, గోపాలక్రిష్ణ యాదవ్ ఉన్నారు.



పూజలు చేస్తున్న అశోక్‌రెడ్డి



ఇంటింటి ప్రచారం ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి

కూటమి నేతలతో సమావేశం

గిద్దలూరు టౌన్ : ప్రస్తుత ఎన్నికల్లో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు పోదామని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. ఆయా పార్టీల నాయకులతో గురువారం ఆయన గిద్దలూరులోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన అభ్యర్థించారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ పాలనతో విసుగు చెందారన్నారు. రాష్ట్రంలో రాక్షస రాజ్యం పోయి రామరాజ్యం వస్తుందన్నారు. ఆ మేరకు ఎన్నికల అయ్యే వరకు నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. వారి ఎన్‌డీఏ కూటమికి ఓటు వేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, గిద్దలూరుగిద్దలూరు జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు అబ్బిసెట్టి ఉదయ్‌శంకర్, బీజేపీ నాయకులు షేక్ ఖాదర్‌వలి, షఫి, ముప్పూరి శ్రీనివాసులు, పల్లెం శ్రీనివాసులు, ఆకుల నగేష్, బాదం రాములు, పిడతల సరస్వతి, బాదుల్లా, కె.ప్రవీణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు



ఎరిక్షన్‌బాబు, మన్నె రవీంద్రల సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 25 : త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామంలో వైసీపీని వీడి 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరు వైపాలెం టీడీపీ కార్యాలయానికి రాగా టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, జడ్పీమాజీ ఉపాధ్యక్షులు మన్నె రవీంద్రలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ఆకుమళ్ల మొగలమ్మ, దూపాడు మాజీ సర్పంచి నాసరరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి

ఎర్రగొండపాలెం : టీడీపీ గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టరు మన్నె రవీంద్ర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఎర్రగొండపాలెం టౌన్-3 వార్డులో టీడీపీ కార్యకర్తలతో కలసి ఇంటింటా టీడీపీ ఎన్నికల ప్రచారం డాక్టరు రవీంద్ర ప్రారంభించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆరుగ్యారెంటీ పథకాలు అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. బ్రహ్మంగారి వీధి, స్టేట్ బ్యాంక్ వీధులలో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఎరిక్షన్‌బాబు కుమార్తె చల్సియా మాట్లాడుతూ.. తన తండ్రిని ఎమ్మెల్యేగా గెలిపించితే ప్రజలకు అండగా ఉండి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి 23 కుటుంబాలు



విఘ్నేష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న జిలాని, కాలనీవాసులు

పొదిలి, ఏప్రిల్ 25 :మండలంలోని టి.సల్లూరు, బుచ్చెనపాలెం గ్రామాల్లో వైసీపీని వీడి గురువారం 23 కుటుంబాలకు గురువారం కందుల విఘ్నేష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బూత్‌కన్వీనర్ కాటూరి శ్రీనివాసులు, ఉప్పలపాడు మాజా సర్పంచ్ ఉలవాగోపి ఆధ్వర్యంలో వీరు వైసీపీలో చేరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్యకర్తలందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. జనసేన, బీజేపీలు బలపరిచిన ఉమ్మడి మార్కాపురం టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి, పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటును వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధితో పాటు, యువతకు భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు

మార్కాపురంవన్‌టౌన్, ఏప్రిల్ 25: మార్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి చెన్నకేశవస్వామి శేషవాహనంపై కాళియమర్ధన అలంకారంలో నగరోత్సవంలో నాలుగు మాడవీధులలో విహరించారు. ఉదయం జటప్రోలు సుబ్రమణ్యం, రాత్రి గానుగపెంట కూర్మయ్య వంశస్తులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులు స్వామిని పూజించి కాయకర్పూరం సమర్పించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ లక్ష్మీచెన్నకేశవుడు శుక్రవారం రాత్రి వ్యాళి వాహనంపై వామన అలంకారంలో నాలుగు తిరుమాడవీధులలో విహరించనున్నారు.

వైభవంగా తెప్పోత్సవం, రథోత్సవం

గిద్దలూరు : శ్రీనెమలిగుండ్ల రంగనాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామి తెప్పోత్సవం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల నడుమ ఉదయం 9గంటలకు రంగనాయకస్వామి గుండంలో స్వామి వారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాసు అంకాలమ్మ కోలాట బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన పలువురిని అలరించింది. అనంతరం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. కార్యనిర్వహణాధికారి రమేష్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



శేషవాహనంపై చెన్నకేశవుడు

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

పెద్ద దోర్నాల : పట్టణంలోని సీతారామ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బిదరే రాంప్రసాద్‌శర్మ సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకలు గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణ క్రతువును తిలకించారు. జై శ్రీరాం అంటూ భక్తి పారవశ్యంతో స్వామి వారిని సేవించారు. అనంతరం వడపప్పు, పానకం పంపిణీ చేశారు.




శేష వాహనంపై చెన్నకేశవుడు, సీతారాములకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దర్శి అసెంబ్లీకి 43 నామినేషన్లు దాఖలు


టీడీపీ అభ్యర్థికి మద్దతుగా నామినేషన్ దాఖలు చేస్తున్న ముప్పరాజు రవీంద్ర

దర్శి, ఏప్రిల్ 25: దర్శి అసెంబ్లీకి మొత్తం 43 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజున గురువారం అత్యధికంగా 15 నామినేషన్లు వేశారు. మొత్తం 22 మంది అభ్యర్థులు 43 నామినేషన్లు దాఖలు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టి పాటి లక్ష్మి నాలుగు సెట్లు, వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నాలుగు సెట్లు నామినేషన్లు వేశారు. టీడీపీ తరుపున గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్ సాగర్ మూడు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి సతీమణి ఆపార్టీ తరుపున రెండు సెట్లు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పి.కొండారెడ్డి మూడు సెట్లు, ఆయన సతీమణి కోటేశ్వరమ్మ ఒక సెట్ నామి నేషన్ దాఖలు చేశారు. వీరితో పాటు బహుజన సమాజ్ పార్టీ, ఇండియన్ ప్రజా బంధు పార్టీ, జాతీయ జనసేన పార్టీ, భారత చైతన్య యువజన పార్టీ, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి, ప్రజా అధికార పార్టీ, సమాజ్‌వాది పార్టీ, జనం పార్టీ, రీఫామ్స్ పార్టీ ఆఫ్ ఇండియా, తదితర పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరుగుతుందని చెప్పారు.

కనిగిరి అసెంబ్లీకి 39 నామినేషన్లు

కనిగిరి, ఏప్రిల్ 25: కనిగిరి అసెంబ్లీకి మొత్తం 39 నామినేషన్లు దాఖలు అయినట్టు ఆర్వో జాన్ ఇర్విన్ తెలిపారు. నఃచివరిరోజు గురువారం 18 నామి నేషన్లు వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తున్నట్లు చెప్పా రు. ఒకే అభ్యర్థి పేరుమీద వచ్చిన నామినేషన్లలో ఒకటిని పరిగణనలోకి తీసు కుని మిగతావి తిరస్కరించనున్నట్లు తెలిపారు.

గురువారం తెలుగుదేశం పార్టీ నుంచి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి నామినేషన్ వేశారు. వైసీపీ నుంచి దద్దాల నారాయణ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణి దద్దాల మంజుభార్గవి మరో నామి నేషన్ వేశారు. ఇండియన్ కాంగ్రెస్‌పార్టీ నుంచి దేవరపల్లి సుబ్బారెడ్డి 2 సెట్లు వేశారు. ఇండిపెండెంట్లుగా సానికొమ్ము ఆంజనేయులు, ముక్కు రామిరెడ్డి, ము ప్పర్లపాటి షంశీర్‌బాషా, గుంటుపల్లి శ్రీనివాసులు, మేలం వెంకటనారాయణ, కత్తులపల్లి లక్ష్మీనారాయణరెడ్డి, కూరాకు బాలనారాయణ నామినేషన్‌లు దాఖలు చేశారు. ఇండియన్ ముస్లింలీగ్ పార్టీ నుంచి షేక్ అల్లాబక్ష్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాచర్ల నవీన్‌కుమార్, బహుజన సమాజ్‌పార్టీ నుంచి తాతపూడి ప్రభుదాసు, జైభీంరావ్‌భారత్ పార్టీ నుంచి బ్రహ్మయ్యలు నామినేషన్లు వేశారు. జాతీయ జనసేనపార్టీ నుంచి చిన్నిగారి మహేష్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు.

టీడీపీలో పలువురు చేరిక


టీడీపీలో చేరిన పాబోలువారిపల్లి గ్రామస్థులు

పామూరు, ఏప్రిల్ 25: మండలంలోని బొట్లగూడూరు పంచాయతి పరిధిలోని పాబోలువారిపల్లికి చెందిన బోరుగడ్డ మల్లికార్జున, చీమలదిన్నె వెంగయ్య దేవరాయులు, వడ్డెపల్లి నరసింహులు, ఉప్పుటూరి రాజశేఖర్, శ్రీనివాసులురెడ్డి తదితరులు వైసీపీని వీడి గురువారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోట చినవెంకటేశ్వర్లు అధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, సర్పంచ్ ఎర్రగొల్ల బాల, అనపర్తి శశి, కోటపాటి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటసుబ్బారెడ్డి


వెంకటసుబ్బారెడ్డి (ఫైల్)

కనిగిరి, ఏప్రిల్ 25: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో నూతనంగా రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. ఈ ఎంపికలో 22 మందిని రాష్ట్ర పార్టీ కార్యదర్శులుగా నియమిస్తూ గురువారం రాత్రి కమిటీ నివేదిక విడుదల చేసింది. ఇందులో ప్రకాశంజిల్లాలోని కనిగిరి ప్రాంతానికి చెందిన దొడ్డా వెంకట సుబ్బారెడ్డి (డీవీఎస్ఆర్) ఉన్నారు. 1983లో టీడీపీ ఆవిర్భావం నుంచి ఎనలేని సేవలందిస్తున్నారు.. ఇప్పటివరకు మండల, జిల్లా స్థాయి పదవుల్లోనూ పనిచేసి టీడిపి అభివృద్ధికి కృషి చేశారు. దొడ్డావెంకటసుబ్బారెడ్డిని రాష్ట్ర టీడిపి కార్యదర్శిగా నియామకాన్ని కనిగిరి ప్రాతంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనను రాష్ట్రపార్టీ కార్యదర్శిగా నియమించటంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సహకారం ఎంతో ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో డాక్టర్ ఉగ్రకు అఖండ మెజార్టీ సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

కార్యదర్శిగా వెంకటసుబ్బారెడ్డి నియమితులు కావడంపై ఆపార్టీ మండల పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, బేరిపుల్లారెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), తమ్మినేని వెంకటరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, వెలిగండ్ల మండలపార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, శ్యామల కాశిరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి తదితరులు ఫోన్ ద్వారా అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

కనిగిరి, ఏప్రిల్ 25: చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.లక్షన్నర నగదు పరిహారాన్ని విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి కె.భరత్‌చంద్ర గురువారం తీర్పు ఇచ్చారు. పామూరుకు చెందిన సయ్యద్ ఖాజా రహంతుల్లా అనేవ్యక్తి బొమ్మిరెడ్డిపల్లికి చెందిన తూము జనార్దన్‌రెడ్డి వద్ద 2018లో అప్పుగా తీసుకుని దాని తాలూకా కింద రూ. ఒక లక్షా 50వేలుకు చెక్కు ఇచ్చారు. సదరు జనార్ధన్‌రెడ్డి చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. ఇందుకుసంబంధించి కోర్టులో వేయగా, ఈ కేసు ఆరేళ్ళపాటు విచారణ సాగింది. ఖాజా రహంతుల్లాకు ఏడాదిపాటు జైలుశిక్ష, రూ.లక్షా యాభైవేలు పరిహారం విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

కూలీలకు కనీస వేతనం అమలు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25 : ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ బి. అర్జునరావు ఆదేశించారు. ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో గురువారం పీవోలు, జేఈలు, టీవోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు ఉదయం 5.30 గంటలకే పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 9.30 లోపు పనిప్రదేశం నుంచికూలీలు ఇంటికి వెళ్ళేలా చూడటంతో పాటు సరాసరి వేతనం ఒక్కొక్క కూలీకి రూ.280 దక్కేల చూడాల్సిన సంబంధిత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం కూలీలకు కనీస వేతనం రూ.300 నిర్ణయించినందున తదనుగుణంగా ఆ వేతనం లభించేలా చూడాలని చెప్పారు. అమృత్‌సరోవ్, మినీ అమృత సరోవల్, ఫాంపాండు పనులు చేసేందుకు గుర్తించినందున వాటిని చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను సకాలంలో చెల్లింపులు చేయడంతో పాటు ఉపాధి పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు

పీఎఫ్ ఖాతాల ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలి

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 25: మునిసిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయులు పీఎఫ్ ఖాతాలు ప్రారంభించేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ అనుమతి ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2004కు ముందు ఉద్యోగాల్లో చేరిన వారికి పీఎఫ్ ఖాతా తప్పనిసరి. ప్రభుత్వ బకాయిలు, ప్రభుత్వ ఉద్యోగులకు వారి పీఎఫ్ ఖాతాకు జమచేస్తారు. అదే విధంగా ఎయిడెడ్, మునిసిపల్ టీచర్లకు కూడా వారికి కూడా పీఎఫ్‌ఖాతాలకు జమ చేయాలంటే వెంటనే వారు కూడా ఆయా ఖాతాలు ప్రారంభించాల్సి ఉంది. అందువల్ల ప్రభుత్వం వెంటనే పీఎఫ్‌ఖాతాలు ప్రారంభానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

- దొనకొండలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


తాళ్లూరు: గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన శివరాంపురం ఉపసర్పంచ్ రామ్మూర్తి, ఆయన వర్గీయులు

దొనకొండ, ఏప్రిల్ 25: వెనుకబడిన దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు కల్పించటమే తమ ప్రథమ కర్తవ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని గంగదేవి పల్లి, పెద్దగుడిపాడు, చిన్నగుడిపాడు, ఎన్ఎన్‌పాలెం, పెద్దన్నపాలెం, దొండపాడు, ఆరవల్లిపాడు, తెల్లబాడు, నల్లబోతులవారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సంవత్సరాలుగా ప్రజలను పట్టిపీడిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో దర్శి నియోజక వర్గం అభివృద్ధిలో ముందుందని చెప్పారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో అభివృద్ధిలో ఒక్క అడుగు ముందుకు వెళ్లలేదని ధ్వజమెత్తారు. గొట్టిపాటి కుటుంబం ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఆ నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. అవినీతి సం పాదన అవసరం లేదని, ప్రజలను ఇబ్బంది పెట్టే మనస్తత్వం తమది కాదని చెప్పారు. ప్రజల సొమ్ము అవసరం లేదన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ మె విజ్ఞప్తి చేశారు.


కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, వీరపనేని వెంకన్నచౌదరి, కందుల నారపురెడ్డి, తదితరు లు పాల్గొన్నారు.

శివరాంపురం ఉపసర్పంచ్ టీడీపీలో చేరిక

తాళ్లూరు, ఏప్రిల్ 25: మండలంలోని శివరాంపురం ఉపసర్పంచ్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రధాన అనుచరుడు నారిపెద్ది రామ్మూర్తి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో దర్శిలోని ఆమె నివాసంలో బుధవారం రాత్రి పార్టీలో చేరారు. వైసీపీకి చెందిన నారిపెద్ది శ్రీనివాసరావు, సయంపు రత్తయ్య, ముప్పనేని లక్ష్మీనారాయణ, ముప్పనేని సుబ్బారావు, మన్నెం రాజా, తేళ్ల అంజయ్య, అనుపర్తి నగేష్, పున్నారావు, తేళ్ల నరసయ్య, తొలుచూరి సుబ్బారావు, కొంగల సుబ్బరాయుడు తదితరులకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనపై విసుగెత్తిన ప్రజలు టీడీపీ కూటమిపై చూస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలోనే న్యాయం జరుగుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు.

టీడీపీలో పలుకుటుంబాలు చేరిక

దర్శి, ఏప్రిల్ 25: మండలంలోని పోతవరం పంచాయతీ తిమ్మాయిపాలెంకు చెందిన 15 కుటుంబాలు గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ నాయకులు పి.రమణారెడ్డి, బి.రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో వివిధవర్గాలకు చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకముందు దర్శి పట్టణానికి చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా లలిత్‌సాగర్ మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందనే నిర్ణయానికి రాష్ట్ర ప్రజలు వచ్చారని చెప్పారు. వైసీపీ అరాచక పాలన భరించలేక అన్నివర్గాల ప్రజలు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచా యతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ తలారి కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.


దర్శి: డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ వర్గీయులు


దొనకొండ మండలం నరసింహనాయుని పాలెంలో ప్రసంగిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

'ముండ్లమూరు'లో పలువురు చేరిక

ముండ్లమూరు, ఏప్రిల్ 25: మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన చిరుమామిళ్ళ సుబ్బారావు, దొప్పలపూడి శ్రీను, కంచర్లగుంట ఈశ్వరరావు, వెల్లంపల్లి శ్రీను, పొదిలి సాంబమూర్తి, బత్తుల నరసింహ, వలంటీరు బత్తుల కృష్ణ, పల్లా లక్ష్మీనారాయణలు వైసీపీని వీడి గురువారం డాక్టర్ లలిత్ సాగర్ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సుంకర రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, వాకా బ్రహ్మారెడ్డి, పాశం వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో పది కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి లలిత్ సాగర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే, శంకరాపురం గ్రామానికి చెందిన వైసీపీ యవ నాయకుడు మందలపు అశోక్ ఆ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో గురువారం లలిత్ సాగర్ సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

- కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల, ఏప్రిల్ 25: టీడీపీలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సముచిత స్థానంతో పాటు గౌరవం దక్కుతుందని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు గురువారం మండలంలోని రాళ్ళపల్లి పంచాయతీలో యాదవ సామజికవర్గానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు గవదకట్ల చిన్నఅక్కయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. గురువారం కనిగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యలయంలో ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్ళగా రాక్షసపాలన సాగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుందన్నారు కార్యక్రమంలో గోంగూడి నాగశ్వరావు, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, గవదకట్ల మాలకొండయ్య, గవదకట్ల హరికృష్ణ, గొనా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వైసీపీలో కనిపించని జోష్

- కనిగిరిలో నామమాత్రంగా సాగిన ర్యాలీ
- నామినేషన్ సందర్భంగా స్పందించని జనం


వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో నామమాత్రంగా జనం

కనిగిరి, ఏప్రిల్ 25: కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ నామినేషన్ ర్యాలీ గురువారం నామమాత్రంగా సాగింది. ఈ ర్యాలీలో ఎక్కడా జోష్ కనిపించలేదు. స్థానిక డాక్టర్ రామయ్యనాయుడు ఆసుపత్రి వద్ద ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి సుగుణవతామ్మ సెంటరు, ఎమ్మెస్సార్ రోడ్డు మీదుగా బొడ్డుచావిడి, ఒంగోలు బస్టాండు, పామూరు బస్టాండు వరకు ర్యాలీ సాగింది. సుగుణమ్మ ఆసుపత్రి నుంచి ఒంగోలు బస్టాండు వరకు ఇరుకు వీధులే తప్ప విశాలమైన రోడ్డు లేదు. అయినా జనం పెద్దగా కనిపించపోవటంతో వైసీపీ నేతల్లో అసహనం ఏర్పడింది. ఉదయం 11 గంటలకు మొదలైన ర్యాలీ పామూరు బస్టాండుకు వచ్చేసరికి 12.30 అయింది. కేవలం గంటన్నర లోపే ర్యాలీ ముగిసింది. వచ్చిన ఆ కాస్తా జనం కూడా ఎండధాటికి తట్టుకోలేక ర్యాలీ వచ్చేవరకు ఆగకుండా ఇళ్ళ ముఖం పట్టారు. ర్యాలీలో పాల్గొన్న జనంలో కూడా ఎక్కడా జోష్ కనిపించలేదు. ర్యాలీలో అభ్యర్థితోపాటు వాహనంలో బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, పీడీసీసీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, మండలాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గుంటిగంగ తిరునాళ్ల

- గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ

తాళ్లూరు ఏప్రిల్ 25: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటిగంగ తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా జరిగింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ కావటంతో అధికసంఖ్యలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిమందిగా వచ్చిన భక్తులు తమ మొక్కుబడులుగా గంగమ్మకు పశు జాతిని బలిఇచ్చి ఈఏడాది కరువు నుంచి ప్రజల్ని కాపాడాలని, సకాలంలో వర్షాలు కురిపించి కాపాడు గంగమ్మతల్లి అంటూ వేడుకున్నారు. భక్తులు పశుసంపదను, వాహనాలను తీసుకువచ్చి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు జరిపారు. గంగమ్మగుడి ప్రక్కనున్న నాగదేవత స్వామికి, కృష్ణమందిరం, శివాలయాలను దర్శించుకుని పూజలు చేశారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాల వద్ద వేలాది మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


అమ్మవారి పొంగళ్లు నెత్తిన పెట్టుకుని మొక్కులుతీర్చుకుంటున్న భక్తులు

దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్ పర్యవేక్షణలో దర్శి సీఐ షమీవుల్లా నేతృత్వంలో ఎస్ఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. పొంగళ్లు పెట్టే మహిళలు కూడా నీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా నీటి వసతి ఏర్పాటుచేశారు. తేజా వృద్ధాశ్రమ నిర్వాహకులు తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఉచితంగా మజ్జిగ అందజేశారు. సోమా పుల్లయ్య సన్స్ నిర్వహణలో శ్రీరామ్‌సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

వెలగని వీధిలైట్లు.. ప్రజలకు తప్పని పాట్లు

- పట్టించుకోని పాలకులు

పామూరు, ఏప్రిల్ 25: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పంచాయతీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారుగా 12 వీధిలైట్లు మరమ్మతులకు గురయ్యాయి. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రుళ్లు బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకొని తమ ఇబ్బందులు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అయ్యవారిపల్లి గ్రామంలో వెలగని వీధిలైట్లు

అలాగే, మండలంలోని వగ్గంపల్లి గ్రామ ఎస్టీ కాలనీలోనూ వీధిలైట్లు వెలగక స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. రాత్రుళ్లు విషసర్పాలు సంచరిస్తున్నాయని, దీంతో బయటకు రావాలంటే కాలనీ వాసులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఖాతాదారుల భద్రతే బ్యాంక్ లక్ష్యం

పామూరు, ఏప్రిల్ 25: ఖాతాదారుల భద్రతతో పాటు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందటమే తమ బ్యాంక్ ప్రధాన లక్ష్యమని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ హెడ్ జనరల్‌మేనేజర్ రితీష్ కుమార్ తెలిపారు. గురువారం పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో నూతన బ్రాంచ్‌ను రీజనల్ మేనేజర్ ఎంబీ శేషగిరితో కలిసి ప్రారంభించారు. అనం తరం ఖాతాదారులతో రితీష్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంక్ వ్యాపారవృద్ధికి తోడ్పాటు అందించి బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ బ్యాంక్ మెనేజర్ ఆర్.చినమాబాష, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు ఇర్రి కోటిరెడ్డి, రిటైర్డ్ బ్యాంక్ మెనేజర్ సాల్మాన్‌రాజు, రిటైర్డ్ తహసీల్దార్ ఆర్ నాసరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జీఎం రితీష్‌కుమార్

ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి


మేములబండలో ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి భరత్

ముండ్లమూరు, ఏప్రిల్ 25: టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న తన అక్క గొట్టిపాటి లక్ష్మి మద్దతు పలకాలని గొట్టిపాటి భరత్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించటంలో ప్రత్యేక దృష్టి సారిస్తారని చెప్పారు. గురువారం మండలంలోని వేముల, వేములబండ, కమ్మవారిపాలెం, రాజగోపాలరెడ్డినగర్‌లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా భరత్ మాట్లాడుతూ తన తాత హనుమంతరావు, తన తండ్రి నరసయ్య, తన బాబాయి రవికుమార్ ముండ్లమూరు మండలంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరిచారన్నారు. తన అక్కకు ఒక్క అవకాశం ఇచ్చినట్లయితే గ్రామాల్లోని అన్ని సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, గజ్జల సుబ్బారెడ్డి, సిమ్మిరి కోటేశ్వరమ్మ, సూ రపరెడ్డి ఏడుకొండలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా డ్రా చేసిన నగదును తిరిగి చెల్లించాలి


నీటిపారుదల శాఖ జారిచేసిన నోటీస్

పామూరు, ఏప్రిల్ 25: పామూరు మండలంలోని మోపాడు రిజర్వాయర్‌కు సంబంధించిన నగదును నీటి వినియోగదారుల సంఘం చైర్మన్ జక్కు శ్రీనివాసరెడ్డి బ్యాంకు నుంచి డ్రా చేసుకొన్న సంఘటనపై నీటిపారుదల శాఖ డీఈ రవి నోటీస్ జారీ చేశారు. మోపాడు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న జక్కు శ్రీనివాసరెడ్డి సంఘం ప్రభుత్వ అకౌంట్ నెంబరు 019610011002047, కంభాలదిన్నె యూనియన్ బ్యాంక్ నుంచి ఇరిగేషన్ శాఖ అధికా రులకు తెలియకుండా ఖాతాలోగల మత్స్యశాఖ జమ చేసిన నగదును జనవరి 13,2021న రూ.2 లక్షల 64వేలుడ్రా చేసినట్లు విచారణలో తెలిసిందని రవి తెలిపారు. పలుదఫాలుగా విజ్ఞప్తిచేసినా శ్రీనివాసరెడ్డి ఇంతవరకు నగదు జమ చేయకపోవడంతో నోటీస్ జారీ చేసినట్లు చెప్పారు.

నోటీస్ అందుకొన్న వారం రోజుల్లో నగదును బ్యాంకులో జమ చేసి సంబంధిత రసీదును డిపార్ట్‌మెంట్ వారికి అప్పజె ప్పాలని తెలిపారు. అలాచేయని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకొంటామని నోటీసులో పేర్కొన్నారు.





నరసరావుపేట మండలం పమిడిమర్రు ప్రాంతంలో నిర్మించిన వ్యవసాయ బోరు



ర్యాలీలో కొండయ్య, హీరో నిఖిల్ అభివాదం

చీరాలలో జోష్

- అట్టహాసంగా కొండయ్య నామినేషన్
- ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న కూటమి శ్రేణులు

చీరాల, ఏప్రిల్ 25: భానుడు భగభగ మంటున్నా.. కూటమి శ్రేణుల్లో తగ్గని జోష్.. డోలు, డప్పు వాయిద్యాల సందడి నడుమ గురువారం కూటమి తరఫున చీరాల టీడీపీ అభ్యర్థిగా ఎంఎం కొండయ్య నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కొండయ్య నామినేషన్ ర్యాలీ అట్టహాసంగా సాగింది. మండల పరిధిలోని హస్తినాపురం వినాయకుని గుడి వద్ద గురువారం కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన మేనల్లుడు, సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ, కుటుంబ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి నామినేషన్ పత్రాలను ఈఆర్వో కార్యాలయంలో సమర్పించేందుకు ర్యాలీగా బయలు దేరా రు. టీడీపీ శ్రేణులు జెండాలు చేపట్టి ర్యా లీలో పాల్గొన్నారు. దీంతో పట్టణం పసుపు మయంగా మారింది. ప్రసాద్ థియేటర్ సెంటర్‌లోని వీరాజంనేయస్వామి వారి ఆలయం వద్ద వారు చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది. టౌన్‌హాల్ వద్ద కొండయ్య, నిఖిల్ ప్రసంగించారు.

ఆలోచించి.. ఆశీర్వదించండి

ఇప్పటి వరకు జరిగిన పాలన చూశారు.. అన్ని వర్గాలు నష్టపోయాయని ఆలోచించి ఆశీర్వదించాలని కొండయ్య కోరారు. వైసీపీ పాలకులు కింద నుంచి పైదాకా దోచుకో, దాచుకో అన్న చందంగా వ్యవహరించారని ఆరోపించారు. అభివృద్ధి, ప్రశాంతత కావాలంటే తనకు ఓటేయాలని.. కక్షలు, కార్పణ్యాలు కావాలంటే వాళ్లిద్దరని కొండయ్య వివరించారు. యువతకు ఉపాధి లేదని, రైతులకు సాగునీరు లేదని, పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. బాబు కావాలంటే అని కొండయ్య అనగానే శ్రేణులు బాబు రావాలంటూ ప్రతి స్పం దించారు. చీరాలలో పార్టీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఖర్చు చేసిన ప్రతి పైసా తన కష్టార్జితమేనన్నారు. తాను ఎక్కువ మాటలు చెప్పనని, కానీ చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు.



నామినేషన్ ర్యాలీలో అభ్యర్థి కొండయ్య, పక్కన ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, సినీ హీరో నిఖిల్

మామయ్య మంచోడు : హీరో నిఖిల్

మామయ్య కొండయ్యను తాను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని ఆయన చాలా మంచోడని సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ తెలిపారు. చెప్పిన మాట తప్పితే చొక్కా పట్టుకుని అడగండంటూ ఉద్వేగభరితంగా మాట్లాడారు. టౌన్‌హాల్ వద్ద ప్రసంగాల అనంతరం ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, మున్సిపల్ కార్యాలయం మీదగా ఆర్డీవో కార్యాలయానికి చేరింది. నాయకులతో కలసి ఆర్వో సూర్యనారాయణరెడ్డికి కొండయ్య నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల లోక్‌సభ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఉన్నారు.

249 నామినేషన్లు దాఖలు

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- చివరి రోజు పెద్ద సంఖ్యలో దాఖలు
- నేడు పరిశీలన.. 29 వరకు ఉపసంహరణ గడువు

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారంతో ముగిసింది. బాపట్ల లోక్‌సభ, జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 249 నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. ఈ నెల 18 నుంచి మొదలైన నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. వారం రోజుల పాటు కోలాహలంగా సాగిన ఈ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు మొదలు, వివిధ సంఘాలు, స్వతంత్రులుగా పెద్ద సంఖ్యలో నామినేషన్లను సమర్పించారు. చివరిరోజైన గురువారం నామినేషన్లు జోరందుకున్నాయి. లోక్‌సభ స్థానానికి గురువారం 9 మంది అభ్యర్థులు 17 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు లోక్‌సభ స్థానానికి 20 మంది అభ్యర్థులు 34 సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఇక బాపట్ల అసెంబ్లీ స్థానానికి 31 మంది 46 నామినేషన్ సెట్లు దాఖలు చేయగా, అద్దంకికి 21 మంది అభ్యర్థులు 36 సెట్లు దాఖలు చేశారు. రేపల్లెలో 18 మంది అభ్యర్థులు 35 సెట్లు, చీరాలలో 39 సెట్లు, పర్చూరులో 24 మంది 35 సెట్లు, వేమూరులో 17 మంది అభ్యర్థులు 24 సెట్లు దాఖలు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి సా యంత్రం వరకు నామినేషన్ల పరిశీలన జరగనుంది. 29 వరకు ఉపసంహరణ గడువు ఉండడంతో ఆ తర్వాత తుది బరిలో నిలిచిదేవరో అనే అంశంపై స్పష్టత రానుంది. నామినేషన్ల పర్వం కూడా ముగియడంతో ప్రచారంలో అభ్యర్థులు మరింత దూకుడు పెంచనున్నారు.

జలకళ పథకాన్ని అటకెక్కించారు. ఎన్‌టీఆర్ జలసిరి.. వైఎస్‌ఆర్ జలకళగా పేరు మార్చేసిన ప్రభుత్వం బోర్ల నిర్మాణాన్ని విస్మరించింది. పేరు మార్చుకోవడంలో శ్రద్ధ చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకం అమలుకు పైసలివ్వలేదు. సాగునీటి సంక్షోభంలో జలకళ అన్నదాతలను ఆదుకోలేక పోయింది. ప్రభుత్వం వ్యవసాయ బోర్లు నిర్మించి ఉంటే రైతులు పంటలు సాగు చేసేవారు. సాగునీరు లేక జిల్లాలో లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. రైతుల కల మన వైఎస్‌ఆర్ జలకళ అనే నినాదంతో ప్రవేశపెట్టిన జలకళ పథకం అమలులో ప్రభుత్వం బొక్కబోర్లా పడింది. మూడున్నరేళ్లుగా జలకళను ప్రభుత్వం సాగదీసింది. బోర్ల నిర్మా ణానికి నిధులు కేటాయిండంలో చేతులెత్తేసింది. ఇప్పటికి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,235 బోర్లు మాత్రమే నిర్మిం చా రు. జలకళ అమలులో ప్రభుత్వా నికి చిత్తశుద్ధి లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల రైతులకు తీరని అన్యాయం చేసింది.

నెరవేరని జలకళ

- మూడున్నరేళ్లు.. 139 బోర్లు
- బోర్ల పథకం అమలులో బొక్కబోర్లా
- రైతులకు అక్కరకురాని జలకళ
- బోర్లు నిర్మించి ఉంటే పంటలు పండేవి
- మొక్కుబడిగా బోర్ల నిర్మాణం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ద్రోహం
- ఇదీ జలకళలో జగనన్న సాధించిన ఘనత

జలకళ పురోగతి క్లస్టర్‌ల వారీగా ఇలా..

క్లస్టర్	దరఖాస్తుల సంఖ్య	అమోదించినవి	నిర్మించిన బోర్లు
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,895	1,532	134
మాచర్ల	5,072	4,178	757
వినుకొండ	2,597	1,986	203
బాపట్ల	314	236	76
చీరాల	4,241	1,547	821
గుంటూరు	198	157	11
తెనాలి	283	234	149
మొత్తం	15,423	10,585	2,235

- బోర్ల నిర్మాణానికి దరఖాస్తులు : 15,423
- ఆమోదించిన దరఖాస్తులు : 10,545
- నిర్మించిన బోర్లు : 2,235
- బోర్లు నిర్మాణం శాతం : 21.94
- విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చిన బోర్లు : 263
- మోటార్లు అమర్చిన బోర్లు : 139
- నిరూపయోగంగా ఉన్న బోర్లు : 2,096

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారీగా బోర్ల నిర్మాణం ఇలా

వర్గం	దరఖాస్తులు	ఆమోదించినవి	బోర్ల నిర్మాణం
ఎస్టీ	2,745	2,256	191
ఎస్సీ	1,616	1,294	209
మైనార్టీ	271	213	34
బీసీ	5,499	4,579	1,097
మొత్తం	10,131	8,342	1,531

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బోర్ల నిర్మాణం కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. మొక్కు బడిగా జలకళను అమలు చేశారు. రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న పాలకులు బోర్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై వారు నోరు మెదపలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 15,423 మంది రైతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 10,545 దరఖాస్తులను ఆమోదించినప్పటికి 2,235 బోర్లు మాత్రమే నిర్మించారు. బోర్ల నిర్మాణం 21.94 శాతమే. నిర్మించిన బోర్లకు బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.22.56 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.72.36 లక్షలు చెల్లించారు. దీంతో బోర్లు నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బోర్లకు మోటార్లు అమర్చడంలో, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. విద్యుత్ కనెక్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో బోర్లు అందుబాటులోకి రాకపోవడంలో వేలాదిమంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కళ్లు కాచేలా ఎదురు చూశారు..

చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు జలకలను ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టి అమలులో చతికిలపడింది. బోరు బావుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది రైతులు వీటి నిర్మాణం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పథకం అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వ్యవసాయంపై ఆధారపడిన



రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్న, సన్న కారు రైతులను ఉచిత బోరు బావుల పథకం ఆదుకోలేకపోయింది. వ్యవసాయ యోగ్యమైన భూమి ప్రతి ఎకరానికి సాగులోనికి తెస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణను విస్మరించింది. బోర్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలకు అడియాసే మిగిలింది. ప్రధానంగా నిధుల కొరత వెంటాడుతోంది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోతుండటంతో బోర్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో కూడా జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి పూడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు నిర్మించి ఉంటే వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసి ఉండేవారు.

ఆ రైతులకు తీరని అన్యాయం

సీఎం జగన్ నా అని చెప్పుకొనే అన్నదాలకు ఒరగబెట్టింది ఏమీ లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులు బోర్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కూడా బోర్ల నిర్మాణం చేపట్టలేదు. అదే బోర్లు నిర్మించి ఉంటే కరువు పరిస్థితుల్లో సదరు రైతులు పంటలు పండించి ఆర్థిక లబ్ధి పొందేవారు. జగన్ వైఖరి కారణంగా ఆయా వర్గాలు సాగు చేసిన పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోయారు. ఆయా వర్గాలకు చెందిన 10,191 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. బోర్లు మంజూరు లోనూ అన్యాయమే జరిగిందనేది లెక్కలు చెబుతున్నాయి. 8,342 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. వీరికి సంబంధించిన బోర్ల నిర్మాణం తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆమోదించిన దరఖాస్తులలో కేవలం 1,531 బోర్లు మాత్రమే నిర్మిం చారు. బోర్ల నిర్మాణం 18.35 శాతానికే మూడేళ్లుగా పరిమితం అయ్యాయంటే నా.. నా అని చెప్పుకోనే వాళ్ల విషయంలోనూ జగన్‌కు చిత్తశుద్ధి లేదనేది వాస్తవం అని జలకళ స్పష్టం చేస్తోంది.



వెల్దుర్తి మండలంలో బోరు నిర్మాణం

ఇక నిర్మించిన బోర్ల విషయానికి వస్తే..!

జలకళ కింద నిర్మించిన బోర్లుకు విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు ఇవ్వడంలోనూ అలసత్వం తాడవిస్తోందని చెప్పవచ్చు. 2,235 బోర్లు జిల్లాలో నిర్మించారు. మూడు జిల్లాల్లో 263 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు. వీటిలో కేవలం 139 బోర్లకు మోటార్లు అమర్చారు. 2,096 బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. నిధుల విడుదల తీవ్ర జాప్యం వలనే కనెక్షన్‌లు ఆలస్యం అవుతున్నదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 197 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా వీటిలో 60 బోర్లకు మాత్రమే మోటార్లు బిగించారు. బాపట్ల జిల్లాలో 50 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగా ఒక్క బోరుకు కూడా మోటారు బిగించకపోవడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 116 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా 79 బోర్లకు మాత్రమే మోటార్లు అమర్చారు. 2,235 బోర్లు నిర్మిస్తే కేవలం 139 బోర్లు మాత్రమే వినియోగంలోకి వచ్చాయంటే ఈ పథకం పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైందని చెప్పవచ్చు. బోర్లు నిర్మించి నెలలు గడుస్తుండటంతో వినియోగించకపోతే అవి పూడిపోతాయన్న ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. జలకళ కింద బోర్లు నిర్మాణ పూర్తి చేసి ఉంటే ఖరీఫ్, రబీ సీజన్‌లలో వేలాది ఎకరాల్లో రైతులు పంటలు పండించి ఆర్థికంగా లబ్ధిపొందేవారు.

తుది ఓటర్ల జాబితా సిద్ధం

- 29న విడుదలకు ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా సిద్ధమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధమైన తుది ఓటర్ల జాబితాను ఈ నెల 29న విడుదల చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదం తెలిపిన వెంటనే తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయపార్టీలకు, ప్రతీ పోలింగ్ కేంద్రానికి అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా నేరుగా ఓటర్లకు పంపిణీ చేశామన్నారు. పరిశీలన ముగిసిన తర్వాత నామినేషన్లు ఉపసంహరణ వెనువెంటనే చిహ్నాల కేటాయింపు ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, ఆయా పార్టీల నాయకులు కెవి.రామకృష్ణ, కాగిత కోటేశ్వరరావు, దోనేపూడి రవి, కోటేశ్వరరావు, ఆట్ల బాలాజీరెడ్డి, మాల్యా ద్రి, షేక్.మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

వైసీపీ టీ షర్టుల ఘటనపై కేసు

పేరుపై స్పష్టత ఇవ్వని పోలీసులు

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ ఫొటోలతో ఉన్న టీ షర్టులను తరలిస్తున్న ఘటనపై గురువారం చందోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ముగ్గురిపై కేసు నమోదు చేయగా ఇందులో బస్ డ్రైవర్ కూడా ఉన్నారు. పిట్టలవానిపాలెం చెక్‌పోస్టు వద్ద బుధవారం చేపట్టిన తనిఖీల్లో ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో 1525 టీ షర్టులతో పాటు 500 ఫ్యాన్ గుర్తుల బెలూన్లను పోలీ సులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. టీషర్టులపై పర్చూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ బొమ్మలు ఉండడంతో పాటు రిసీవింగ్ రశీదుబాలాజీ అనే పేరుతోనే ఉండటంతో తర్జనభర్జనల అనంతరం కోర్టు అనుమతితో కేసు నమోదు చేశారు. కానీ రిసీవింగ్ రశీదులో బాలాజీ అనే పేరు ఉండడంతో ఆ పేరు మీదనే కేసు నమోదు చేశారు. అయితే అతను వైసీపీ అభ్యర్థి అనే విషయంపై పోలీ సులు స్పష్టత ఇవ్వడం లేదు.

జీఎస్టీ పరిధిలోకి అని...

బుధవారం ప్రచార సామగ్రి దొరకగానే వాటికి సంబంధించి కొనుగోలు బిల్లులు చూపెట్టి డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌లో తిరిగి వాటిని తీసుకెళ్లొచ్చనే వాదనను పోలీసులు వినిపించారు. కానీ టీషర్టులనేవి ఓటర్లను ప్రలోభపరిచే సామగ్రి కిందకే రావడంతో పాటు వాటి విలువ ప్రకారం చూసుకున్నా నిబంధనల ప్రకారం కేసు నమోదు చేయాల్సి రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పోలీసు ఎన్నికల పరిశీలకులు కెప్టెన్ ఎంఎ అయ్యప్పకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

పోలీసు పరిశీలకుడు కెప్టెన్ అయ్యప్ప

బాపట్ల, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో సమర్థంగా ఎన్నికలు నిర్వహించాలని బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పోలీసు ఎన్నికల పరిశీలకుడు కెప్టెన్ ఎంఏ అయ్యప్ప అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ వకుల్ జిందాల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎన్నికలకు సంబంధించి పోలీసుశాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలు, పోలింగ్ స్టేషన్ల వద్ద కల్పిస్తున్న భద్రతా ఏర్పాట్ల గురించి ఆయన వివరాలు తీసుకున్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు గురించి ఎస్పీతో చర్చించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తదితరులు ఉన్నారు.

నేరం వైపా.. నిజం వైపా

- మీరే తేల్చుకొని ఓటు వేయాలి
- కాంగ్రెస్‌తోనే సంక్షేమం, ప్రత్యేక హోదా
- గుంటూరు న్యాయయాత్రలో పీసీసీ చీఫ్ షర్మిల

గుంటూరు, ఏప్రిల్ 25: ఎన్నికల్లో మీరు నేరం వైపు ఉంటారా.. నిజం వైపు ఉంటారా.. తేల్చుకొని ఓటు వెయ్యండి.' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారం, న్యాయయాత్రలో భాగంగా గురువారం రాత్రి గుంటూరు సంజీవయ్యనగర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. మన జీవితాలు, జాతకాలు మార్చకలిగేది ఓటని, రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచన చేసి వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమంతో పాటు పదేళ్ళ ప్రత్యేక హోదా వస్తుందని తెలిపారు. మూడు రాజధానులని సీఎం జగన్ ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీకి ఓటు వేస్తే చివరకు గుండు సున్నానే మిగిలిందని ఎద్దేవా చేశారు. సీపీఐ రాష్ట్ర నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ గ్యాస్, పెట్రో ధరలతో పేదల నడ్డి విరిచారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ పెత్తందారులకు ప్రభుత్వ ఆస్తులను దోచిపెడుతూ దేశాన్ని నష్టాల ఊబిలోకి నెడుతున్నారని విమర్శించారు. సీపీఎం నేత పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ హిందూ సామ్రాజ్యం స్థాపించే కుట్ర చేస్తుందన్నారు. లౌకిక దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తూ ఓట్లు పొందాలన్న బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. తూర్పు కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ వైసీపీ నాయకులకు డబ్బులివ్వకపోతే ఇళ్ళ ముందు గోడ కూడా కట్టుకోలేని దుస్థితి నెలకొన్నదని ధ్వజమెత్తారు. మత్సీ వ్యాపార సామ్రాజ్యం కోసమే ఎమ్మెల్యే ముస్తఫా తన కుమార్తెను అభ్యర్థిగా పోటీకి నిలిపారన్నారు.



ప్రసంగిస్తున్న షర్మిల, వేదికపై మస్తాన్‌వలి, అజయ్‌కుమార్ తదితరులు

షర్మిలకు ఘన స్వాగతం

అంతముందు షర్మిలకు చుట్టుగుంట సెంటర్‌లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. చుట్టుగుంట సెంటర్ నుంచి కలెక్టరేట్ మీదగా నాజ్ సెంటర్, మూడు వంతెనలు, వసంతరాయపురం నుంచి సంజీవయ్య నగర్ వరకు ర్యాలీగా షర్మిల పర్యటన సాగింది. సమావేశంలో ఇండియా కూటమి గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల జంగాల అజయ్‌కుమార్, పశ్చిమ కాంగ్రెస్ అభ్యర్థి రాచకొండ జాన్‌బాబు, పొన్నూరు, తాడికొండ, ప్రత్తిపాడు అభ్యర్థులు జక్కా రవీంద్రనాథ్, సుశీల్‌రాజా, కొరివి వినయ్‌కుమార్, మంగళగిరి సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కట్టా జవహర్‌బాబు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు ఉన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి

- ఏలూరికి మద్దతు తెలుపుతున్న నేతలు
- అందరం కలిసి అభివృద్ధిని పునఃప్రారంభిద్దాం
- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సాంబశివరావు

పర్చూరు, ఏప్రిల్ 25: రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేని విధంగా పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరికి మద్దతు తెలుపుతున్నారు. ప్రతిరోజూ వైసీపీకి గుడ్‌బై చెప్పి సైకిల్ ఎక్కుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. గత రెండు నెలల నుంచి పార్టీలోకి వలసల జోరుగా సాగుతున్నాయి. పార్టీలకు అతీతంగా ఏలూరి చేస్తున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, అందరికీ అందుబాటులో ఉంటున్న తీరుకు ప్రజా మద్దతు పెరుగుతోంది. గురువారం మార్టూరు మండలం ఇసుకదర్శి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో మార్టూరు, పెద్దగంజాం, ఉప్పుటూరు, గర్నెపూడి, కోనంకి గ్రామాల నుంచి వందలాది మంది తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారికి ఏలూరి కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రపుఃనిర్మాణం, భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ టీడీపీలో కలసి రావాలని కోరారు. వైసీపీ అరాచక విధ్వంస పాలనను సాగనంపేందుకు ప్రజా కూటమి ఏర్పాటు అయ్యిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

పెదగంజాంలో..

పెద్దగంజాంకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారిలో భీమవరపు సుందరంకొండ, ఆముదాలపల్లి శివ, భీమవరపు రాములు, ఆముదాలపల్లి గోపి, భీమవరపు శ్రీను, మార్టూరి రామచంద్ర, ఆముదాలపల్లి అంకమ్మరావు, శ్రీనివాసరావు, మురళీ, కోటయ్య, వెంకటేష్, నూటక్కి కోటేశ్వరరావు ఉన్నారు.



చెరుకూరులో ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ఉప్పుటూరులో..

పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ శ్రేణులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారికి ఏలూరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పాలేటి శివనాగేశ్వరావు, షేక్.కరిముల్లా, ఉరుమ కుమార వీరభద్రరావు, కొమ్మనబోయిన కోటయ్య షేక్ ఖాశీంబుడే ఉన్నారు.

మార్టూరులో..

మార్టూరుకు చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉయ్యాల ఆంజనేయులు, పాలపర్తి రత్తయ్య, పాలపర్తి నాగరాజు, కోటేశ్వరరావు, అలపర్తి వీరబ్రహ్మం, ఉయ్యాల నరేంద్ర, పేరం అనిల్ పార్టీలో చేరారు. తూర్పు బజార్‌కు చెందిన దగ్గుబాటి సుధాకర్, సురేష్, మక్కెన రమణ, కోటి శ్రీనివాసరావు, దాశి రక్షణ పార్టీలో చేరారు. కోనంకికి చెందిన పఠాన్ నాగూర్ వలి పార్టీలోకి చేరారు.

గర్నెపూడిలో..

పర్చూరు మండలం గర్నెపూడి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, షేక్ ఖాశీంబుడే, పఠాన్ నాగూర్ మీర్సా, షేక్ నాగూర్ వలి, పఠాన్ సుభానీ, కొరిటాల ఈశ్వర్‌చంద్ర, పార్టీలోకి చేరారు.

పర్చూరులో దూసుకుపోతున్న టీడీపీ ప్రచారం

- వాడవాడలా టీడీపీకి బ్రహ్మరథం

సార్వత్రికల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ ప్రజా కూటమి చేపడుతున్న ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతూ అడుగడునా స్వాగతం తెలపుతున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజయం కోసం పెద్ద సంఖ్యలో మహిళలు యువకులు, వృద్ధులు సైతం తరలివచ్చి మద్దతు తెలుపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీకి చెందిన శ్రేణులు టీడీపీలో చేరుతున్నారు. గురువారం మండలంలోని చెరుకూరు గ్రామంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి ఉషారాణి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించి చంద్రన్న సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

కారంచేడులో..

కారంచేడు గ్రామ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఎన్నిలక ప్రచారం నిర్వహించారు. ఈప్రచారానికి పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు, యువకలు తరలివచ్చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంకొల్లులో కూటమి శ్రేణుల ప్రచారం



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన ఉప్పుటూరు వైసీపీ నాయకులు

ఇంకొల్లు : టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబును గెలిపించి ముఖ్యమంత్రిని చే యాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విస్తృత ప్రచారాన్ని చేశారు. గు రువారం ఇంకొల్లు స్టాలిన్‌పేటలో జరిగిన ప్రచారంలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు వలేరు మార్క్, యడ్లూరి ప్రసాద్, కొల్లూరి రాంబాబు, శివాజీ, మండల మహి ళా నాయకురాలు బిందుమాధవి, మండల ప్రచార కార్యదర్శి అనంతలక్ష్మి, శివయ్య, రాజేష్, సాంబయ్య, మీరావలి, భాస్కర్, నాని పాల్గొన్నారు.

వైసీపీ పాలన అంతం

చినగంజాం : వైసీపీ పాలన అంతమై.. టీడీపీ కూటమి ప్రభుత్వ పాలన రాబోతుందని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ సీనియర్ నాయకులు టీ.జయరావులు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సుందరయ్యకాలని, రామకోటేశ్వర, మహాలక్ష్మికాలనీల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ .. భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రా లను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం అజాద్, సందు శ్రీనివాసరావు మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, ఎం.పద్మావతి, చేవూరి రవణమ్మ, గంటా చెన్నయ్య పీ.శ్రీనివాసరావు, సుభాని, మహబూబ్‌ఖాన్, జి.వెంకటనారాయణ, అమీర్జాన్, ఎస్.సూరిబాబు, మహేష్, మురళి పాల్గొన్నారు.



రామకోటేశ్వర కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మలేరియాపై అవగాహన ర్యాలీ

యద్దనపూడి (మార్టూరు), ఏప్రిల్ 25 : మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా గురువారం యద్దనపూడి గ్రామంలో ప్రభుత్వ వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ప్రారంభించిన గ్రామంలోని ప్రధాన సెంటరు వరకు ర్యాలీ చేశారు. ఈ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ పీ శ్రీహర్ష, సీహెచ్‌వో ప్రసాద్ ఎస్‌యూవో శేషగిరిరావు, సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సునందరారాజు, ఎంఎల్ పీహెచ్‌వోలు, ఏఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

చినగంజాం, ఏప్రిల్ 25 : మలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు పీ.సాయిశ్రీచరణ్, కే.కీర్తిసరోజ్, బి.నాగేంద్ర అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా చినగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది గ్రామంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. గ్రామవాసులు తమ ఇళ్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని వైద్యాధికారులు సూచించారు. దోమ కాటు వలన కలిగే వ్యాధుల గురించి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి గ్రామస్థులకు వివరించారు. ర్యాలీలో దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పీ.శ్రీనివాసరావు, హెచ్ఎస్ఆర్ రవి కుమార్, సీహెచ్‌వో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు చిరంజీవి, రాణి, యు.వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందరబాబు, హెల్త్ అసిస్టెంట్ జి.విజయప్రసన్న, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ : మలేరియా జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమీజ్ అహ్మద్ కోరారు. గురువారం పీహెచ్‌సీలో పలు గ్రామాల వైద్య సిబ్బందితో ప్రపంచ మలేరియా దినోత్సం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మలేరియా జ్వరాలపై తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు
- పరీక్ష రాయనున్న 934 మంది విద్యార్థులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25 : పాలిసెట్ 2024 పరీక్ష శనివారం జరగనుందని అద్దంకి కోఆర్డినేటర్ ఏవీ ప్రసాద్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ తాడికొండ శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో 250 మంది, హోలిపెయింగ్ స్కూల్‌లో 334 మంది, కాకానిపాలెం జడ్పీహెచ్ఎస్‌లో 150 మంది, శింగరకొండలోని గురుకుల పాఠశాలలో 200 మంది మొత్తం 934 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. టెన్త్ హాల్ టికెట్ నెంబర్, ఫోన్ నెంబర్‌తో పాలిటెక్నిక్ వెబ్‌సైట్ నుంచి టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందని, విద్యార్థులు పరీక్ష సమయం కన్నా ముందే 9.45 నిమిషాలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. బ్లూ, లేదా బ్లాక్ బాల్ పెన్, పెన్సిల్, ఎరైజర్ చాప్‌నర్, ప్యాడ్ తప్పని సరిగా తెచ్చుకోవాలన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్‌లో ఏదైనా సమస్య తలెత్తితే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. 11 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో అద్దంకి విద్యార్థుల ప్రతిభ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ 2024లో అద్దంకికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలో పీవీవీ కామేశ్వరరావు 99.97 శాతం, ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరీలో ఏఐఆర్ 527వ ర్యాంక్ సాధించినట్లు శ్రీ మమత ఐఐటీ ఫౌండేషన్ యాజమాన్యం గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. వీరితో పాటు మద్దినేని స్నేహ 99.46 శాతం, పి.దేవ మణికంఠ 97.40 శాతం మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు యాజమాన్యం అభినందనలు తెలిపారు. జెఈఈ మెయిన్స్‌లో అద్దంకిలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ విద్యార్థిని వై.కావ్య ఆల్ ఇండియా 243వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

సత్తా చాటిన సోపిరాల విద్యార్థి

చినగంజాం : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన నరహరి రోహిత్ శివశంకర్ జేఈఈ మెయిన్స్-2024 ఫలితాలలో ఈడబ్ల్యూఎస్ విభాగంలో జాతీయ స్థాయిలో 176వ ర్యాంకు సాధించాడు. జాతీయ ర్యాంకు 1519 సాధించినట్లు రోహిత్ గురువారం తెలిపారు. తల్లిదండ్రులు పద్మ, శ్రీహరిరావు, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తన తండ్రి శ్రీహరిరావు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పోటీ పరీక్షల కేంద్రాలలో అర్థ మ్యాథ్స్, వేదిక్ మ్యాథ్స్‌ను బోధిస్తున్నట్లు తెలిపారు. మే26న జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు శిక్షణ పొందుతున్నట్లు రోహిత్ శివశంకర్ తెలిపారు. రోహిత్‌ను కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పలు కార్యక్రమాలలో పాల్గొన్న గొట్టిపాటి



రాజ్యలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 25 : మండలంలోని పలు గ్రామాలలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ గురువారం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. కశ్యాపురంలో టీడీపీ నేత ధూళిపాళ్ల రాజేష్ మాతృమూర్తి రాజ్యలక్ష్మి దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయనవెంట జడ్పీటీ సీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, ధూళిపాళ్ల రామచంద్రప్రసాద్, చల్లగుండ్ల కోటేశ్వరరావు, స్థానిక నేతలు ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

చివరి రోజు 11 దాఖలు

చీరాల, ఏప్రిల్ 25 : ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. చివరి రోజు 11 నామినేషన్లు దాఖలైనట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. రవికుమార్ శీలం (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), షేక్ అబ్దుల్ బషీర్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ), రవీంద్రబాబు పావులూరి (స్వతంత్ర అభ్యర్థి) దేవరపల్లి రంగారావు (స్వతంత్ర అభ్యర్థి) గోచిపాతల రమేష్‌బాబు (స్వతంత్ర), అంబటి పుష్పరాజ్ (స్వతంత్ర), జంజనం కృష్ణ (తెలుగు రాజాధికార సమితి పార్టీ), చెన్నుపల్లి పవన్‌కుమార్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ) వారి నామినేషన్లను ఆర్వోకు అందజేశారు. మద్దులూరి మాలకొండయ్య (తెలుగుదేశం పార్టీ), ఆమంచి (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), ఆమంచి సుజాత (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సబ్స్టిట్యూట్) తరఫున వారి ప్రతినిధులు ఆర్వోకు నామినేషన్లను అందజేశారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 25 : విద్యార్థులు చదువుతో ఉన్నతంగా ఎదుగుతూ, తోటివారికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని సెయింట్ ఆన్స్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, అన్నారు. కళాశాలలో ఎమర్జింగ్ విభాగాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం ఇగ్నిటస్-2కె24 వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు కళాశాల ప్రతినిధులు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కా ర్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నానరు.

వైభవంగా సీతారామ కల్యాణ మహోత్సవం



సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

చినగంజాం, ఏప్రిల్ 25 : మండలంలోని నీలాయపాలెం గ్రామంలోని సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆలయంలో అలయ అర్చకులు గంజాం శ్రీనివాసమూర్తి, గ్రామ పురోహితులు శిష్టాపాండురంగ శాస్త్రి స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి, వేశేష పూజలు, సహస్ర నామార్చన కార్యక్రమాలు జరిపారు. వేదపండితులు ముప్పాళ్ల నరేష్‌చార్యులు, రంగాచార్యులు వేదమంత్రాలతో కల్యాణ క్రతువును నిర్వంహించారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలను అందజేసిన అనంతరం అన్నసంతర్పణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో స్వామి అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు. అనంతరం స్వామి వారికి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్న 60వ అఖండ హరే రామ నామ సంకీర్తన సప్తాహం ముగిసింది. కార్యక్రమంలో ఒంగోలు రాధాకృష్ణ ఆశ్రమ పీఠాధిపతి వేణుమాధవ్, గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంతో ముస్లింలను భయపెడుతున్న వైసీపీ

- ఎన్డీయేలో టీడీపీ ఉన్నా మైనారిటీల రక్షణ బాధ్యత మాదే
- పట్టణవాసుల దాహార్తి తీరుస్తా
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి



ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 25 : ఎన్నికలలో వైసీపీ ఓటమి తప్పదని గ్రహించి, ముస్లింలను మభ్యపెట్టడానికి, భయపెట్టడానికి నానా ప్రయత్నాలు చేస్తోందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి అద్దంకి పట్టణంలోని 19వ వార్డులో గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ ద్వారా ప్రజలకు జరిగే లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడం వల్ల ముస్లింలు, క్రిస్టియన్‌లు నష్టం ఉంటుందని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేతో ఉన్నప్పటికీ మీకు వచ్చిన నష్టమేమీ లేదన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది రాకుండా చంద్రబాబు చూస్తారని భరోసా ఇచ్చారు. గతంలో ఎన్డీయేతో టీడీపీ కలిసి ఉన్నప్పుడు ముస్లింల రక్షణ, సంక్షేమం విషయంలో చంద్రబాబు తీసుకున్న చర్యలను గొట్టిపాటి గుర్తు చేశారు. ఓటమి భయంతోనే వైసీపీ అన్ని వర్గాల ప్రజల్లో భయాలను, లేనిపోని అనుమానాలను రేపుతోందన్నారు. విజ్ఞతతో ఆలోచించి వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఐదేళ్లు ముస్లింలను పట్టించుకోని జగన్‌రెడ్డికి ఇప్పుడు గుర్తుకు రావడం ఆశ్చర్య మేస్తోందన్నారు. ముస్లింలపై దాడులు, దౌర్జన్యాలు, ఆస్తి నష్టాలు చేసిన వైసీపీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. చంద్రబాబునా అధికారంలోకి వస్తే రాజధాని నిర్మాణం జరుగుతుందని, అందరితోపాటు ముస్లింలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, పారిశుధ్య పనులు అంతంత మాత్రంగా ఉన్నాయని, తాగునీటి సమస్య అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి మసీదులో నమాజ్ చేశారు. ముస్లింల నుంచి మంచి స్పందన వచ్చింది. ఎమ్మెల్యే రవికుమార్‌ను పెద్దసంఖ్యలో ముస్లిం లు సాదరంగా ఆహ్వానించారు. కార్య క్రమంలో కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, దామా సురేం ద్ర, దామా హనుమంతరావు, ముస్లిం నేతలు మదీనా, మాబు, మాలిక్, చిట్యాల శ్రీను, ఆ కుల కోటేశ్వరరావు, ఇక్కుర్తి శ్రీను, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు ... బాబీ ఇంటింటి ప్రచారం

బల్లికురవ, ఏప్రిల్ 25 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మెదటి నెల నుంచి వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందిస్తామని యువ నేత గొట్టిపాటి కమల్ కిషోర్ (బాబీ) తెలిపారు. గురువారం మండలంలోని భూషావారిపాలెం, రామాంజనేయపురం గ్రామాలలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలతోపాటు పింఛన్ అందిస్తామన్నారు. ఇప్పటి వరకూ గొట్టిపాటి చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని బాబీ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారాబత్తిన అంజనేయులు, కొండేటి ఇజ్రాయల్, మంగారావు, బాలయ్య, కమతం శ్రీను, కుంచాల వెంకట్రావు, దాసు, అట్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.వంద కొట్టు..1700 పట్టు

- వలపర్లలో ఉపాధి కూలీలకు బంపర్ ఆఫర్
- సిబ్బంది మాయాజాలం

మార్టూరు, ఏప్రిల్ 25 : వందరూపాయలు ఇవ్వండి.. మీఖాతాకు రూ.1700 పడేలా సెట్ చేస్తామంటూ కొందరు సిబ్బంది ఉపాధి కూలీల నుంచి డబ్బులు గుంజుతున్నారు. మండలంలోని వలపర్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. వాస్తవంగా ఈ నెల 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీకి గతంలో రోజుకు రూ.272 ఇవ్వగా రూ.28 పెంచి రూ.300 ఇస్తున్నారు. వారం రోజులు ఎన్ఆర్‌జీఎస్‌పై నిబంధనలు ప్రకారం కూలీలు పని చేస్తే రూ.1800 డబ్బులు కూలీల బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే కూలీలు చేసిన పని ప్రకారం కొలతలను బట్టి వారికి వచ్చే వేతనాన్ని లెక్కిస్తారు. కొంతమంది కూలీలు వారంలో కొన్ని రోజులు పనికి రాకపోయినా.. పనులు తక్కువగా చేసినా వారికి తక్కువ మొత్తం డబ్బులు వారి ఖాతాలో జమ అవుతుంది. దీనిని ఆసరాగా చేసుకున్న సిబ్బంది కూలీలను మాయ చేస్తున్నారు. రూ.100 చొప్పున ఇస్తే మీ ఖాతాలో రూ.1700 జమ అయ్యేలా చూస్తామని చెప్పడంతో చాలా మంది కూలీలు వందేకదా అంటూ సిబ్బందికి డబ్బులు ఇస్తున్నట్లు తెలిసింది. వారిలో పురుషులు, మహిళా కూలీలు కూడా ఉన్నారు. వంద రూపాయలు పోతే పోయాయి తమ ఖాతాలో రూ.1700 జమ చేస్తే అంతే సంతోషమంటూ కూలీలు ఆశ గా ఎదురు చూస్తున్నారు. ఇదిలావుండగా ఇటీవల ఈ గ్రామంలోని ఫీల్డు అసిస్టెంట్ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా కోడ్ ఉల్లంఘించినందులకు అతడిని విధుల నుంచి తొలగించారు. తాజాగా కూలీల నుంచి డబ్బులు వసూలు చేయడంపై ఉన్నతాధికారులు ఏమేరకు స్పందిస్తారో చూడాలి.

సచివాలయ నిర్మాణంలో డొల్ల

విరిగిన భీమ్‌లు..కప్పిపుచ్చేయత్నం చేసిన కాంట్రాక్టర్





నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం పడిపోయిన భీమ్‌లు

అద్దంకి, ఏప్రిల్ 25 : పది కాలాల పాటు పటిష్ఠంగా ఉండాల్సిన ప్రభుత్వ భవనాలు నిర్మాణ దశలోనే కూలుతుండడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సచివాలయ భవనాల నిర్మాణ పనులను పరిశీలిస్తే డొల్లతనం బయటపడుతోంది. అద్దంకి మండలంలోని చక్రాయపాలెంలో రూ.40లక్షల వ్యయంతో సచివాలయం భవన నిర్మాణం జరుగుతోంది. ఇంకా పనులు పూర్తి కాక ముందే కిటికీలపై పోసిన భీమ్ (బల్లలు) పడిపోయాయి. మరి కొన్ని కూడా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పడిపోయిన భీమ్‌ల ఆనవాళ్లు లేకుండా చేసేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వస్తున్నారు. గ్రామ వైసీపీ నేతలే కాంట్రాక్టర్‌లు గా మారి నిర్మాణ పనులు చేస్తుండడంతో నాణ్యత లోపించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ దశలోనే కూలుతుండడంతో భవన నిర్మాణం పూర్తయినా ఎక్కువ సంవత్సరాలు ఉండదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఖాజాసింగ్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చినగంజాం, ఏప్రిల్ 25 : మండలంలోని రాజుబంగారుపాలెం, చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల పరిశీలకులు ఖాజాసింగ్ గురువారం పరిశీలించారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నమూనా పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా ఎందుకు పెట్టవలసి వచ్చిందని ఎన్నికల పరిశీలకులు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావుని ప్రశ్నించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కేంద్రాల వద్ద చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ఆయన పలు సూచనలు సూచించారు. కార్యక్రమంలో బూత్‌లెవల్ అధికారులు బండారు దానియేలు, భాష, మునీర్, ఆమంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

21మంది.. 36 నామినేషన్‌లు

అద్దంకి, ఏప్రిల్ 25 : అద్దంకి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా 21 మంది 36 సెట్‌ల నామినేషన్‌లు దాఖలు చేశారు. నామినేషన్‌ల ఘట్టం గురువారంతో ముగిసింది. టీడీపీ అభ్యర్థులుగా గొట్టిపాటి రవికుమార్ 4 సెట్‌లు, గొట్టిపాటి ఝాన్సీ 2 సెట్‌ల నామినేషన్ వేశారు. వైసీపీ తరపున పాణెం చినహనిమిరెడ్డి 4 సెట్‌లు, ఆదిలక్ష్మి 2 సెట్‌లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున అడుసుమల్లి కిషోర్‌బాబు 2, అడుసుమల్లి పార్వతి సెట్ నామినేషన్ వేశారు. అట్లా చినవెంకటరెడ్డి ఇండిపెండెంట్‌గా, బాచిన రాంబాబు జాతీయ సమసమాజం పార్టీ తరపున, ఇండిపెండెంట్‌లుగా గోగులమూడి షీరాసాగర్, గొల్లపాటి వెంకటాచారి 2, మందా శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసులు, పుపాటి యేసోబు, జాతీయ జనసేన పార్టీ తరపున గొట్టిపాటి ప్రేమ్‌కుమార్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున గుమ్మా సదాశివరావు, నవోదయం పార్టీ తరపున గుంటుపల్లి గోపి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున కందుల యాకోబ్, బహుజన సమాజ్‌పార్టీ తరపున మందా జోసెఫ్ మూడు, భారత చైతన్య యువజన పార్టీ తరపున మీసాల సామ్రాజ్యం 2, జై భీమ్‌రావ్ భారత్ తరపున పులిపాటి హేబేలు 2 సెట్‌లు, రాష్ట్రీయ జన క్రాంతి పార్టీ తరపున సురభి ప్రభుదాస్ నామినేషన్‌లను దాఖలు చేసినట్లు అద్దంకి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుసీల్ తెలిపారు.

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

బల్లికురవ, ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దార్ సుభద్ర కోరారు. గురువారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల విధులకు కేటాయించిన 165 మంది ఓపీవోలకు శిక్షణ జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సిబ్బంది సహకరించాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలిగించకుండా ఎవరికి కేటాయించిన డ్యూటీ వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎక్కడైన సిబ్బంది అత్యుత్సాహం చూసి ఎన్నికల విధులకు అటంకం కలిగితే వారిపై చర్యలు తప్పవు అని హెచ్చరించారు. అనంతరం శిక్షకులు ఓటర్లు ఓటు వేశాక వారి చేతికి ఎలా గుర్తు పెట్టాలి అని వారికి చూపించారు. ఈ శిక్షణలో ఎంఈవో రమేష్, శిక్షణ సిబ్బంది పి. రామాంజనేయులు, ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది ప్రకాసరావు, నాగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

176 మద్యం బాటిళ్లు స్వాధీనం

● మద్యం షాపు సూపర్‌వైజర్ నుంచి కొనుగోలు

అద్దంకి, ఏప్రిల్ 25 : ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 176 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు గురువారం అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో ఓ బెల్ట్ షాపులో ఒంగోలు విజిలెన్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రవి, అద్దంకి ఎస్ఈబీ ఎస్ఐ సైమన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి ఓ మహిళను అదుపులోకి తీసుకొన్నారు. ఆమె వద్ద నుంచి 176 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక దర్శి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్ వేణుగోపాల్‌రెడ్డి వద్ద బెల్ట్ షాపు నిర్వాహకురాలు మద్యం కొనుగోలు చేసినట్లు విచారణలో తేలినట్లు ఎస్ఐ సైమన్ తెలిపారు. ఇప్పటికే పలుమార్లు అదే బెల్ట్‌షాపులో మద్యం పట్టుబడగా, తాజాగా 176 బాటిళ్లు దొరికాయి. దీంతో బెల్ట్ షాపులలో నిత్యం పెద్ద సంఖ్యలో మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తేటతెల్లం అయింది.



తెలుగుదేశం కూటమి అభ్యర్థి తరుపున నామినేషన్ దాఖలు చేస్తున్న నాయకులు

ముగిసిన నామినేషన్ల పర్వం

● చివరి రోజు 14 దాఖలు

పర్చూరు, ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన నామినేషన్‌ల పర్వం గురువారంతో ముగిసింది. చివరి రోజు ఆయా ప్రధాన పార్టీలతోపాటు, స్వతంత్ర అభ్యర్థులు 14 నామినేషన్‌లు దాఖలు చేశారు. అందులో తెలుగుదేశం, వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు, పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్‌లను దాఖలు చేశారు. ముగింపు రోజు అత్యధికంగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్‌లను ఆర్వో గంధం రవీందర్‌కు అందజేశారు.

మనస్తాపంతో విలేజ్ సర్వేయర్ ఆత్మహత్యాయత్నం!

విజయనగర్‌కాలనీ (చీరాలటౌన్), ఏప్రిల్ 25 : ప్రియుడు నమ్మించి మోసగించాడని విలేజ్ సర్వేయర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చీరాల మండల పరిధిలోని విజయన్‌గర్ కాలనీలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకు చెందిన సోమరౌతు ఝాన్సీ మండల పరిధిలోని తోటవారిపాలెం 1 విలేజ్ సర్వేయర్‌గా పనిచేస్తుంది. ఈక్రమంలో ఈమెకు ఫేస్‌బుక్ ద్వారా పేరాలకు చెందిన పసుపులేటి సాయి పరిచయమయ్యాడు. ఈయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈనేపథ్యంలో వీరి పరిచయం ప్రేమగా మారింది. చాలాకాలంగా రెండు కుటుంబాల మధ్య రాకపోకలు జరుగుతున్నాయి. ఝాన్సీ వద్ద కొంత నగదు కూడా సాయి తీసుకున్నాడు. అయితే ఈ మధ్యకాలంలో ఝాన్సీ కుటుంబ సభ్యులు సాయి, అతని కుటుంబ సభ్యుల వద్ద పెళ్లి ప్రస్తావన తెచ్చారు. ఏమాత్రం ఇష్టంలేని సాయి అతని కుటుంబ సభ్యులు సమయాన్ని దాటేస్తూ వచ్చారు. మోసపోయిన విషయాన్ని గ్రహించిన ఝాన్సీ పెద్దలను ఆశ్రయించింది. అయినా కూడా సాయి ఫోన్ ఆఫ్ చేసుకుని కనిపించకుండా తిరుగుతుండడంతో మనస్తాపం చెందిన ఝాన్సీ ఇంట్లో పెట్రోల్, బాత్రూమ్ క్లీనర్ కలుపుకుని తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

బీఎన్, కందుల నామినేషన్లకు పోటెత్తిన జనం

చీమకుర్తి, మార్కాపురం పసుపుమయం

రెండు చోట్లా భారీ ర్యాలీలు

మండుటెండలోనూ ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

ముగిసిన నామినేషన్‌ల దాఖలు

నేడు పరిశీలన

చివరి రోజు అదుర్స్



జిల్లాలోని చీమకుర్తి, మార్కాపురం పసుపుమయమయ్యాయి. టీడీపీ అభ్యర్థులు బీఎన్ విజయ్‌కుమార్, కందుల నారాయణరెడ్డి నామినేషన్‌ల సందర్భంగా రెండు పట్టణాలూ గురువారం జన జాతరలా మారాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలు అదుర్స్ అనిపించాయి. తెలుగు తమ్ముళ్లతోపాటు పార్టీ అభిమానులు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. చీమకుర్తిలో బీఎన్‌కు, మార్కాపురంలో కందులకు అడుగడుగునా హారతులు ఇచ్చా రు. వారిపై పూలవర్షం కురిపించారు. ఎండ, వేడిగాలుల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ వేలాది మంది ర్యాలీల్లో ఉత్సాహంగా పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు.



చీమకుర్తిలో జనకెరటంలా సాగుతున్న ర్యాలీ (ఇన్‌సెట్‌లో) అభివాదం చేస్తున్న బీఎన్, టీడీపీ నాయకులు

ఒంగోలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు గురువారంతో ముగిసింది. చివరిరోజు కూడా ఒంగోలు పార్లమెంట్‌తోపాటు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు భారీగానే దాఖలయ్యాయి. ఇప్పటికే నామినేషన్లు వేసిన పలువురు మరికొన్ని సెట్లను చివరి రోజున తిరిగి సమర్పించారు. స్వతంత్రులు, చిన్నచిన్న పార్టీల అభ్యర్థులు పెద్దసంఖ్యలో వేశారు. శుక్రవారం అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్‌లను పరిశీలించనున్నారు. ఇదిలా ఉండగా నామినేషన్‌ల దాఖలు కార్యక్రమంలో ప్రత్యర్థి వైసీపీ కంటే పూర్తి అధిపత్యం ప్రదర్శించిన టీడీపీ అభ్యర్థులు చివరి రోజైన గురువారం కూడా అదే జోరు కొనసాగించారు. టీడీపీ సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్‌విజయ్‌కుమార్, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డిల నామినేషన్‌ల సందర్భంగా చీమకుర్తి, మార్కాపురంలలో ఆపార్టీ శ్రేణులు భారీ ర్యాలీలు నిర్వహించాయి. రెండు పట్టణాలు పసుపుమయమయ్యాయి. వేలాదిగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లతోపాటు జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ ర్యాలీల్లో పాల్గొని మద్దతు తెలిపారు.





మార్కాపురంలో ర్యాలీకి హాజరైన అశేష జనం (ఇన్‌సెట్లో)మార్కాపురం ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారాయణరెడ్డి, రాఘవరెడ్డి

సంతనూతలపాడులో జనకెరటం

సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయ్‌కువార్ ఉదయం పలు దేవాలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఒంగోలు మర్రిచెట్టు కాలనీలోని తన నివాసం నుంచి 10 గంటల సమయంలో చీమకుర్తికి బయల్దేరారు. అప్పటికే పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు అక్కడికి చేరుకొని ఆయన్ను అనుసరించారు. సంతనూతలపాడు నియోజకవర్గం ప్రారంభమయ్యే నగర పరిధిలోని సమతానగర్ వద్ద టీడీపీ, జనసేన యువకులు పెద్దఎత్తున స్వాగతం పలికి అక్కడి నుంచి వారు ముందు భాగాన బైక్ ర్యాలీ నిర్వహించారు. సంతనూతలపాడు సమీపంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీ క్రేన్‌లతో బీఎన్ విజయ్‌కుమార్, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టీ.కృష్ణప్రసాద్, జనసేన నేత కందుకూరి బాబులకు గజమాలలు వేశారు. సంతనూతలపాడు దాటాక మైనంపాడు కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటల సమయంలో బీఎన్ బృందం చీమకుర్తి హరిహరిక్షేత్రం వద్దకు చేరుకోగా వేలాది మంది పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతించారు. ఉదయం 10 గంటలకే నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు అక్కడికి తరలివచ్చారు. పట్టణంలో దాదాపు రెండు గంటల పాటు ర్యాలీ సాగింది. మేళతాళాలు, కార్యకర్తల కేరింతలు, మహిళల నినాదాలతో చీమకుర్తి హోరెత్తిపోయింది. సుదూర ప్రాంత గ్రామాల నుంచి వచ్చిన వారు సైతం ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చీమకుర్తిలోని పలు చోట్ల గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.

మార్కాపురంలో మిన్నంటిన అభిమానం

మార్కాపురంలోనూ పెద్దఎత్తున టీడీపీ ర్యాలీ కొనసాగింది. అక్కడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, ఎంపీ మాగుంట తనయుడు రాఘవ రెడ్డి, ఇతర నేతలు ప్రత్యేక వాహనంపై కందుల ఇంటి నుంచి ర్యాలీగా బయల్దేరారు. సప్తగిరి లాడ్జి, పాత బస్టాండు, చెన్నకేశవ స్వామి ఆలయం, కంభం బజారుల మీదుగా కంభం బస్టాండు వరకూ ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతోపాటు మార్కా పురం పట్టణంలోని వివిధ వార్డుల నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. కిలో మీటరు దూరం ర్యాలీ రావడానికి సుమారు రెండు గంటలు పట్టింది. ఆ రెండు పట్టణాల్లోనూ అభ్యర్థులు, పార్టీ నేతలు ఊహించిన దాని కన్నా అధికంగా శ్రేణులు తరలిరావడమే కాక ఎండలో సైతం ఉత్సాహంగా పాల్గొనడంతో పార్టీ నేతల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఇప్పటికే జిల్లాలో మిగిలిన ఐదు నియోజకవర్గాల్లోనూ ఇలాగే టీడీపీ అభ్యర్థులు చేపట్టిన ర్యాలీలు విజయవంతమ య్యాయి. ఆయా ప్రాంతాలలో జనసేన, బీజేపీ నుంచి సంపూర్ణ మద్దతు లభించడంపై టీడీపీ నేతల్లో మరింత జోష్ కనిపిస్తోంది.

భారీగా నామినేషన్లు

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈనెల 18వతేదీ నుంచి 25వతేదీ వరకు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ... మంది అభ్యర్థులు....సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 31 మంది అభ్యర్థులు 44 నామినేషన్లు, దర్శికి 22 మంది అభ్యర్థులు 43, సంతనూతలపాడుకు 17 మంది అభ్యర్థులు 35, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి 27 మంది 39 నామినేషన్లు దాఖలు చేశారు. యర్రగొండపాలెం కు 23 మంది 43 నామినేషన్లు, గిద్దలూరుకు 31 మంది 42, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి 36 మంది అభ్యర్థులు 61 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొండపి నియోజకవర్గానికి ...అభ్యర్థులు..... నామినేషన్లు దాఖలు చేశారు.

టీడీపీలో నామినేషన్‌ల జోష్

తొమ్మిది చోట్ల అధికంగా హాజరు

మూడు చోట్ల పోటాపోటీ ● పోటెత్తిన తూర్పుప్రాంతం

● పశ్చిమంలో ఊరూవాడా కదలింది

● వైసీపీ కార్యక్రమాలు వెలవెల

● బిత్తరపోయి వైపాలెంలో

రెచ్చిపోయిన వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నామినేషన్ల కార్యక్రమం దిగ్విజయం కావడంతో టీడీపీలో జోష్ పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోనూ ఆపార్టీ అభ్యర్థుల అంచనాలకు మించి కార్యక్రమాలకు కూటమి శ్రేణులు, ప్రజానీకం తరలివచ్చారు. పశ్చిమ ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలు దిగ్విజయం కావడంతో వైసీపీ నేతల్లో అంతర్మథనం ప్రారంభమైంది. జిల్లాలోని తూర్పుప్రాంత నియోజకవర్గాల్లో అయితే టీడీపీ నామినేషన్లకు జనం పోటెత్తారు. అధికార వైసీపీకి బలమైనదిగా భావిస్తున్న పశ్చిమ ప్రాంతంలో అన్నిచోట్లా టీడీపీ కార్యక్రమాలకే ప్రజలు ఎక్కువగా వచ్చారు. గిద్దలూరులో వైసీపీ అభ్యర్థి ముందుగా నామినేషన్ వేయగా, కార్యక్రమానికి ఐదు నుంచి ఆరు వేలమంది మాత్రమే హాజరయ్యారు. టీడీపీ కూటమి అభ్యర్థి బుధవారం నామినేషన్ వేయగా నికరంగా 30 వేల మంది హాజరయ్యారు. మార్కా పురంలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమాని కన్నా టీడీపీ కూటమి అభ్యర్థి నారాయణరెడ్డి నామినేషన్‌కు మూడింతలు జనం అధికంగా హాజరయ్యారు. ర్యాలీ అనంతరం సభ వద్దే 17వేల మందిపైనే నిల్చొని నారాయణరెడ్డి ప్రసంగాన్ని విన్నట్లు అంచనా. వైపాలెంలో కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు నామినేషన్‌కు జనం పోటెత్తారు. దీంతో వైసీపీ నేతలు భారీ ప్రలోభాలతో జనస మీకరణకు ప్రయత్నం చేశారు. మాజీ మంత్రి బాలినేనితో సహా ముఖ్య నేత లను పిలిపించారు. ప్రజలను భారీగా తరలించినప్పటికీ టీడీపీ సభస్థా యిలో జరగలేదు. దీంతో బిత్తరపోయిన ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి ఎన్నికల అధికారిపై దురుసుగా వ్యవహరించి విమర్శలకు గురయ్యా రు. చెవిరెడ్డి దూకుడు వ్యవహారశైలితో యావత్తు అధికారులు బిత్తరపోయారు. ఆయనపై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు కూడా చేశారు.

ఒంగోలులో తండోపతండాలుగా..

ఒంగోలులో వైసీపీ నామినేషన్‌కు వచ్చిన ప్రజలు మధ్యలోనే వెళ్లిపోయి సభా కార్యక్రమ నిర్వహణే విఫలమైంది. టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు ప్రజలు విపరీతంగా వచ్చారు. ఎస్ఎన్‌పాడులో గురువారం విజయ్‌కుమార్ నామినేషన్‌కు జనం పోటెత్తారు. మంత్రి నాగార్జున నామినేషన్ కార్యక్రమం వెలవెలబోయింది. కొండపిలో టీడీపీ కూటమి అభ్యర్థి స్వామి నామినేషన్‌కు జనం భారీగా హాజరయ్యారు. అలాగే నామినేషన్‌కు వచ్చిన జనం మధ్యలోనే వెళ్లిపోవడంతో మంత్రి సురేష్ సభను ముగించారు. అద్దంకి, పర్చూరులో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలు వెలవెలబోయాయి. అదే సమయంలో టీడీపీ అభ్యర్థులు రవికుమార్, సాంబశివ రావు నామినేషన్ల కార్యక్రమానికి ఒక్కోచోట 30వేలమంది హాజరయ్యారు. ప్రజ లు స్వచ్ఛందంగా తరలివచ్చారు. చీరాలలో ముందురోజు నామినేషన్ వేసిన కరణం వెంకటేష్ కార్యక్రమానికి ప్రజలు బాగానే హాజరైనా చివర వరకూ నిలవలేదు. గురువారం టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య నామినేషన్‌లో ఆరంభం నుంచి చివరి వరకూ జనం హోరెత్తడం అందులో ఎస్సీ, బీసీలు అధికంగా ఉన్నారు. కందుకూరులో మంగళవారం టీడీపీ అభ్యర్థి నాగేశ్వర రావు నామినేషన్ విజయవంతమైంది.

కనిగిరిలో తేలిపోయిన వైసీపీ ర్యాలీ

కనిగిరిలో టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్ర నామినేషన్‌కు తండోపతండాలుగా వచ్చిన ప్రజలను చూసి వైసీపీ నేతలు జనసమీకరణకు భారీగా డబ్బు, మద్యం ఇచ్చారు. ప్రత్యేకించి గురువారం ఉపాధి కల్పన పనులన్నీ ఆపేసి ఆ కూలీ లందర్నీ కార్యక్రమానికి బలవం తంగా రప్పించారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు ప్రలోభాలు ఆశచూపి కార్యక్రమానికి తీసుకొచ్చారు. అయి నా ర్యాలీ వెలవెలబోయింది. దర్శి లో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి నామినేషన్‌కు ఆటంకాలు కల్పించేందుకు వైసీపీ నేతలు విశ్వప్రయత్నాలు చేశారు. టీడీపీ వారికి మద్యం సరఫరా చేస్తున్నా రన్న అనుమానంతో దర్శిలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌ను హడా వుడిగా సీజ్ చేశారు. ప్రైవేట్ సం స్థల వాహనాలను కూడా ఇవ్వకుండా అడ్డుకున్నారు. అయినా ప్రజలు టీడీపీ కార్యక్రమానికి భారీగా హాజరయ్యారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

నేతాజీనగర్, రామ్‌నగర్‌లలో ఎన్నికల ప్రచారం

ఏలూరికి అడుగడుగునా నీరాజనం

మార్టూరు, ఏప్రిల్ 25 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. గురువారం మార్టూరులో నేతాజీనగర్, రామ్‌నగర్‌లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మార్టూరు గ్రామంలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిన పార్టీ నాయకులతో కలిసి ఏలూరి పాదయాత్ర చేస్తూ కాలనీల్లో పర్యటించారు. మొదట తూర్పు బజారున పార్టీ నాయకుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. అనంతరం తొట్టెంపూడి దేవర వద్ద కొబ్బరి కాయను కొట్టారు. తరువాత గన్నవరం రోడ్డు గుండా శివాలయం వద్దకు చేరారు. అక్కడ నుంచి దారిపొడవునా, ఇళ్లల్లోని మహిళలను పలకరిస్తూ మేనిఫెస్టో కరపత్రాలను అందిస్తూ ప్రచారం సాగించారు. ఆయవెంట నాయకులు, కార్యకర్తలతోపాటు మహిళలు అడుగడుగునా నీరజనాలు పలికారు. నేతాజీ నగర్ నాయకులు అద్దేటి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ గజమాలను వేసి ఏలూరికి స్వాగతం పలికారు. రామ్‌నగర్, నేతాజీనగర్‌లోని అన్ని వీధుల్లోనూ ఏలూరి పర్యటించారు. మహిళలు ఎదురెళ్లి హారతులిచ్చి స్వాగతం పలికారు.



శివాలయం వద్ద ఏలూరిని గజమాలతో సత్కరించిన అనిల్

సైకిలు గుర్తుకు ఓటేయండి

ఇంటింట ప్రచారంలో ఏలూరి సైకిల్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. బీసీలు, ఎస్సీలకు అండగా ఉండేది టీడీపీ అన్నారు. ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగడం వెనుక చంద్రబాబు కృషి ఉందన్నారు. మహిళ శ్రేయస్సు, ఆర్థిక వెసులుబాటు కోసం ఏడాది మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. జగన్‌రెడ్డి చేతగాని పాలనతో నాశనమైన రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్ కోసం టీడీపీ కూటమికి ప్రజలంతా మద్దతు పలకాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గొట్టిపాటి వెంకట్రావు, మందపాటి అంజయ్య, రాంబాబు, తాటి నాగేశ్వరావు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, సకల ఆంజనేయులు, తగెడ్ల ఆంజనేయులు, పోలూరి సింగయ్య, కాకోలు వెంకటేశ్వర్లు, తెలుగు మహిళలు ఉప్పుటూరి రమాదేవి, శేషమ్మ, రాధ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని గద్దె దించే శక్తి మహిళలదే

● రవికుమార్ సతీమణి ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 25 : రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న జగన్‌రెడ్డిని గద్దె దించే శక్తి మహిళలకే ఉందని గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామం లో గురువారం రాత్రి గొట్టిపాటి ఝాన్సీ మహిళలతో కలసి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రయోజనాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 13న జరుగనున్న ఎన్నికలలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించి నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన గొట్టిపాటి రవికుమార్, కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు గ్రామంలో గురువారం రాత్రి గొట్టిపాటి హర్షవర్ధన్ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లు అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేసిన జగన్‌రెడ్డికి బుద్ధిచెప్పే సమయం మీ చేతికి వచ్చిందన్నారు. సైకిల్‌కు ఓటేసి వైసీపీని సాగనంపండి అని హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైటమంజులూరు గ్రామంలో మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి ఝాన్సీ

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో అద్దంకి విద్యార్థినికి ద్వితీయ స్థానం



మౌనికాచౌదరి

అద్దంకి, ఏప్రిల్ 25 : తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో అద్దంకి మండలం తిమ్మాయపాలెంకు చెందిన విద్యార్థిని పరిటాల మౌనికాచౌదరి ద్వితీయ స్థానం పొందింది. తిమ్మాయపాలెంకు చెందిన టీడీపీ నేత పరిటాల శ్రీనివాసరావు, అరుణ దంపతుల కుమార్తె మౌనిక ఎంపీసీలో 470కి గాను 467 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించింది. 10వ తరగతి వరకు అద్దంకిలోని శ్రీ చైతన్య స్కూల్‌లో చదివింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ద్వితీయ స్థానం పొందిన మౌనికను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పంగులూరు, ఏప్రిల్ 25 : అతి వేగంతో వాహనం నడుపుతూ పాదచారులను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుందని ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. ఎస్ఐ తిరుపతిరావు అందించిన సమాచారం మేరకు మండలంలోని కొండమంజులూరు రెవెన్యూ పరిధిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఒంగోలు డెయిరీ ఎదురుగా ముప్పవరం యువకుడు కోండ్రు జోసఫ్ కిషోర్‌తో పాటు గద్దల చందు, ముండ్లమూరు గ్రామనికి చెందిన గోపనబోయిన వెంకట ప్రవీణ్ నడిచి వెలుతున్నారు. అదే రహదారిపై పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండరాయునిపాలెం గ్రామానికి చెందిన షేక్ ఖాశీం తన ఆటోను అతి వేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ పాదచారులను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన ముగ్గురినీ మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కోండ్రు జోసఫ్ కిషోర్ (22) మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.


అక్రమంగా డ్రా చేసిన నగదును తిరిగి చెల్లించాలి

పామూరు, ఏప్రిల్ 25: మండలంలోని మోపాడు రిజర్వాయర్‌కు సంబం ధించిన నగదును నీటి వినియోగదారుల సంఘం చైర్మన్ జక్కు శ్రీనివాసరెడ్డి బ్యాంకు నుంచి డ్రా చేసుకొన్న సంఘటనపై నీటిపారుదలశాఖ డీఈ రవి నోటీస్ జారీ చేశారు. మోపాడు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న జక్కు శ్రీనివాసరెడ్డి అకౌంట్ నెంబరు 0196100 11002047, కంభాలదిన్నె యూనియ న్ బ్యాంక్ నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలియకుండా రూ.2.64 లక్షల డ్రా చేసినట్లు విచారణలో తేలిందని దీంతో ఆడబ్బు తిరిగి చెల్లించాలని నోటీస్ జారీ చేసినట్లు చెప్పారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

1



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

8 వేలల్లో 80 శాతం !

- జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థుల సత్తా

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఏప్రిల్ 6 నుంచి 15వతేదీ వరకు పరీక్షలు జరిగాయి. జిల్లాలో 8వేల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకాగా వారిలో 80శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. పలు విభాగాల్లో ర్యాంకులను సొంతం చేసుకున్నారు.

27 నుంచి అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులు...

జేఈఈ మెయిన్స్‌లో కటాఫ్ మార్కులు సాధించిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు వీలు కలుగుతుంది. ఆ పరీక్షకు ఈ నెల 27 నుంచి మే 7వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 17 నుంచి 26వరకు అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి. మే 26వతేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. జూన్ 9న ఫలితాలు వెల్లడిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

కాకివాయి విద్యార్థినికి 789వ ర్యాంకు



మాదాల రీతికచౌదరి

చేజర్ల : జేఈఈ మెయిన్స్‌లో చేజర్ల మండలం కాకివాయికి చెందిన మాదాల రీతిక చౌదరి 789వ ర్యాంకు (99.95 శాతం) సాధించింది. ప్రభుత్వ ఉపాధ్యాయులైన మాదాల రవి, తనూజల కుమార్తె రీతిక చౌదరి ప్రాథమిక విద్యాభ్యాసం బిల్లుపాడు ప్రభుత్వ పాఠశాలలో సాగింది. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం పట్ల ఉపాధ్యాయలు, గ్రామస్థులు రీతికను అభినందించారు.

- **కూలీ బిడ్డకు 1,423వ ర్యాంకు**



పూజిత

వలేటివారిపాలెం : తండ్రి చనిపోయాడు. తల్లి రెక్కలు ముక్కలు చేసుకుని బిడ్డను చదివించింది. ఆమె ఆశయాలకు అనుగుణంగా ఆ కుమార్తెకూడా చదువులో రాణించి జేఈఈ మెయిన్స్‌లో 1,423వ ర్యాంకు సాధించింది. మండల కేంద్రమైన వలేటివారిపాలెంకు చెందిన కండ్లగుంట పూజితకు మూగ, చెముడు. తండ్రి చనిపోవడంతో పూజిత తల్లి కూలి పనులు చేసి కుమార్తెను చదివించింది. 10వ తరగతి వరకు వలేటివారిపాలెం హైస్కూల్లో చదివిన పూజిత ఇంటర్మీడియట్ ఒంగోలులో పూర్తి చేసి జేఈఈ మెయిన్స్‌లో 1,423వ ర్యాంకు సాధించింది. ప్రతిభకు వైకల్యం, పేదరికం అడ్డురాదని పూజిత నిరూపించింది. అత్యుత్తమ ర్యాంకు సాధించిన పూజితను కుటుంబసభ్యులతోపాటు గ్రామస్థులు, టీచర్లు అభినందించారు.

రేపే పాలీసెట్

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు • హాజరు కానున్న 3,908 మంది

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : పాలీసెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీ. విజయ్‌కుమార్ తెలిపారు.గురువారం కళాశాలలో ఆయన చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నెల్లూరు డివిజన్‌లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, వీఆర్ పీజీ కళాశాల, అల్‌హుదా పాలిటెక్నిక్ కళాశాల, డాక్టర్ ఎస్ఆర్‌కే పాఠశాల, జగన్స్ డిగ్రీ కళాశాలల్లోనూ, ఆత్మకూరు డివిజన్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ, కావలి డివిజన్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయా కళాశాలలోనూ శనివారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందుగానే అనుమతిస్తామన్నారు. నెల్లూరులో జరిగే పరీక్షకు 2,559 మంది, ఆత్మకూరులో 476, కావలిలో 873 మంది కలిపి మొత్తం 3,908 మంది పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కేంద్రాలన్నింటి వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలన్నీ నోఫోన్‌జోన్‌గా ప్రకటించామని, పరీక్ష నిర్వహణ సమయంలో ఎవరూ కూడా సెల్‌ఫోన్‌లు వినియోగించరాదన్నారు. ఫోన్ వినియోగం తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో ఆధారిత ధ్రువపత్రంతో హాజరు కావాలన్నారు. పాలీసెట్‌కు సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి, గూడూరు పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌వోడీ భవానిశంకర్‌లను పరిశీలకులుగా నియమించినట్లు ఆయన తెలిపారు.

మద్యం డంప్‌ల సూత్రధారి కాకాణి

- ముందు ఆయన్ను అరెస్టు చేయాలి • డీపీవో వేదికగా ఫోన్ల ట్రాకింగ్
- టీడీపీ సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి



కాకాణిపై నమోదైన కేసుల చార్జ్‌షీట్‌లను చూపుతున్న సోమిరెడ్డి

నెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలో పట్టుకుంటున్న భారీ మద్యం డంప్‌ల వెనుక అసలు సూత్రధారి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని, ముందు ఆయనపై కేసు పెట్టి అరెస్టు చేయాలని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పంటపాలెంలో సుధాకర్‌రెడ్డి ఇంట్లో 4,232 బాటిళ్లు, విరువూరులో రాజగోపాల్ రెడ్డి మిల్లులో 2069 బాటిళ్ల మద్యం డంప్‌లను అధికారులు పట్టుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం 1.44 లక్షల మద్యం సీసాలను డంప్ చేసినట్లు తెలుస్తోంది. ఇదంతా కాకాణి సరఫరా చేసిన మద్యం. కాబట్టి అంతిమ లబ్ధిదారుడైన గోవర్ధన్‌రెడ్డిపై అధికారులు కేసు నమోదు చేయాలి. 2014 ఎన్నికల సమయంలోనూ ఇదేవిధంగా వైసీపీ నేతల ఇళ్లల్లో మద్యాన్ని పట్టుకున్నారు. నాడు అధికారులు విచారణ జరిపి హానికరమైన మద్యాన్ని ప్రజలకు పంచేందుకు కుట్ర చేసిన కాకాణిపై కేసులు పెట్టారు. మరి ఇప్పుడు కలెక్టర్, ఎస్పీలు ఎందుకు పట్టించుకోవడం లేదు..?' అంటూ సోమిరెడ్డి ప్రశ్నించారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ స్పందించకపోతే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కాగా జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా ప్రతిపక్ష పార్టీల నేతల ఫోన్లు ట్రాక్ చేస్తున్నారని సోమిరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సర్వేపల్లిలో ఏడేళ్లు పనిచేసిన ఎస్ఐ శివకృష్ణారెడ్డిని కాకాణి స్పెషల్ బ్రాంచ్‌లో పోస్టింగ్ వేయించుకున్నారని, ఆ ఎస్సై తమతోపాటు తమ అనుచరుల ఫోన్లు ట్రాక్ చేస్తూ ఆ సమాచారాన్ని కాకాణికి చేరవేస్తున్నారని ఆరోపించారు. కాకాణి ఓఎస్డీగా వ్యవహరిస్తున్న ఎంపీడీవో సరళ అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని మానిటరింగ్ చేస్తూ కాకాణి కోసం చాలా కష్టపడుతోందని ఆరోపించారు.



- క్వార్ట్జ్ తవ్వకాలపై నిగ్గు
- మైనింగ్ అధికారుల విచారణలో వెల్లడి
- వైసీపీ నేతలకు షోకాజు నోటీసుల జారీ
- కేంద్రానికి నివేదిక ఇవ్వకుండా జాప్యం
- రిపోర్టు మార్చేందుకు మరోసారి విచారణ ?
- ప్రభుత్వ, అటవీ భూముల్లో తవ్వకాలు
- సూత్రధారులను కాపాడే యత్నాలు


కొల్లగొట్టింది.. వైసీపీ వారే!

నెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలం మరుపూరులో అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు జరిపినందుకు మంత్రి కాకాణి ప్రధాన అనుచరుడు మోపూరు శ్రీనివాసులురెడ్డికి రూ.36.41 లక్షల పెనాల్టీతో మైనింగ్ అధికారులు షోకాజు నోటీసు జారీ చేశారు. మొగళ్లూరులో తవ్వకాలు జరిపినందుకు కొత్తలూరు కోటేశ్వరరావు, త్రిప్పిరిశెట్టి రత్నంలకు రూ.25.39 లక్షలు, మొగళ్లూరులోనే మరో చోట అక్రమంగా తవ్వకాలు జరిపినందుకు యనమాల శ్రీనివాసులురెడ్డి, పేర్నాటి దినేష్‌రెడ్డిలకు రూ.1.40 కోట్లు, గురవాయ పాలెంలో తవ్వకాలు చేసినందుకు వర్దినేని కొండయ్యకు రూ.4.99 లక్షలు, కుంకు అన్నపూర్ణకు రూ.13.32 లక్షలు పెనాల్టీ విధిస్తూ షోకాజు నోటీసులు జారీ అయ్యాయి. వీరంతా వైసీపీ నాయకులు, కాకాణి అనుచరులు. అలాగే సైదాపురం మండలంలో కూడా మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అనుచరులకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. దీంతో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు నిజమేనని, ఆ దొంగలు కూడా వైసీపీ నేతలేనని తేటతెల్లమైంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పొదలకూరు, సైదాపురం, గూడూరు రూరల్, రాపూరు మండలాల పరిధిలో పదుల సంఖ్యలో వైసీపీ నేతలకు మైనింగ్ శాఖ నుంచి షోకాజు నోటీసులు అందాయి. ఎవరూ ఈ నోటీసులకు స్పందించకపోవడంతో త్వరలో డిమాండ్ నోటీసులు ఇచ్చిన అనంతరం వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

> క్వార్ట్జ్ (తెల్లరాయి) అక్రమ తవ్వకాల్లో వైసీపీ నాయకుల పాత్ర బయటపడింది. ఎన్నికల కోడ్ ముందు వరకూ తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని జరిపిన అవినీతి బాగోతం బట్టబయలైంది. క్వార్ట్జ్ తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో తనిఖీలు చేసి స్థానికంగా పంచనామా నిర్వహించారు. విచారణలో తవ్వకాలు జరిపింది వైసీపీ నాయకులేనని తేలడంతో వారికి మైనింగ్ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఇప్పటివరకూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిజమని ఈ విచారణతో తేటతెల్లమవుతోంది. అసలు సూత్రధారులు ఎమ్మెల్యేలు, మంత్రులు కాగా, పాత్రధారులుగా వారి అనుచరులు ఉన్నారు. ఈ విషయమై వైసీపీ కేడర్‌లో కలకలం రేపుతోంది.

- **తప్పించుకునేందుకు ఆపసోపాలు**

ఎన్నికల కోడ్ వచ్చాక క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు కదిలారు. అప్పటి వరకూ తవ్వకాలు జరిపిన ప్రదేశాల్లో కొలతలు తీసి ఎంత మొత్తాన్ని తరలించారన్న లెక్కలు వేశారు. మైనింగ్ చట్టాల ప్రకారం క్వార్ట్జ్‌కు టన్నుకు రూ.90 సీనరైజ్ ఫీజు కాగా అనుమతులు లేకుండా తవ్వినందుకు పది రెట్లు పెనాల్టీలు వేస్తూ టన్నుకు రూ.900 చొప్పున షోకాజు నోటీసులు ఇచ్చారు. అయితే ఇదే టన్ను క్వార్ట్జ్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.30 వేల వరకు ఉంది. ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో రూ.12 కోట్ల వరకు జరిమానాలు విధించారు. ఈ లెక్కన రూ.400 కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేసి వైసీపీ నేతలు సొమ్ము చేసుకున్నారు. ఇంత భారీ స్థాయిలో దోపిడీ జరుగుతున్నా ఎన్నికల కోడ్ ముందు వరకూ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు. చివరకు టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీలకు ఫిర్యాదు చేయడంతో గుట్టు రట్టయ్యింది.



GOVERNMENTOF ANDHRA PRADESH
DEPARTMENT OF MINES & GEOLOGY

O/o the
District Mines and Geol[illegible]
SPSR Nellore

SHOW-CAUSE NOTICE

Quartz/2024-3, Dt: 19-03-[illegible]

[illegible]b:- Mines & Quarries - Illegal Quarrying for Quartz in Gover[illegible] Land in Sy.No: 583, 584 & 585 of Marupuru Village, Pod[illegible] Mandal, SPSR Nellore District - Illegal Quarrying done by Sri M[illegible] Srinivasula Reddy - Show - Cause Notice - Issued - Regardin[illegible]

[illegible]f:- 1. Inspection & Survey Report Dated 18.03.2024.
2. Panchanama dated: 18.03.2024.

-o0o-

[illegible]erting to the subject and references cited, Sri Mopuru Srinivasula [illegible] by informed that the undersigned along with this office Technical S[illegible] [illegible] they have inspected the land in Sy.No: 583, 584 & 585 of Ma[illegible] [illegible]dalakur Mandal, SPSR Nellore District. During the course of our insp[illegible] noticed that, the Quartz & Feldspar extracted and dispatched from t[illegible] digging various pits after removal of overburden. we have arriv[illegible] of Quartz & Feldspar extracted from the said land by measuring [illegible] deducting the overburden and Quantity of Quartz stocked at pit he[illegible]

మంత్రి కాకాణి ప్రధాన అనుచరుడు మోపూరు శ్రీనివాసులురెడ్డికి మైనింగ్ శాఖ జారీ చేసిన షోకాజు నోటీసు



మండుటెండలో ఇదేం పద్ధతి...!

- చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలతో ప్రయాణికులకు ఇక్కట్లు

నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో చింతారెడ్డిపాళెం క్రాసు రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఎన్నికల అధి కారులు వాహన తనిఖీల నిమిత్తం చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల తీరు తో వాహనదారులు, ప్రయాణికులకు చుక్కలు కనపడుతున్నాయి. జాతీయ రహదారి నుంచి నెల్లూరులోకి ప్రవే శించే కార్లను కనీసం రోడ్డు పక్కన కూడా ఆపించకుండా తనిఖీల కోసం రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో వెనుక పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. రహదారి మలుపు వద్ద చెన్నై - విజయవాడ, కావలి - చెన్నై వైపు వెళ్లే వాహనాలన్నీ బారులుతీరుతున్నాయి. ఒకపక్క మండే ఎండ.. మరోపక్క ట్రాఫిక్ జామ్‌తో వాహనాల్లోని ప్రయాణికులు తీవ్రంగా అవస్థ పడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వాహనదా రులు కోరుతున్నారు.

- నెల్లూరు రూరల్

నేడు జిల్లాలో బాలకృష్ణ పర్యటన

- గుడ్లూరు, నెల్లూరులో రోడ్‌షోలు

నెల్లూరు (వైద్యం)/కందుకూరు ఏప్రిల్ 25 : టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు గుడ్లూరు మామిడి చెట్ల సెంటర్ నుంచి బాలకృష్ణ రోడ్‌షో ప్రారంభమై, బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటుంది. అక్కడ జరిగే బహిరంగ సభలో బాలకృష్ణ మాట్లాడతారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు నెల్లూరుకు చేరుకుని మైపాడు గేటు నుంచి నవాబుపేట, జలకన్య విగ్రహం, ఆత్మకూరు బస్టాండ్, గాంధీబొమ్మ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్‌షో జరగనుంది. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి బాలకృష్ణ మాట్లాడతారు. ఇందుకు సంబంధించి టీడీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



ఉదయగిరిలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న 73 ఏళ్ల లెక్కల కొండయ్య

ముగిసిన తొలి ఘట్టం

- చివరిరోజు భారీగా నామినేషన్లు
- 98 మంది.. 113 సెట్లు
- టోటల్‌గా అసెంబ్లీకి 237, పార్లమెంట్‌కి 29..
- నేడు పరిశీలన

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. చివరిరోజు గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఈఒక్క రోజే ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 98 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 113 సెట్ల నామినేషన్లు వేశారు. కందుకూరులో 14 మంది, కావలిలో 8, ఆత్మకూరులో 7, కోవూరులో 24, నెల్లూరు సిటీలో 16, నెల్లూరు రూరల్‌లో 8 , సర్వేపల్లిలో 7, ఉదయగిరిలో 14 మంది చొప్పున నామి నేషన్లు దాఖలు చేశారు. అలానే నెల్లూరు పార్లమెంట్‌కు 14 మంది నామినేషన్లు వేశారు. ఇందులో చాలావరకు ఇదివరకే నామినేషన్లు దాఖలు చేసి వాటికి అదనంగా మరో సెట్ నామినేషన్ వేసిన వారే ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా చివరి రోజున మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు వేసేం దుకు భారీ సంఖ్యలో అభ్యర్థులు రావడంతో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు కిటకిటలాడాయి. మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ల గడువు ముగిసినా, చివరి రోజు ఎవరెవరు నామినేషన్లు వేశారన్న వివరాలు వెల్లడించేందుకు అధికారులకు రాత్రి తొమ్మిది గంటల వరకు సమయం పట్టింది. ఇక ఈనెల 18వతేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా చివరి రోజుతో కలిపి ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 237 మంది, పార్లమెంటుకు 29 మంది నామినేష న్లు దాఖలు చేశారు. కాగా నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరుగుతుంది. సాయంత్రం లోపు స్క్రూటినీ పూర్తి చేస్తారు. అనంతరం అర్హత సాధించిన నామినేషన్ల వివరాలను వెల్లడిస్తారు. ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహ రణకు గడవు ఉంది. 29వ తేదీ మధ్యాహ్నం మూ డు గంటల తర్వాత ప్రధాన పార్టీల అభ్యర్థులకు పార్టీ గుర్తులు కేటాయిస్తారు. ఇండిపెండెంట్ అభ్య ర్థులకు నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయిస్తారు. ఆ తదుపరి బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

85 శాతం పోలింగ్‌కు చర్యలు • ఎన్నికల పరిశీలకుల సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో సార్వత్రిక ఎన్నిల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన ఎన్నికల పరిశీలకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏర్పాట్లను పరిశీలకులకు వివరించారు. ఈసారి 85 శాతానికి పోలింగ్ పెంచ డానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల పటిష్ట నిర్వహణకు 16 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. ఇప్పటి వరకు 450 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. ఇప్పటి వరకు 18వేల మంది ఫాం-12 అందచేశారని తెలిపారు. హోంఓటర్లుగా 1712 మందిని గుర్తించామని, మొదటి దశలో మే 3 నుంచి 5వ తేదీ వరకు, రెండో దశలో 8 నుంచి 10వ తేదీ వరకు ఓటు హక్కు వినియోగించుకొనేలా ఏర్పాట్లు చేశామన్నారు.

- **20.59 లక్షల మంది ఓటర్లు**

జిల్లాలో ఇప్పటివరకు 20,59,546 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుషులు 10,07,444, స్త్రీలు 10,51,891 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. పూర్తి స్థాయిలో ఓటర్ల వివరాలు కొద్దిరోజుల్లో విడుదల చేస్తామని చెప్పారు. పోలింగ్ లొకేషన్లు 1444, పోలింగ్ కేంద్రాలు 2,470, ప్రభుత్వ ఉద్యోగులు 14657 మంది ఉన్నారని, వారిని ఎన్నికల విధులకు వినియోగిస్తున్నామని చెప్పారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, వలంటీర్లను ఎన్నికల విధుల్లో వినియోగించటం లేదని చెప్పారు. ఈ సమావేశంలలో సాధారణ సరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్ సింగ్ బాధురియా, కరేగౌడ, పోలీస్ పరిశీలకులు అశోక్ పి.దుదే, ఎన్నికల వ్యయ పరిశీలకులు జ్యోతి మోయ్ భైలంగ్, కంచన్‌రామ్ మీనా, ప్రసాద్ దత్తాత్రేయ, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.



పరిశీలకుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

- టీడీపీ విజయం చారిత్రాత్మక అవసరం
- ఆత్మకూరు ప్రచారంలో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, ఆనం



ప్రచారంలో అభివాదం చేస్తున్న వేమిరెడ్డి, ఆనం

ఆత్మకూరు, ఏప్రిల్ 25 : రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబు నాయుడు రావాలని నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరులో పంటవీధి, చల్లావీధి, పెద్దమసీదు మీదుగా బీఎస్ఆర్ సెంటర్ వరకు వారు ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సమ ప్రాధాన్యం ఇచ్చి సుపరిపాలన అందించిన టీడీపీ తిరిగి పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు అన్నదాతను ఆదుకునేందుకు మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కాగా, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు అందజేశారు. ప్రచారానికి వచ్చిన ఆనం, వేమిరెడ్డిలకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, టీడీపీ నాయకులు గిరినాయుడు, శైలజారెడ్డి, చంద్రారెడ్డి, చిట్టమూరి వెంకటేశ్వర్లురెడ్డి, చంద్రా వెంకటసుబ్బానాయుడు, బీజేపీ నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, సుధాకర్ రెడ్డి, జనసేన నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో దళం!

- అగ్నిమాపక దళాన్ని పట్టించుకోని జగనన్న!
- ఐదేళ్లలో ఒక్క ఫైర్ స్టేషన్‌కూ అనుమతుల్లేవ్!
- మంజూరైన వాటికి బిల్లుల పెండింగ్!
- సిబ్బందికీ అందని పీపీఏలు





పొదలకూరులో ఆగిన ఫైర్ స్టేషన్ పనులు

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అగ్నిమాపక దళం నిర్వీర్యమైపోయింది. ఆ శాఖ పురోభివృద్ధిపై కన్నెత్తి చూడకపోవడంతో ఒక్క స్టేషన్ కూడా కొత్తగా ఏర్పాటు కాలేదు. దీనికితోడు ఉన్న స్టేషన్ల స్థానంలో కొత్తవి నిర్మాణ పనులు చేపట్టినా బిల్లులు మంజూరుకాక ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఖాళీ పోస్టులు భర్తీకాకపోగా, ఉన్నవారిపై పనిభారం పెరిగింది. ఐదు సంవత్సరాల్లో ఒక్క కొత్త ఫైర్ ఇంజన్ మాత్రమే జిల్లాకు చేరగా, సిబ్బందికి పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్యూప్‌మెంట్ వంటివి కూడా అందలేదు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ఆయా ఫైర్ స్టేషన్లలో 150 మందికిగానూ 110 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. వీరిలో హోమ్‌గార్డులు 40 మంది, అగ్నిమాపక శాఖ సిబ్బంది 70 మంది మాత్రమే ఉన్నారు. బుచ్చి, వెంకటాచలం, నెల్లూరు-2 కొత్త ఫైర్ స్టేషన్‌ల మంజూరు కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇప్పటివరకు అతీగతీలేదు. వైసీపీ ప్రభుత్వంలో పొదలకూరు, ఆత్మకూరు, కావలిలో నూతన భవనాల నిర్మాణాలకు అనుమతులు అందాయి. అయితే పొదల కూరు, ఆత్మకూరు స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభమైనా కాంట్రాక్టర్లకు బిల్లులు అందక పోవడంతో పనులు పూర్తిగా నిలిచి పోయాయి. కావలిలో అసలు పనులే ప్రారంభం కాలేదు. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఫైర్ ఇంజన్ ఎంత త్వరగా ఘటనాస్థలికి చేరుకుంటే అంత నష్టాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. అయితే, జిల్లాలో ఒక్కో స్టేషన్ పరిధి 35 నుంచి 40 కిలోమీటర్ల మేర ఉంది. అంటే దూర ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకోవాలంటే అధిక సమయం పడుతుంది. దీంతో మంటలు ఆర్పడం ఆలస్యం అవుతుండటంతో నష్టం పెరుగుతోంది మరోవైపు ఫైర్ ఇంజన్లకు నిరంతరం నిర్వహణ లేకపోవడంతో వాహనాలు అధ్వానంగా ఉంటున్నాయి. ఉన్నవాటితోనే అగ్నిమాపక దళం నెట్టుకు వస్తోంది.

- నెల్లూరు (క్రైం)

సేవా దృక్పథం కలిగిన వేమిరెడ్డి, కాకర్లను ఆదరిద్దాం

● మెట్టుకూరి చిరంజీవిరెడ్డి


స్థానికులతో మాట్లాడుతున్న చిరంజీవిరెడ్డి

జలదంకి, ఏప్రిల్ 25: సేవా దృక్పథం కలిగిన టీడీపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌లను ఆదరించి గెలిపిద్దామని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవలే తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన గురువారం తన ప్రధాన అనుచరుడు తొక్కేలు నారాయణరెడ్డి అనారోగ్యానికి గురికావడంతో పరామర్శించేందుకు మండలంలోని కోదండరామపురం వచ్చారు. ఆయన వస్తున్నాడనే విషయం తెలుసుకుని వేములపాడు ఎంపీటీసీ గొర్రెపాటి యలమందారెడ్డి, మాజీ సర్పంచు మద్దూరి శ్రీనివాసులరెడ్డి, గోసల శివారెడ్డి, దేవిరెడ్డి కామేష్ రెడ్డి, మట్టెపు ఏడుకొండలు, ముక్కు మల్లిఖార్జున తదితరులు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవిరెడ్డి తాను పార్టీ ఎందుకు మారాల్సి వచ్చిందనే విషయాన్ని, తన అనుచరులపై పెడుతున్న కేసులు, ప్రస్తుతం ఎన్నికల సమయంలో తనపై వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రవర్తించిన విధానం తదితర విషయాలు వివరించారు. వెనుకబడ్డ ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వతహాగా వీరిద్దరూ సేవాదృక్పథం కలవారని, ఇప్పటికే వారిద్దరు ట్రస్టులు పెట్టి ఎలా సేవచేయగలిగారో ప్రజలందరికీ తెలిసిన విషయమేనని, దీనిని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ ప్రజలు వారిని ఆదరించి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజ్ఞులైన నియోజకవర్గ ఓటర్లు ఆలోచించి ఓట్ల రూపంలో తమ నిర్ణయాన్ని తెలపాలని పేర్కొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే..

అల్లూరులో ఎంపీ క్యాంపు కార్యాలయం


అల్లూరులో వేమిరెడ్డి కోటారెడ్డికి సమస్యలు తెలుపుతున్న కాలనీ వాసులు

అల్లూరు, ఏప్రిల్ 25 : టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిలను గెలిపిస్తే అల్లూరులో శాశ్వత ఎంపీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేందుకు కార్యాచరణ చేపడతామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నేత షేక్ రఫీమాలిక్ ఆధ్వర్యంలో ఆర్‌డీఆర్ కాలనీ, బీసీ కాలనీ, రజక కాలనీ, కట్టకింద అరుంధతీయవాడ కాలనీ వాసులు స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను కోటారెడ్డి ఎదుట ఏకరువు పెట్టారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి దాహార్తిని తీరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడా శ్రీనివాసులు రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, అర్షిత్ రెడ్డి, పాపాల విజయ కుమార్ రెడ్డి, దేవళ్ల హరిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

143 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 25: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 526 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 383 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-123, ఆర్ఆర్-4, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 143 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.218, సగటు ధర రూ.242.80గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

కుటీర పరిశ్రమగా బెల్టు షాపులు!

● బహిరంగంగా విక్రయం ● ఈసీ టార్గెట్ అంటూ ప్రభుత్వ దుకాణాలు మధ్యాహ్నమే మూత ● దొడ్డిదారిన తరలించి అధికార పార్టీ నేతలకు అందజేత ● సెబ్, పోలీసులు సహకరిస్తున్నారంటూ టీడీపీ ఆరోపణ



ఉలవపాడులో మూసిఉన్న మద్యం దుకాణం


లింగసముద్రంలో ప్రభుత్వ మద్యం దుకాణం, పక్కనే కూల్‌డ్రింక్ షాపు

ఉలవపాడు, ఏప్రిల్ 25 : మండలంలో బెల్టు షాపులు కుటీర పరిశ్రమలుగా మారాయి. ఈసీ మద్యం విక్రయాలపై దిశానిర్దేశాలు విధించడంతో మధ్యాహ్నం 2 గంటలకే ప్రభుత్వ మద్యం దుకాణం మూతేస్తున్నారు. అయితే దుకాణంలోని మద్యాన్ని అడ్డదారిలో అటు బెల్టు దుకాణాలకు, ఇటు అధికార పార్టీ నేతలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారాల్లో అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే మద్యం లభిస్తుండగా ప్రతిపక్ష పార్టీలకు దొరకడం లేదు. దీంతో సెబ్, పోలీస్ సహకారంతో వైసీపీ నేతలకు మద్యం అందజేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మందుబాబులు మాత్రం అధిక ధరలకు బెల్టు షాపుల్లో కొనుగోలు చేసి జేబులు ఖాళీ చేసుకొంటున్నారు. మండలంలో ఉలవపాడులో రెండు, కరేడు, చాకిచర్లలో ఒక్కొకటి చొప్పున ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఉలవపాడు టౌన్‌లో అన్ని సామాజికవర్గాలలో సుమారు 40 మంది బెల్టు షాపుల నిర్వహణను పార్ట్ టైం జాబ్‌గా మార్చుకున్నారు. బాటిల్‌పై రూ.50 అదనం అయినా మందుబాబులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇళ్లలో ఖాళీగా ఉన్న వృద్ధులు సైతం 10 నుంచి 20 సీసాలు తెప్పించుకొని రోజుకి సుమారు రూ.500 నుంచి రూ.1000 సంపాదిస్తున్నారు. ఇక యువకులు అక్రమ మద్యం విక్రయాలను వ్యాపారంగా మార్చుకొని రోజుకి రూ.3000 సంపాదించే వాళ్లు లేకపోలేదు. పోలీస్, సెబ్ అధికారులు అటు వైపు వెళ్లరన్న నమ్మకంతో తీరప్రాంత గ్రామాల్లో బహిరంగంగా విక్రయాలు జరుగుతున్నాయి.

ఈసీ టార్గెట్‌తో బెల్టు షాపులకు...

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈసీ ప్రభుత్వ షాపులకు టార్గెట్‌లు నిర్దేశించింది. గత ఏడాది ఏప్రిల్ నెలలో రోజుకు ఎంత మద్యం విక్రయాలు జరిగాయో సరాసరి ప్రస్తుతం అంతే విక్రయించాలన్న నిర్ధారించింది. దీంతో టార్గెట్ పూర్తి అయ్యిందంటూ సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్‌లు దొడ్డిదారిలో మద్యం అక్రమంగా విక్రయాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అందులో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకే దుకాణాలు మూతవేసి టార్గెట్ మేరకు మద్యం సీసాలను వైసీపీ నేతలకు, బెల్టు షాపులకు విక్రయిస్తూ లాభార్జన పొందుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అనధికార బార్లుగా కూల్‌డ్రింక్ షాపులు

లింగసముద్రం : మండలంలోని పెదపవని, లింగసముద్రం గ్రామాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల పక్కనే అనధికార బార్లు నడుపుతున్నారని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాల పక్కన తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, మంచినీళ్ల సీసాలు, గ్లాసులు విక్రయిస్తుండడంతో మందుబాబులు వాటిని కొనుగోలు చేసి అక్కడే మద్యం తాగుతున్నారు. వాస్తవానికి మద్యం దుకాణాల సమీపంలో మద్యం తాగకూడదు. కానీ ఈ గ్రామంలో యథేచ్ఛగా అక్కడే మద్యం తాగుతూ, ఆ ఖాళీ సీసాలను పక్కనే పొలాల్లో వేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ రెండు గ్రామాల్లో రెండేసి గదులను నిర్మించి ఒక గదిలో మద్యం దుకాణం, మరో గదిని కూల్‌డ్రింక్స్ షాపులకు ఇచ్చారు. దీంతో మద్యం దుకాణాల వద్ద అనధికార బార్లు నడుస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ ప్రచారం


ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొండాపురం, ఏప్రిల్ 25: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ ఆదేశాలమేరకు మండలంలోని పార్లపల్లి, గానుగపెంట, ఆదిమూర్తిపురం, లింగనపాలెం తదితర గ్రామాలలో గురువారం ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో ఆశాఖ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న ఎన్డీయే కూటమికి ఎమ్మార్పీఎస్ పూర్తిస్థాయిలో మద్దతిస్తుందన్నారు. ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతి మాదిగ బిడ్డపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆశాఖ మండల నాయకులు గోసాల సుధాకర్ మాదిగ, మల్లెల తిరుమలేశు మాదిగ, గోచిపాతల ఆనందరావుమాదిగ, గంగపట్ల నాగరాజుమాదిగ, గోసాల సందీప్ మాదిగ, నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటేస్తే మళ్లీ విధ్వంసమే : ఇంటూరి సౌజన్య


కళవళ్లలో ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

వలేటివారిపాలెం, ఏప్రిల్ 25 : జగన్‌కు ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ విధ్వంసమేనని కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య తెలిపారు. మండలంలోని కళవళ్లలో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. మహిళా కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను వివరించి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గత టీడీపీ ప్రభుత్వ పానలతో పోలిస్తే 10 శాతం అభివృద్ధి కూడా జరగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కందుకూరు, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కందుకూరు పట్టణంలో గురువారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కందుకూరు అర్బన్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తూ ప్లేకార్డులు, నినాదాలతో ప్రధాన వీధులలో జరిగిన ర్యాలీలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టరు బ్యూలాగ్రేస్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమకాటుకి గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవడంతో పాటు నీటి తొట్టెలపై మూతలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ఓ పద్మావతి, కే. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి, కాకర్లను గెలిపించండి


జలదంకిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నేతలు

జలదంకి, ఏప్రిల్ 25: మండలంలోని జలదంకి, తదితర గ్రామాల్లో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎన్నికల మేనిఫెస్టో సూపర్‌సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీల పథకాలను ఓటర్లకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లు ట్రస్టుల ద్వారా చేస్తున్న సేవలను వివరించారు. ఈ ప్రచారంలో కూటమి పార్టీల మండల అధ్యక్షులు పులుగుంట మధురెడ్డి, కంచర్ల శరత్‌బాబు, తోట మురళీతో పాటు జిల్లా నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, మారెళ్ల బ్రహ్మారెడ్డి, నిమ్మలపల్లి రామ్‌చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు

లింగసముద్రం, ఏప్రిల్ 25 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తారని మండలంలోని పెదపవని టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, కందుకూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్‌రసూల్ చెప్పారు. గురువారం సాయంత్రం గ్రామంలో స్థానిక టీడీపీ నేతలతో కలిసి గ్యాస్ సిలిండర్లను ప్రదర్శిస్తూ, ఇంటింటికి టీడీపీ, జనసేన నేతలు కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ, కందుకూరు ఎమ్మెల్యే టీడీపీ ఉమ్మ డి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి మాలకొండయ్య, షేక్ రఫీ, కై కొండలరావు, దనుం మధు, రాఘవేంద్ర, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కరీముల్లా, జనసేన నేతలు మలిశెట్టి మనోహర్, కోటుపల్లి దినేష్, దారా రాజారత్నం పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్లతో ప్రచారం చేస్తున్న నాయకులు

టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం : కావ్య


కావలి : టీడీపీలో చేరిన 36వ వార్డు నేతలతో కావ్య, వంటేరు


కావలి : వైసీపీ నుంచి టీడీపీలో చేరిన బట్లదిన్నె వాసులతో కావ్య

● వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసల జోరు

కావలి, ఏప్రిల్ 25: ఇతర పార్టీల నుంచి తెలుగుదేశం పార్టీలో చేరే వారికి సముచిత స్థానం ఉంటుందని కావలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. గురువారం కావలి పార్టీ కార్యాలయానికి వచ్చి పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. పట్టణంలోని వివిధ వార్డుల నుంచి, పలు గ్రామాల నుంచి వచ్చిన వారందరికీ కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణ టీడీపీ నాయకులు తాతా వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసులు, మెట్టుకూరి అమరజీవిరెడ్డి, డాకా శ్రీనివాసులరెడ్డిల ఆధ్వర్యంలో 36వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు, అలాగే 26వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు తోడ్రెడ్డి రామక్రిష్ణారెడ్డి వైసీపీలో చేరారు. కావలి రూరల్ మండలం తాళ్లపాలెం పంచాయతీ బట్లదిన్నెకు చెందిన మాజీ ఎంపీటీసీ బండ్ల వెంకట్రావు, పంచాయతీ 9వ వార్డు సభ్యురాలు ఉప్పాల రమణమ్మ తోపాటు మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. అదేవిధంగా టీడీపీ నాయకులు మోర్ల చెంచురామయ్య, దినేష్, రఫీ, దాసుల ఆధ్వర్యంలో రూరల్ మండలం ఆముదాలదిన్నె పంచాయతీ కొనదిన్నెకు చెందిన 15 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారందరికీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నియోగజకవర్గంలో టీడీపీలోకి రోజురోజుకు వైసీపీ నుంచి వలసలు పెరుగుతుండడంతో నేతల్లో జోష్ నెలకొంది.


బిట్రగుంట : పార్టీ కండువా వేస్తున్న దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి

టీడీపీలోకి పలువురి చేరిక

బిట్రగుంట, ఏప్రిల్ 25: బోగోలు మేజర్ పంచాయతీ అరవపాలెంకు చెందిన పీ.వేళాంగిణి, కే.ప్రభావతి, వై.వేళాంగిణి, ఎస్.శాంతిప్రియ, పి.శివకుమార్ తదితరులు టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బోగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు. మధ్యాహ్నం విశ్వనాథరావుపేట నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. సాయంత్రం ఇబ్రహీంపేట, ముస్లింవీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుధీర్‌బాబు, అహ్మద్ బాషా, అడపా ప్రసాద్, జానకిరామయ్య, తోట ప్రసాద్, పేట శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోగోలు అరవపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త ఫిలిమెన్ రవి(60) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆయన పార్థవ దేహానికి దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి, మాలేపాటి నాగేశ్వరావు, బోగిరి ప్రభాకర్ పూలమాలు వేసి నివాళులర్పించారు. వారి వెంట మేకల కిరణ్‌కుమార్, పిచ్చయ్య, రవిగన్, ఎహిజికేల్, మొల్ల తదితరులు ఉన్నారు.

వైసీపీని వీడి 17 కుటుంబాలు...

అల్లూరు, ఏప్రిల్ 25 : మండలంలో నార్తుఆములూరు పంచాయతీకి చెందిన 17 కుటుంబాల నుంచి 70 మంది వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆపార్టీని వీడి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఆ గ్రామానికి చెందిన రాచగొల్ల సుబ్బయ్య, రాచగొల్ల కరుణాకర్, షేక్ మస్తాన్, బదనాపురి వెంకటేశ్వర్లు, వంగపాటి రమేష్, ఒట్టూరు మల్లికార్జున, రాచగొల్ల వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో వీరు టీడీపీలో చేరగా బీద గిరిధర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేడా కృష్ణారెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, దాసరి కరుణాకర్, దాసరి ప్రభాకర్, పెయ్యల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


అల్లూరు : నార్తుఆములూరు వాసులకు కండవా వేస్తున్న గిరిధర్

ముగిసిన నామినేషన్ల పర్వం

● కావలి అసెంబ్లీకి 25 మంది, 43 సెట్లు

కావలి, ఏప్రిల్ 25: కావలి అసెంబ్లీకి నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. మొత్తం 25 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. చివరి రోజు 8 నామినేషన్ల పత్రాలను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందచేశారు. టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తరుపున నాలుగో సెట్ నామినేషన్ వేయగా వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తరుపున మూడో సెట్ నామినేషన్ వేశారు. సమాజవాది పార్టీ తరుపున ఆనం లత, యంగ్‌సీనియర్ రిచ్‌కామన్‌పీపుల్ కింగ్స్ పార్టీ తరుపున ఉప్పాల రవికిరణ్, కాంగ్రెస్ పార్టీ తరుపున లేలపల్లి సురేష్‌బాబులు తమ నామినేషన్లను వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బచ్చల సంధ్యారాణి, దేవరపల్లి క్రిష్ణారెడ్డి, వీ శ్రీనివాసులు నామినేషన్లు వేశారు.

కందుకూరులో 25 మంది, 40 సెట్లు

కందుకూరు : కందుకూరు అసెంబ్లీకి 25 మంది అభ్యర్థులు 40 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా, జైభారత్ నేషనల్ పార్టీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, నీతి నిజాయితీ పార్టీ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీలతో పాటు మరో 14మంది ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు.

బాలకృష్ణ బహిరంగ సభకు తరలిరండి : ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 25: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ శుక్రవారం మండల కేంద్రమైన గుడ్లూరులో ఎన్నికల ప్రచారసభలో పాల్గొంటారని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కావలిలో బయలుదేరి 3 గంటలకు తెట్టు జంక్షన్ వద్దకు చేరుకుంటారని, మూడున్నర గంటలకు గుడ్లూరు శివార్లలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి బాలయ్య బాబుకు ఘనస్వాగతం పలుకుతామని తెలిపారు. అక్కడి నుంచి గుడ్లూరు మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందని 4 గంటలకు బహిరంగసభలో బాలకృష్ణ ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమం అనంతరం బాలకృష్ణ నెల్లూరులో జరిగే ఎన్నికల ప్రచార కార్యక్రమానికి బయలుదేరి వెళ్తారన్నారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు, ప్రజలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

వృద్ధ మహిళ నేత్రదానం

జలదంకి, ఏప్రిల్ 5: కలిగిరి మండలం వెలగపాడు కమ్మవారిపాలెంకు చెందిన మేదరమెట్ల రమణమ్మ(85) గురువారం మండలంలోని టీకే అగ్రహారంలో తన కుమార్తె కంచర్ల రాధ నివాసంలో మృతి చెందారు. ఆమె నేత్రాలను ఆమె కుమార్తెలు దానం చేశారు. కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరించి తీసుకెళ్లారు.

ఇంటూరి సోదరుల కలయికతో టీడీపీలో జోష్


కందుకూరు : టీడీపీలో చేరిన కొండికందుకూరు ఎస్సీ కాలనీ వాసులు

ఉలవపాడు, ఏప్రిల్ 25 : వైషమ్యాలు వీడి ఇంటూరి సోదరులు ఒక్కటవడంతో తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపింది. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును విబేధించి ఇటీవల మండలంలో ఇంటూరి రాజేష్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంలు ప్రచారం చేయడంతో టీడీపీ శ్రేణులు అయోమయానికి గురయ్యారు. ఈ క్రమంలో ఇంటూరి రాజేష్ ఇండిపెండింట్‌గా పోటీలో ఉంటే సోదరులిద్దరూ ఓట్లు చీల్చుకుంటే వైసీపీకి లాభం చేకూరుతుందని భావించారు. ఈ క్రమంలో వారి ఆశలు అడియాశలు చేస్తూ ఇంటూరి నాగేశ్వరరావు నామినేషన్ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చక్రం తిప్పి ఇంటూరి బ్రదర్స్ దివి కుటుంబం మధ్య సయోధ్య కుదర్చడంతో ఇటూ టీడీపీ నేతల్లో జోష్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం రాత్రి మండలంలోని కొల్లూరుపాడు బీసీ కాలనీ, ఉలవపాడు, కరేడు, చాకిచర్ల, బద్దిపూడి, భీమవరం గ్రామాల్లో పర్యటించి రాజేష్ వర్గీయుల ఇళ్లకు వెళ్లి పార్టీ విజయం కోసం పనిచేయాలని, అన్ని వేళల అందుబాటులో ఉండి పని చేస్తానని మాట ఇచ్చారు. రాజేష్‌తో కలిసి నడిచిన వారంతా అధికశాతం యాదవ సామాజిక వర్గం వారే కావడంతో మండలంలో టీడీపీకి యాదవ సామాజిక వర్గం బలంగా మారింది.


ఉలవపాడు : ఇంటూరి రాజేష్ వర్గీయులతో సమావేశమైన టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

ఉలవపాడు : మండలంలోని చాకిచెర్ల పంచాయతీ తూర్పు సంఘంలోని వైసీపీకి చెందిన మానికల వెంకటేశ్వర్లు, చిలకపాటి సురేష్, ఇడింపల్లి వెంకటేశ్వర్లు, మల్లవరపు కృష్ణ, పొట్లూరి పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, మల్లవరపు వెంకటేశ్వర్లు, పొన్నూరి నాగయ్య, అన్నం చెంచయ్య, చేవూరి శేషయ్య, చేవూరి బాబు, పోట్లూరి చెంచయ్య, పోట్లూరి తిరుపతయ్య, నంబూరి కలగయ్య తదితరులు టీడీపీలో చేరారు. గురువారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో వారికి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు టీడీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మింరియం మల్లికార్జున, సుదర్శి సాంబయ్య, పాయలపాటి శ్రీను, చిలకపాటి శ్రీను, మిరియం భాస్కర్, సుదర్శి శ్రీను, జువిగుంట యలమంద, ఎందేటి శ్రీను, రఘు, మట్టెపు రామకృష్ణ, సన్నెబోయిన సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొండికందుకూరు...

కందుకూరు : మండలంలోని కొండికందుకూరు ఎస్సీ కాలనీవాసులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం కాలనీకి చెందిన మెండా గోవిందు, వెంకటేశ్వర్లు, భాస్కర్, నాగార్జున, మాల్యాద్రి, ప్రసాద్, కొండయ్య, మెడబలిమి వెంకటేశ్వర్లు, సుదర్శి రామకృష్ణ, దాసరి గిరిబాబు తదితరులు స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని పార్టీకి మద్దతిచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా వారందరికీ పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన పోకూరి వెంకటేశ్వర్లు కూడా ఇంటూరి నాగేశ్వరరావు సమక్షం లో తెలుగుదేశం పార్టీలో చేరారు. వలేటివారిపాలెం మండలం శింగమ నేనిపల్లి గ్రామానికి చెందిన నాంచారమ్మ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త చిడిపోతు వెంకటేశ్వర్లు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో తెలుగుదేశం పార్టీ బలం రోజురోజుకు పెరుగుతోందని టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, ఎన్వీ సుబ్బారావు, ఈదర నరసయ్య, గుళ్లా శ్రీను, బొడపాటి అనిల్, యడ్లపల్లి చంద్రయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


సాల్మానుపురం వద్ద రోడ్డు మార్జిన్‌లో దహనక్రియలు జరుగుతున్న దృశ్యం

వారంతా పునరావాస ప్రజలు. పొట్టచేత పట్టుకుని కడప జిల్లా నుంచి ఊరుగాని ఊరొచ్చారు. చేతికందిన పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎలాగోలా పూట గడిచిపోతున్నా గ్రామంలో ఎవరైనా చనిపోతే దహనక్రియలకు మరుభూమి లేక అవస్థలు పడుతున్నారు. నిత్యం వాహనాల రద్దీ ఉండే రోడ్డు పక్కనే దహనక్రియలు చేసుకుంటున్నారు. 'ఒక్కచాన్స్' పేరుతో పాదయాత్ర చేస్తూ తమ ఊరికి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌కు తమ సమస్యను మొరపెట్టుకున్నారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానన్న జగన్ ఆరేళ్లు గడిచినా ఇప్పటికీ అతీగతీ లేదు.

మరుభూమికీ ఎన్ని కష్టాలయ్యా!?

- స్మశానం కోసం పాదయాత్రలో జగన్‌తో మొర
- అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ
- ఆరేళ్లవుతున్నా అతీగతీ లేదు!

సోమశిల ప్రాజెక్టు ముంపు గ్రామాల (కడప జిల్లా) నుంచి 40 ఏళ్ల క్రితం బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి పంచాయతీ సాల్మానుపురానికి వలస వచ్చారు. గ్రామం, పరిరసరాలు అభివృద్ధి చెందేకొద్దీ గ్రామానికి స్మశానం సమస్య ఏర్పడింది. గ్రామంలో 350 కుటుంబాలు, 1100 మంది జనాభా, 700 మంది ఓటర్లు ఉన్నారు. ఎవరైనా చనిపోతే ప్రధాన రహదారి పక్కనే దహనక్రియలు చేస్తున్నారు. దీనివల్ల ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందిపడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో భాగంగా జొన్నవాడ, బుచ్చి మార్గంలో పెనుబల్లి, సాల్మానుపురం మీదుగా బుచ్చికి వెళ్లారు. సాల్మానుపురం వద్ద ఆ గ్రామ ప్రజలు ఆయనకు స్వాగతం పలికి వారి భూములు, స్మశాన సమస్యలను విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన జగన్ అధికారంలోకి రాగానే ఆ సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయితే, ఇది జరిగే దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా ఆ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. స్మశాన వాటిక లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాలను రోడ్డు మార్జిన్‌లోనే దహనం చేసుకుంటున్నారు. ఆరేళ్లు గడిచినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో సాల్మానుపురం వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం

చేతులుడిగి చూస్తున్నాం

గ్రామ సమీపంలో ఆక్రమణలో ఉన్న సర్వే నెంబరు 151-సీలోని 53 సెంట్లు డొంక పోరంబోకును స్మశానానికి కేటాయిస్తూ గ్రామ పంచాయతీ తీర్మానించినా ప్రయోజనం శూన్యం. అప్పటి నుంచి పలువురు కలెక్టర్లు, తహసీల్దార్లు, మంత్రులకు మొరపెట్టుకున్నా న్యాయం చేయకపోగా ఆ డొంక పోరంబోకు భూమిని కూడా అధికారులు కబ్జాదారులకే కట్ట బెట్టారు. ఆరేళ్ల క్రితం మా సమస్యను ప్రస్తుత సీఎం జగన్‌కు విన్నవించుకున్నా ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో చేసేదిలేక చేతులుడిగి చూస్తున్నాం.

- సిద్దన కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ

యువత భవితకు భరోసా ఇచ్చేవారికే ఓటు



యువత భవితకు భరోసా ఇచ్చే వారికే నా తొలి ఓటు. యువతీ,యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసజీవు లుగా మారుతున్నారు. ఉచితాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చకుండా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వాలు ఆసరాగా నిలవాలి. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించేలా నేతలు కృషిచేయా లి. ప్రతి ఒక్కరూ ఆలోచించి తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

- మాదాల జనార్దన్, బీటెక్ సెకండ్ ఈయర్, ముసునూరు, కావలి

యువగళం

వినండహో..

ఉచితంగా 'లంచం-రాజకీయాలు' కరదీపిక



ఎన్నికల్లో గెలిపే పరమావధిగా అభ్యర్థులు ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభపెడుతున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో లంచం రాజకీయాలపై అక్షరాల నిప్పుకణికలను కరదీపికగా రూపొందించారు. రక్తదాత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి సొంత ఖర్చులతో ముద్రించిన ఈ కరపత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కావాల్సిన వారు రూపాయి విలువ కలిగిన తపాలా బిళ్ల అంటించి సొంత చిరునామా రాసిన 5 ఇంటూ 8 సైజు కవరును ఆయనకు పంపితే ఆ కరదీపికను పోస్టులో పంపుతారు. చిరునామా - తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డోర్ నెంబరు 223/2వ అంతస్తు, సచివాలయం ఎదురు భవనం, ఈశ్వరప్రగడవారి వీధి, సుమంగళి కళ్యాణ మండపం ఎదురువీధి, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు-524002, ఫోన్ నెంబరు 0861-2325125.

- నెల్లూరు (సాంస్కృతికం)

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం కేడర్‌లో జోష్ కనిపిస్తోంది. ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, యువనేత ఇంటూరి రాజేష్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. తనను పార్టీ నిర్లక్ష్యం చేస్తున్నదన్న అసంతృప్తితో ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధపడ్డ ఇంటూరి రాజేష్ తన మనసు మార్చుకున్నారు. నాగేశ్వరరావుపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ ఆయన విజయానికి పనిచేసేదే లేదని భీష్మించుకున్న దివి శివరాం సైతం మెత్తబడ్డారు. ఈ పరిణామాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కొండంత ఉత్సాహాన్ని ఇచ్చాయి.

- కందుకూరు



కందుకూరులో ఒక్కటైన టీడీపీ నాయకులు

వైసీపీ కేడర్‌లో గుబులు

ఇప్పుడిప్పుడే బయటపడుతున్న విభేదాలు

చల్లారిన జ్వాల.. తమ్ముళ్లలో జోష్!

టీడీపీలోని వర్గవిభేదాలు తమకు కలిసివస్తాయని వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్‌తోపాటు ఆ పార్టీ నాయకులు సంబరపడ్డారు. మరోవైపు ఈ పరిణామాలతో టీడీపీ కేడర్‌లోనూ తీవ్ర నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. పంచా యతీ ఎన్నికల సమయంలో తమకు అండగా నిలిచిన రాజేష్‌ను కాదనాలా, ఎన్నో ఏళ్లుగా శివరాంతో ఉన్న అనుబం ధాన్ని తెంచుకోవాలా లేక వారి కోసం 45 ఏళ్లుగా టీడీపీతో ఉన్న బంధాన్ని వదులుకోవా లో అర్థంకాక పలువురు సతమతమయ్యారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి మధ్యవర్తిత్వంతో అసమ్మతి చల్లారింది. మొన్నటి వరకు గ్రామగ్రామాన రెండువర్గాలుగా విడిపోయి పనిచేసిన టీడీపీ శ్రేణులు ప్రస్తుతం ఏకతాటిపై పని చేయటానికి సిద్ధపడ్డాయి.


ఇంటూరి


బుర్రా

- వైసీపీలో ఉలికిపాటు

టీడీపీలో అసమ్మతి జ్వాలలు చల్లారడం, ఇంటూరి బ్రదర్స్ చేతులు కలపడంతో వైసీపీ వర్గీయులు ఉలిక్కిపడ్డారు. ఆ పార్టీలోని వర్గ విభేదాలు తమకెంతో కలిసి వస్తాయన్న వారి ఆశలపై నీళ్ల చల్లినట్లైంది. అనూహ్యంగా టీడీపీ నేతలంతా ఒకటికావటంతో పాటు వైసీపీ లోని వర్గవిభేదాలు మెల్ల మెల్లగా వెలుగు లోకి వస్తుండటం ఆ పార్టీ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఐదేళ్లుగా ఆ పార్టీ అధికారంలో ఉండ టంతో సహజంగానే వర్గాలు ఏర్పడ్డాయి. దీనికితోడు నియోజక వర్గంపై పట్టున్న సిట్టింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కాదని, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌ను కందుకూరు అభ్యర్థిగా ప్రకటించటం కూడా పెద్ద సమస్యగా మారింది. ప్రతి గ్రామంలో రెండు మూడు వర్గాలు ఉండటం, వారిలో ఎవరి బలం ఎంతో ఎవరికి ఏమేరకు ప్రాధాన్యత ఇవ్వాలో బుర్రాకు అవగాహన లేకపోవటం ఆపార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో ఒకరికి బాధ్యత ఇస్తే నలుగురు అలకబూనే పరిస్థితులు వైసీపీని అతలాకు తలం చేస్తున్నాయి. కొన్నిచోట్ల జనబలం లేని నేతలే ముందుకు వచ్చి పెత్తనం చేస్తుండటంతో ప్రజల్లో పట్టున్న నేతలు మొక్కుబడిగా పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. దీనికితోడు రెండు, మూడుసార్లు బుర్రాను కలిసి మాట్లాడిన గ్రామస్థాయి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులను కూడా ఆయన గుర్తు పెట్టుకోవటం లేదని విమర్శలు ఉన్నాయి. వీటన్నిటికీ తోడు ఎమ్మెల్యే మహీధరరెడ్డి వైసీపీ అభ్యర్థి బుర్రాకు మద్దతి స్తున్నప్పటికీ ఆయనను అభిమా నించే కొంతమంది మహీధర్‌కు జగన్ టికెట్ ఉద్దేశపూర్వకంగా ఇవ్వక పోవటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్న కృత నిశ్చయంతో ఉన్నట్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. జగన్‌కు తగిన సమాధానం చెప్పటం అంటే వారంతా వైసీపీ ఓటమే లక్ష్యంగా టీడీపీకి ఓటు వేస్తారని అర్థమైపో తోంది. ఈ పరిస్థితుల్లో కందుకూరులో వైసీపీకి గడ్డుకాల మేనన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో నెలకొంది.

వర్తమానం..

ఎండాకాలం.. అందులోనూ ఎన్నికల సీజన్.... దానికితోడు ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నానికే మూత... ఇంకేముంది...! మందుబాబులంతా కల్లు అంగళ్లపైకి మళ్లారు. జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజుల నుంచి కల్లుకు బాగా డిమాండ్ పెరిగింది. జెగ్గు కల్లు రూ. 15లకే దొరుకుతుండటంతో అంతా అటువైపే మొగ్గుతున్నారు. ఎన్నికల సీజన్ కావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఈసీ ఆంక్షలు విధించడంతో దుకాణాలన్నీ మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. నిత్యం మద్యం సేవించేవారికి ఈ విధానం ప్రతికూలంగా మారడంతో వారంతా కల్లు దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఉదయం,

కల్లుతో కానిద్దాం..!

సాయంత్రం కూలీ పనులకు వెళ్లి వారి నుంచి, ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారు సైతం కల్లుతోనే సరిపెట్టుకుంటున్నారు. తాటిచెట్ల వద్దకు చేరుకుని లొట్టిల లెక్క కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. గతంలో ప్రధాన రహదారుల వద్ద దుకాణాలు పెట్టుకుని కల్లు అమ్ముతుండగా, ఇప్పుడు ఏకంగా తాటిచెట్ల వద్దే హోల్‌సేల్‌గా కల్లు కొనుగోలు చేస్తున్నారు.

- నెల్లూరు (సిటీ)





మందు లేకుంటే ఎట్లా చెప్మా..!

- రాజకీయ పక్షాల తర్జన భర్జన
- దుకాణాల్లోని సగం సరుకు వైసీపీ నేతలకే..
- ముందుజాగ్రత్తగా నిల్వలు
- ఇతర రాష్ట్రాల మద్యం జోరు

కందుకూరు, ఏప్రిల్ 25: మందు లేకుంటే ఎట్లా చెప్మా.. ఎన్నికలంటే మందుబాబులదేకదా సందడి. నామినేషన్ల ఘట్టం మొదలు పోలింగ్ పూర్తయ్యేవరకు వారిని తృప్తిపరచకుంటే ఆ తలనొప్పి భరించేది కాదంటూ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఓట్లకోసం ఎంత డబ్బు పంపిణీ చేసినా, చాలినంత మందు పోయలేకపోతే మందుబాబులంతా నెగెటివ్ ప్రచారం చేస్తారు. ఎన్నికల నగారా మోగి, ప్రచారంలో నేతలు తలమునకలై ఉన్నా వారి ఆలోచనలన్నీ మద్యం ఎలా తెప్పించాలనే... తీసుకువస్తే ఎక్కడ నిల్వ చేయాలి.. దాన్ని మందుబాబుల చెంతకు ఎలా చేర్చాలి..? అనే దానిపైనే చర్చలు సాగుతున్నాయి. అక్రమంగా మద్యం రవాణాలో ఆరితేరిన వారికి ప్రత్యేకంగా ఈ బాధ్యతలు అప్పగించి, అక్రమ నిల్వలకు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఇప్పటికే నిల్వలు

కందుకూరులో ఇప్పటికే వైసీపీ నేతలు పెద్దఎత్తున మద్యాన్ని తెప్పించి అక్రమంగా నిల్వచేసినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం తయారీ, రవాణా, విక్రయం అంతా ప్రభుత్వం ముసుగులో నడుస్తుండటంతో వారికి కొంత వెసులుబాటు కనిపిస్తోంది. ఇటీవల మధ్యాహ్నానికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నోస్టాక్ బోర్డులు పెట్టేస్తున్నారు. ఇందుకు కారణం మద్యం అంతా వైసీపీ అభ్యర్థులకోసం పక్కదారిపడుతుండడమే. కందుకూరులో ఇప్పటికే అధికారపార్టీ నేతలు రెండు లారీల చీప్‌లిక్కర్‌ను అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం. కాగా మద్యం ఎలా నిల్వ చేయాలని టీడీపీ నేతలు సతమతమవుతున్నారు. అధికార పార్టీవారు రాష్ట్రంలో తయారయ్యే మద్యాన్ని అక్రమ పద్ధతుల్లో తెప్పించుకునే వెసులుబాటు ఉంది. అలాగే పక్కనే ఉన్న తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, గోవా తదితర రాష్ట్రాల నుంచి కూడా మద్యాన్ని అక్రమ మార్గంలో తెప్పించుకుని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే టీడీపీకి పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెప్పించుకోవటం మినహా మరోమార్గం లేదు. ప్రభుత్వ దుకాణాల నుంచి కూడా వారికి మద్యం లభించే అవకాశం లేదు. గోవా రాష్ట్రానికి చెందిన మద్యాన్ని కందుకూరుకు చెందిన ఓ పార్టీ నేతలు తెప్పిస్తుండగా ముందస్తు సమాచారంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు రెండురోజులక్రితం సీజ్ చేసిన విషయం తెలిసిందే. ధర ఎక్కువైనా ఫర్వాలేదు... మాకు అవసరం మేరకు మద్యం సరఫరా చేయమని మధ్యవర్తులతో చర్చలు జరుపుతున్నారు. చీప్‌లిక్కర్ కూడా సగానికి సగం అదనంగా చెల్లించి కొనుగోలు చేయటానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం.



ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నానికి మూత

కోవూరు పట్టణ వ్యూ



రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం

ఎంతోమంది ప్రముఖులను అందించిన స్థానం

చైతన్యానికి చిరునామా కోవూరు

కోవూరు, ఏప్రిల్ 25 : రాష్ట్ర రాజకీయాల్లో కోవూరు నియోజక వర్గానికి ప్రత్యేక స్థానముంది. చైతన్యానికి చిరునామాగా ఈ సెగ్మెంట్ నిలిచింది. ఇక్కడ నుంచి ఎన్నికయిన ఎంతో మంది ప్రముఖులు రాష్ట్రరాజ కీయాల్ని ప్రభావితం చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తరువాత కోవూరు నియోజకవర్గ పరిధిలోకి కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట మండలాలు చేరాయి. అంతకుముందు సంగం, బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవ లూరు మండలాలు మాత్రమే ఉండేవి. 1962 నుంచి ఇప్పటి వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలోనే రెండుసార్లు ఉపఎన్నికలు జరగ్గా నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి విజయం సాధించారు. మే13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో సుదీర్ఘ రాజకీయ అనుభవ మున్న నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తలపడుతున్నారు.

- కమ్యూనిస్టుల కంచుకోట

1951 నుంచి 1962 వరకు కోవూరు కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది.



కోవూరు నియోజకవర్గ మ్యాపు

ఇందుకూరుపేట, అల్లూరులతో కలిసిన ద్విసభ్య నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ నాయకులు బస్వారెడ్డి శంకరయ్య, స్వర్ణా వేమయ్య గెలుపొందారు. 1962లో కమ్యూనిస్టులపై పోటీచేసి గెలిచిన రేబాల దశరథరామిరెడ్డి అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1972,1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన పెళ్ళకూరు రామచంద్రారెడ్డి కోస్తా అభివృద్ధి మండలి చైర్మన్‌గా, ఇఫ్కో చైర్మన్‌గా పనిచేశారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి రాష్ట మంత్రిగా పలు కీలకశాఖలు నిర్వహించారు.1983 ఎన్నికల్లో సీపీఎంకు కేటాయించక పోవడంతో వామపక్షాలు, టీడీపీ మధ్య పొత్తు కుదరలేదని చెబుతా రు. నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యే ఎన్నికై నప్పటి నుంచి కోవూరు ఎప్పుడూ కూడా రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూనే కన్పించింది.

- ఇక్కడ నుంచే పుచ్చలపల్లి ప్రస్థానం

కోవూరు నుంచి కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన ఎందరో మహానుభావులు ఎన్నికయ్యారు. పార్లమెంటులో తొలి ప్రతిపక్షనాయకుడు, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య నియోజకవర్గ పరిధిలోని అలగానిపాడు నుంచే రాజకీయ ఓనమాలు దిద్దుకున్నారు. ఆంధ్రరాష్ట్ర మొద టి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి స్వగ్రామం బుచ్చిరెడ్డిపాళెం. ఆయన సోదరుడు బెజవాడ పాపిరెడ్డి గొప్ప పార్లమెంటేరియన్‌గా పేరుపొందారు. ఆయన కూడా బుచ్చి నివాసే.

ఇప్పటి వరకు కోవూరులో విజయం సాధించిన నేతలు

సంవత్సరం	విజేత	పార్టీ
1962	రేబాల దశరథరామిరెడ్డి	కాంగ్రెస్
1967	కే వెంకురెడ్డి	కాంగ్రెస్
1972	పెళ్ళకూరు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్
1978	పెళ్ళకూరు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్
1983	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
1985	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
1989	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	కాంగ్రెస్
1993	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడి	టీడీపీ
1994	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
1999	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
2004	పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	కాంగ్రెస్
2009	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
2012	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడి	వైసీపీ
2014	పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
2019	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	వైసీపీ

ఏబీ ఫారాలంటే...?

ఏ ఎన్నికల సమయంలో ఏ ఫారం, బీఫారం అనే పదాలు తరుచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ /జాతీయ పార్టీలు తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు బీఫారం ఇస్తాయి. అంటే పలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడుకాని, ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి కానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో ఆర్వోకి బీఫారం దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇలా సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. బీఫారం ఇచ్చే అధికారాన్ని అప్పగిస్తూ ఇచ్చేదే ఏ ఫారం. దీన్ని తీసుకున్న వ్యక్తే అభ్యర్థులకు బీఫారం ఇచ్చే అధికారం ఉంటుంది.

- సంగం

తెలుసుకుందాం

మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారు..



యాభైఏళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో మాటకు ప్రాధాన్యమిచ్చేవారు. ఏ జాము అయినా నాయకుడు ఇళ్ల కాడికి వచ్చి... ఎన్నికల్లో నిలుస్తున్నా.. ఏమంటావ్... మనోళ్లతో మాట్లాడు... అని చెప్పేవాడు. డబ్బు మాటే మాట్లాడే వారు కాదు. సందేళ కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడి ఓ నిర్ణయానికి వచ్చేవాళ్లం. అది కూడా ఇంటి పెద్ద నిర్ణయం మేరకు ఓట్లు వేసేవాళ్లం. ఆ రోజుల్లో అభివృద్ధి చేసే వాళ్లే పోటీ పడేవారు. మాటకు కట్టుబడి ఉండేవారు. ఈ రోజుల్లో అలాంటి వారు కరువయ్యారు.

- గనిపినేని నాగరాజు, బిట్రగుంట